

'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 292


శుక్రవారం 12-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో స్క్రాచ్ కార్డ్ స్కీమ్ ప్రారంభం

సోనోవిజన్ స్క్రాచ్ కార్డ్ స్కీమ్ కోసం కొనుగోలుదారులు ఎదురుచూస్తున్నారు. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్క్రాచ్ చేయగా మినిమం 6% చాలా మందికి మరింత ఎక్కువ ఎమౌంట్ వచ్చే ఈ స్క్రాచ్‌కార్డ్ ఎప్పుడు లాభదాయకం. సంక్రాంతికు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ఈ సంవత్సరం ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. అన్ని పెద్ద కంపెనీల నుండి ఎల్.ఇ.డి, వాషింగ్ మెషిన్స్, రిఫ్రిజిరేటర్స్, ఎ.సి, మొబైల్స్ & ల్యాప్‌టాప్స్ మరియు గృహోపకరణములు అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి. ముఖ్యంగా సోనోవిజన్ స్పెషల్ క్యాష్‌బ్యాక్ ఆఫర్స్‌లో 15% వరకు లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 292
శుక్రవారం 12-1-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



'క్లీన్‌సిటీ' విశాఖ

కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌–2023 ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్‌కు అవార్డుల పంట పడింది. విశాఖకు ఆలిండియా 4వ ర్యాంకు, విజయవాడకు 6, తిరుపతికి 8వ ర్యాంకు లభించగా.. హైదరాబాద్‌ 9, ఇండోర్‌ మొదటి స్థానంలో నిలిచాయి. ఫాస్ట్‌ మూవింగ్‌ సిటీ విభాగంలో గుంటూరుకు 2వ ర్యాంకు లభించింది. పులివెందులకు 'క్లీన్‌ సిటీ ఆఫ్‌ ఏపీ' అవార్డు లభించింది.

4లో

వద్దు బాబూ.. మీకో దండం!

సొంత జిల్లాలోనూ చంద్రబాబు ఎదురీత.. కుప్పంలో ఓటమి ఖాయమని సర్వేల్లో తేటతెల్లం

చిత్తూరు, తిరుపతికి పార్లమెంట్‌ అభ్యర్థులు కరువు

మిగిలిన అసెంబ్లీ స్థానాలకూ వేధిస్తున్న క్యాండిడేట్ల కొరత

ప్రొద్దుటూరులో 'వరద'కు సీటు గోవిందా!

చింతమనేనికి షాక్‌

డబ్బుకు బాబు దాసోహం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ధనవంతుల కోసం చంద్రబాబు వేట

- వివరాలు 10లో

మరో మహిళా విప్లవం

'జగనన్న తోడు' లబ్ధిదారుల్లో 87.13% మంది నా అక్క చెల్లెమ్మలే: సీఎం జగన్‌

అందులో కూడా 79.14% మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే..

- చిరువ్యాపారులకు తోడుగా.. దేశానికే దిక్సూచిలా పథకం అమలు
- దేశవ్యాప్తంగా 'పీఎం స్వనిధి'తో 7% వడ్డీకి రూ.10,220కోట్ల రుణాలు
- జగనన్న తోడు ద్వారా 16.73 లక్షల మందికి వడ్డీ లేకుండా రూ.3,373 కోట్లు
- మన రాష్ట్రంలో జరిగినట్లు మిగతా రాష్ట్రాల్లో ఎందుకు జరగట్లేదు?
- గతంలో నిరర్థక ఆస్తులుగా 18% పొదుపుసంఘాలు.. ఇప్పుడవి 0.3%
- ఏపీలో 95%పైగా రుణాల రికవరీ.. దీంతో మహిళల చేతికి మళ్లీ రుణాలు
- గొప్పవైన మన సచివాలయాలు, వలంటీర్‌ వ్యవస్థలదే కీలక పాత్ర
- జగనన్న తోడు 8వ విడతతో చిరు వ్యాపారులకు రుణాలు, వడ్డీ రీయింబర్స్‌ కింద రూ.431.58 కోట్లు ఖాతాల్లోకి జమ చేసిన సీఎం

2లో



జగనన్న తోడు చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

"'జగనన్న తోడు' ద్వారా మహిళా సాధికారత, సామాజిక సాధికారతలో మరో విప్లవాన్ని సాధించాం. పథకం ద్వారా లబ్ధి పొందిన మొత్తం 16.73 లక్షల మంది చిరువ్యాపారుల్లో 87.13 శాతం మంది నా అక్క చెల్లెమ్మలే కావడం, అందులోనూ 79.14 శాతం మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉండటం దీనికి నిదర్శనం. పారదర్శకంగా రుణాలిప్పించడంతో పాటు అంతే స్థాయిలో సకాలంలో తిరిగి చెల్లింపులు చేయించ గలుగుతున్నాం. తద్వారా రుణాల రికవరీ 95 శాతానికిపైగా ఉంది. రికవరీ బాగుండటంతో మళ్లీ రుణాలు అందుతున్నాయి. ఇదంతా ఒక చక్రం మాదిరిగా కొనసాగుతోంది. సాధికారత విషయంలో ఇది చాలా పెద్ద అచీవ్‌మెంట్‌. ఇందులో సచివాలయాలు, వలంటీర్‌ వ్యవస్థలది కీలకపాత్ర.

- ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌

ప్రజాభిప్రాయం.. సామాజిక న్యాయం

15 శాసనసభ, 6 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమించిన సీఎం వైఎస్‌ జగన్‌

- మూడో జాబితాను ప్రకటించిన మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- మొత్తంగా 50 శాసనసభ, 9 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తల నియామకం
- ప్రజాభిప్రాయం, సామాజిక న్యాయం, మహిళలు, యువతకు పెద్దపీట
- గతంలో అగ్ర వర్ణాలకు కేటాయించిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు చోట్ల బీసీలు, రెండు చోట్ల మైనార్టీలకు అవకాశం
- గతంలో ఓసీలకు కేటాయించిన రెండు లోక్‌సభ స్థానాల్లో బీసీలకు అవకాశం
- 50 మంది సమన్వయకర్తల్లో ఎస్సీలు 14, ఎస్టీలు 3, బీసీలు 16, మైనార్టీలు 4, అగ్రవర్ణాలు 13
- 9 లోక్‌సభ స్థానాల సమన్వయకర్తల్లో.. బీసీలు ఆరుగురు, ఒక ఎస్సీ, ఒక ఎస్టీ, ఒక ఓసీ
- 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా అవసరమైన చోట్ల సమన్వయకర్తలలో మార్పులు

4లో

లోక్‌సభ స్థానాల సమన్వయకర్తలు వీరే...


పేరాడ తిలక్‌ (బీసీ)
శ్రీకాకుళం


బొత్స ఝాన్సీ (బీసీ)
విశాఖపట్నం


కె. సునీల్‌ యాదవ్‌ (బీసీ)
ఏలూరు


కేశినేని నాని
విజయవాడ


గుమ్మనూరు జయరాం(బీసీ)
కర్నూలు


కె. ఆదిమూలం (ఎస్సీ)
తిరుపతి



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ప్రాణాపాయంలో కొండంత అండ



అర్చకత్వం నా వృత్తి. శ్రీకాకుళం జిల్లా మందస మండలం మూలిపాడు పంచాయతీ శ్రీనివాసపురంలోని శ్రీబాలాజీ రఘునాథస్వామి ఆలయ పూజారిగా పని చేస్తున్నా. దానిపై వచ్చే ఆదాయంతోనే జీవిస్తున్నా. నాకు భార్య, ఇద్దరు మగ పిల్లలు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారులు ఇద్దరూ విశాఖపట్నంలో ప్రైవేటు దుకాణాల్లో పని చేస్తున్నారు. కుమార్తెకు వివాహం చేసి అత్తారింటికి పంపించాం. ఏదోలా కాలం గడుపుతున్న నాకు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. ఆస్పత్రిలో చూపిస్తే ఆపరేషన్ చేయాలని చెప్పారు. పెద్ద మొత్తంతో ఖర్చవుతుందని చెప్పడంతో ఏం చేయాలో పాలుపోలేదు. ఆరోగ్య శ్రీ వర్తిస్తుందని గ్రామ పెద్దలు చెప్పడంతో శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రికి వెళ్లాము. అక్కడ ఒక్క నయా పైసా ఖర్చు లేకుండా శస్త్ర చికిత్స జరిగింది. ప్రస్తుతం కోలుకుంటున్నాను. నా భార్య పంకజ డ్వాక్రా మహిళా సంఘం సభ్యురాలు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద ఏటా రూ.15,000 వంతున మూడేళ్లుగా అందింది. గతంలో తీసుకున్న డ్వాక్రా రుణానికి సంబంధించి వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు రూ.18,600 ఆమె ఖాతాలో జమయ్యాయి. మేము హాయిగా జీవిస్తున్నాం.

– రమేష్ మహంతి, శ్రీనివాసపురం
(కొంచాటి ఆనందరావు, విలేకరి, మందస)

వలస వచ్చినా ఇల్లు ఇచ్చారు



13 సంవత్సరాల క్రితం మా మేన మామ తాతారావుతో నా వివాహం జరిగింది. ఆ తర్వాత బతుకుతెరువు కోసం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం ఇరువాడ గ్రామానికి వచ్చాం. మా స్వగ్రామం కృష్ణా జిల్లా మచిలీపట్నం. నా భర్త కేటరింగ్‌తో పాటు వంట మాస్టర్‌గా పని చేస్తారు. నేను నా భర్తకు ఇంటి దగ్గర కేటరింగ్‌కు అవసరమైన సహాయం చేస్తూ ఇంటి పనులు చూసుకుంటాను. ఈ ప్రాంతంలో సొంతిల్లు లేకపోవడంతో ఇద్దరు పిల్లలతో ఇరువాడ బీసీ కాలనీలో అద్దెకు ఉండేవాళ్లం. వచ్చే రూ.9, 10 వేల ఆదాయంలో అద్దెకే రూ.3 వేలు ఇవ్వాల్సి వచ్చేది. మిగిలిన సొమ్ముతో కుటుంబం గడవడం కష్టంగా ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకున్నాం. సబ్బవరం సమీపంలో జాతీయ రహదారిని ఆనుకొని ప్రభుత్వం స్థలం ఇచ్చింది. ఇల్లు కట్టుకోవడానికి రూ.1.80 లక్షలు ఇచ్చారు. మేము మరి కొంత డబ్బు వెచ్చించి ఇల్లు నిర్మించుకున్నాం. మా కల నెరవేరింది. సొంతింట్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఉంటున్నాం. మాకు జగనన్న ఇచ్చిన స్థలమే బహిరంగ మార్కెట్లో రూ.6 లక్షలకు పైగా పలుకుతుంది. మాకు ఇద్దరు పిల్లలు. బాబు వినయ్‌నాయుడు సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. నాలుగేళ్లుగా అమ్మ ఒడి ఏటా రూ.15,000 వంతున వస్తోంది. పాప జాహ్నవి అదే పాఠశాలలో 4వ తరగతి. మా సొంతింటి కలను నెరవేర్చిన జగనన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– పల్లి జానకీదేవీ, ఇరువాడ
(సుర్ల నాగేశ్వరరావు, విలేకరి సబ్బవరం)

అమ్మనాన్నలకు భారం కాకుండా చదువు



మాది నిరుపేద గిరిజన కుటుంబం. మా నాన్న ఆరిక భాస్కరరావు, అమ్మ కుసుమ పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం సంతోషపురం గ్రామంలోని కొండపై పోడు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నా చదువు వారికి పెద్ద భారంగా మారింది. ప్రభుత్వం అందించిన అమ్మ ఒడి పథకం ద్వారా ఇంటర్ వరకు సులువుగా సాగిపోయింది. డిగ్రీ చదవాలంటే పార్వతీపురం వెళ్లాల్సిందే. అంత ఖర్చు ఎలా భరించాలో తెలీక అమ్మానాన్న మొదట భయపడ్డారు. మా ఊరి పెద్దల సూచనతో హాస్టల్‌లో ఉండి చదువుకుంటే ప్రభుత్వం వసతి దీవెన, విద్యా దీవెన వంటి పథకాలు అందిస్తుందని చెప్పడంతో పార్వతీపురం ఎస్‌వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాను. నాకు విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా ఇప్పటి వరకు రూ.40 వేలు అందింది. దాంతో అమ్మనాన్నలకు భారం కాకుండా చదువు సాగిపోతోంది. ఇప్పుడు నేను డిగ్రీ ద్వితీయ సంవత్సరం. డిగ్రీ పూర్తయ్యాక ఏదైనా ఉద్యోగం చేసి కుటుంబానికి ఆసరాగా నిలుస్తాను. కొండపోడు వ్యవసాయం చేస్తున్న మా నాన్నకు వైఎస్సార్ రైతు భరోసా గతేడాదే వర్తించింది. ఈ ప్రభుత్వం లేకపోయుంటే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం.

– ఆరిక సాయికిరణ్, సంతోషపురం, కురుపాం మండలం
(ఆళపు జయంత్‌కుమార్, విలేకరి, పార్వతీపురం రూరల్)

మరో మహిళా విప్లవం

సాక్షి, అమరావతి: 'జగనన్న తోడు' ద్వారా చిరువ్యాపారులకు ప్రభుత్వం తోడుగా నిలుస్తూ మానవత్వానికి మరో పేరుగా నిలిచిందని సీఎం జగన్ పేర్కొన్నారు. ఈ పథకం దేశానికే దిక్సూచిలా నిలిచిందన్నారు. దేశం మొత్తం మీద 'పీఎం స్వనిధి' ద్వారా ఏడు శాతం వడ్డీకి రూ.10,220 కోట్ల రుణాలు ఇవ్వగా ఏపీలో జగనన్న తోడు కింద 16.73 లక్షల మంది చిరువ్యాపారులకు వడ్డీ లేకుండా రూ.3,373 కోట్లు రుణాలు అందజేశామన్నారు. జగనన్న తోడు ద్వారా వరుసగా 8వ విడత చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం ఇస్తూ, పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికి రూ.10,000, అంతకు పైగా కలిపి 3,95,000 మంది చిరు వ్యాపారులకు రూ.417.94 కోట్ల వడ్డీలేని కొత్త రుణాలను సీఎం జగన్ అందచేశారు. మొత్తం 16,73,576 మంది లబ్ధిదారుల్లో ఈ విడతలో వడ్డీ రీయింబర్స్ కింద 5.81 లక్షల మందికి రూ.13.64 కోట్లను కూడా ప్రభుత్వం అందచేస్తోంది. ఈ రెండూ కలిపి మొత్తం రూ.431.58 కోట్లను సీఎం జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి లబ్ధిదారులనుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ఏంమాట్లాడారంటే..

దశాబ్దాల దుస్థితికి పరిష్కారం..

లక్షల మంది చిరు వ్యాపారులకు మేలు చేసే మంచి కార్యక్రమమిది. చిరువ్యాపారుల బతుకులు ఎలా ఉంటాయో మన కళ్లముందే కనిపిస్తున్నా ఆ కష్టాలను ఎలా కడతేర్చాలని ఎప్పుడూ, ఎవరూ ఇంతలా మనసుపెట్టి, ఆలోచన చేసి నిర్ణయాలు తీసుకోలేదు. నా పాదయాత్రలో ప్రతి జిల్లాలో వారి కష్టాలను చూశా. వ్యాపారం చేసుకోవడానికి కూరగాయలు, పనిముట్లు, ముడిసరుకు కోసం కనీసం వెయ్యి రూపాయిలు పెట్టుబడి అవసరం. రూ.1,000 అప్పు ఇస్తే ప్రైవేట్ వ్యాపారులు అప్పటికప్పుడే వడ్డీ కింద రూ.100 మినహాయించుకుంటారు. ఇలా రూ.10 వడ్డీకి వెయ్యి రూపాయలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. అలా తీసుకుంటే కానీ వారి జీవితాలు ముందుకు సాగని దుస్థితి. దశాబ్దాలుగా ఇలాంటి పరిస్థితి కనిపిస్తున్నా దీనికి పరిష్కారం చూపేందుకు ఎవరూ ముందుకు రాలేదు.

మానవత్వానికి చిరునామా..

మనం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పరిస్థితి గురించి బ్యాంకర్లతో మాట్లాడాం. బ్యాంకర్లను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా చేస్తూ ఎలాంటి హామీ లేకుండా రూ.10 వేలు అప్పు ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. సకాలంలో తిరిగి చెల్లించేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ వడ్డీ భారం మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని ఒక భరోసా కల్పించాం. ఇవన్నీ చేస్తూ ఇవాళ 8వ దఫా కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. మన ప్రభుత్వం మానవత్వానికి చిరునామాగా నిలిచిందని గర్వంగా చెబుతున్నాం.

ఇతరులకూ ఉపాధి చూపుతున్నారు..

చేతి వృత్తిదారులు, ఫుట్‌పాత్ విక్రేతలు, తోపుడు బండ్లపై కూరగాయలు అమ్ముకునేవారు, రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు, గంపలు, బుట్టలపై అమ్మకాలు చేసేవారు, ఆటోలు, సైకిళ్లపై చిన్న చిన్న వస్తువులు అమ్ముకునేవారు, వివిధ వృత్తుల కళాకారులంతా స్వయం ఉపాధితో తాము జీవించడమే కాకుండా మరికొందరికి కూడా ఉపాధి కల్పిస్తున్నారు. ఇలాంటి వారికి జగనన్న తోడు కార్యక్రమం ఉపయోగపడుతుంది. లబ్ధిదారులకు రూ.10 వేలు ఎలాంటి గ్యారంటీ లేకుండా అందించి సకాలంలో చెల్లించిన వారందరినీ ప్రోత్సహిస్తూ ప్రభుత్వం తరఫున వడ్డీని వెనక్కి ఇచ్చాం. ఏటా రూ.1,000 చొప్పున ఈ మొత్తాన్ని పెంచుతూ రూ.13,000 వరకూ తీసుకుని వెళ్లేలా పథకాన్ని అమలు చేయడం సంతోషాన్నిస్తోంది.

రుణాలైనా.. రీయింబర్స్‌మెంటైనా

రాష్ట్రంలో గొప్ప విప్లవాత్మక అడుగులు పడుతున్నాయన్నది ఒక అంశం కాగా రెండోది మన ప్రభుత్వం దేశానికి దిక్సూచిగా ఉంది. ఎందుకంటే దేశవ్యాప్తంగా కేంద్రం 7% వడ్డీకి 58,65,000 మందికి 'పీఎం స్వనిధి' పేరుతో రూ.10,220 కోట్ల రుణాలు ఇవ్వగా ఒక్క ఏపీలోనే 16,74,000 మందికి రూ.3,373 కోట్ల మేర వడ్డీలేని రుణాలివ్వగలిగాం. మనం ఎలా చేయగలిగాం? మిగిలిన రాష్ట్రాలు ఎందుకు చేయలేకపోయాయో ఆలోచిస్తే చాలా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి. కేంద్రం అన్ని రాష్ట్రాలకు కలిపి 7%వడ్డీ మొత్తం కింద రూ.138 కోట్లు చెల్లిస్తే ఒక్క ఏపీలోనే చిరు వ్యాపారులకు రూ.88 కోట్లను వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద తిరిగి అందచేశాం.

జీవనోపాధి కల్పిస్తూ అడుగులు..

మన ప్రభుత్వం రాకముందు పొదుపు సంఘాల రుణాలకు సంబంధించి 18% ఎన్‌పీఏలుగా ఉంటే మనం వచ్చిన తర్వాత అది 0.3% లోపే ఉంది. పరివర్తన అనేది ప్రతి అడుగులోనూ జరిగింది. అక్క చెల్లెమ్మలు, మహిళా సాధికారత విషయంలో గొప్ప అడుగులు పడుతున్నాయి. వారికి జీవనోపాధి కల్పించేలా అడుగులు వేశాం. అమూల్, రిలయెన్స్, ఐటీసీ, పీ అండ్ జీ లాంటి పెద్ద పెద్ద కంపెనీలను తీసుకొచ్చి వారికి వ్యాపార అవకాశాలు కల్పించడం తోపాటు బ్యాంకులతో అనుసంధానించి రుణాలతో తోడ్పాటు కల్పించాం. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ లాంటి పథకాల ద్వారా అన్ని రకాలుగా తోడుగా నిలిచి మహిళ సాధికారత దిశగా అడుగులు వేయించగలిగాం. గత నాలుగున్నరేళ్ల పాలనలో చేకూర్చిన లబ్ధి అందుకు నిదర్శనం.

'జగనన్న తోడు' లబ్ధిదారుల్లో 87.13% మంది నా అక్క చెల్లెమ్మలే: సీఎం జగన్

అందులో కూడా 79.14% మంది నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉన్నారు



బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఎలా సాధ్యమైందంటే..?

మిగిలిన రాష్ట్రాలకు – మనకు ఎందుకు ఇంత తేడా వచ్చింది? మన ఫెర్‌ఫార్మెన్స్ (పనితీరు) మిగిలిన రాష్ట్రాల కన్నా ఎందుకని మెరుగ్గా, భిన్నంగా ఉంది? దేశానికి మార్గనిర్దేశం చేసే విధంగా ఎలా అడుగులు పడ్డాయి? అనేది ఒకసారి గమనిస్తే మన దగ్గర ఉన్న గొప్పవైన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలే దానికి కారణం. వీటి ద్వారా మనం పారదర్శకంగా రుణాలిప్పించడంతో పాటు అంతే స్థాయిలో సకాలంలో తిరిగి చెల్లింపులు చేయించగలుగుతున్నాం. అందులో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలది కీలకపాత్ర. రుణాల రికవరీ 95 శాతానికిపైగా ఉంది. సాధికారత విషయంలో ఇది చాలా పెద్ద అచీవ్‌మెంట్.

కొత్త వారికి వడ్డీలేని రుణాలు.. రెన్యువల్

ఇవాళ జగనన్న తోడు 8వ విడతలో మరో 86,084 మంది చిరువ్యాపారులకు రూ.86 కోట్లు వడ్డీ లేని రుణాలుగా అందిస్తున్నాం. వీరితో పాటు గతంలో ఈ స్కీమ్ ద్వారా రుణాలు పొందిన 3.09 లక్షల మంది చిరువ్యాపారులకు రూ.332 కోట్ల రుణాలను రెన్యువల్ కూడా చేస్తున్నాం. మొత్తంగా ఈ కార్యక్రమం ద్వారా దాదాపు రూ.418 కోట్లను 3,95,000 మందికి ఇవాళ కొత్త రుణాలుగా అందిస్తున్నాం. అంతేకాకుండా గతంలో జగనన్న తోడు స్కీం ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 5,80,968 మంది లబ్ధిదారులకు వడ్డీ కింద రూ.13.64 కోట్లను తిరిగి వారికి ఇస్తున్నాం. మొత్తంగా ఇవాళ దాదాపు రూ.430 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చుతూ చిరు వ్యాపారులకు మంచి చేస్తున్నాం.

ఇప్పటిదాకా రూ.3,373 కోట్లు వడ్డీ లేని రుణాలు

జగనన్న తోడు పథకం ద్వారా తాజాగా చేకూరుస్తున్న లబ్ధితో కూడా కలిపి ఇప్పటివరకు 16,73,576 మంది చిరువ్యాపారులకు రూ.3,373 కోట్లు వడ్డీ లేని రుణాలుగా ఇచ్చాం. దీంతో పాటు వారు కట్టిన వడ్డీలు రూ.88.33 కోట్లను మళ్లీ తిరిగి వెనక్కి ఇచ్చే గొప్ప అడుగులు ఈ నాలుగున్నరేళ్లలో పడ్డాయి. ఈ స్కీమ్ ద్వారా ప్రయోజనం పొందిన వారి వివరాలను గమనిస్తే మొత్తం లబ్ధిదారుల్లో 73,072 మంది చిరు వ్యాపారులు ఇప్పటికే నాలుగుసార్లు డబ్బులు కట్టి తీసుకున్నారు. 5,10,241 మంది మూడుసార్లు డబ్బులు కట్టి తీసుకున్నారు. 3,98,229 మంది చిరువ్యాపారులు రెండు దఫాలు రుణాలు పొంది వాటిని తిరిగి చెల్లించి మళ్లీ తీసుకున్నారు.

గడప గడపలో సంతోషాన్ని చూశాం



చిరు వ్యాపారులు, కుల వృత్తులపై ఆధారపడే కుటుంబాలు గతంలో అప్పు తీసుకుంటే ప్రైవేట్ వ్యాపారులు ఖాళీ పేపర్లపై సంతకాలు పెట్టించుకుని రూ.6 నుంచి రూ.10 వడ్డీ వసూలు చేసేవారు. రూ.10,000 రుణానికి రూ.9,000 మాత్రమే ఇచ్చి రూ.వెయ్యి తిరిగి వసూలు చేసేవారు. ఆ పరిస్థితుల నుంచి ఇప్పుడు ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున అందచేస్తూ వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తోంది. వడ్డీ లేని మొత్తాన్ని ఏటా పెంచుతూ ఇప్పుడు రూ.13,000 వరకూ అందిస్తోంది. ఆ కుటుంబాలన్నీ మేం గడప గడపకూ వెళ్లినప్పుడు సంతోషంతో సీఎంకు ధన్యవాదాలు తెలిపాయి.

– బూడి ముత్యాల నాయుడు, డిప్యూటీ సీఎం (పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ)

ఇన్ని ఆలోచనలు.. మీకెలా సాధ్యం?



నేను పూల వ్యాపారం, టైలరింగ్ చేస్తున్నా. మా ఆయన మెకానిక్. కరోనా సమయంలో డబ్బుల కోసం చాలా ఇబ్బందులు పడ్డాం. రూ.10 వేలు అప్పు తీసుకుంటే వెయ్యి తగ్గించుకుని రూ.9,000 మాత్రమే ఇస్తామన్నారు. ఆ సమయంలో వలంటీర్ జగనన్న తోడు గురించి చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నాం. ఎవరి సిఫారసు లేకుండా నా ఖాతాలో రూ.10 వేలు పడ్డాయి. ఆ తర్వాత సకాలంలో తిరిగి కట్టడంతో వడ్డీ వెనక్కి వచ్చింది. ఇది చాలా గొప్ప ఆలోచన. దేశంలో ఎవరూ ఇలాంటి ఆలోచన చేసి ఉండరు. నాకు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ కూడా వచ్చింది. గతంలో మా సంపాదనంతా వడ్డీలు కట్టడానికే సరిపోయేది. వైఎస్సార్ చేయూతకు కూడా నేను అర్హత పొందడంతో నేరుగా రూ.18,750 నా ఖాతాలోకి వచ్చాయి. ఇలా మూడు విడతల్లో లబ్ధి పొందా. ఇప్పుడు నాలుగో విడత కూడా వస్తుంది. ఇలా నాకు అన్ని పథకాలు అందడంతో మా కుటుంబం చాలా సంతోషంగా ఉంది. నా కోడలు కాన్పు సమయంలో సిజేరియన్ కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.1.50 లక్షలు ఖర్చవుతుందన్నారు. ఆరోగ్యశ్రీ కింద చేరడంతో ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. పైగా తిరిగి రూ.5,000 ఓ అన్నలా ఆర్థిక సాయం అందచేశారు. ఇన్ని ఆలోచనలు మీకెలా వస్తున్నాయి అన్నా? మా అమ్మ గతంలో ఫించన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరిగేది. ఇప్పుడు వలంటీర్ ఇంటి వద్దే ఇవ్వడంతో చాలా సంతోషంగా ఉంది. ఈసారి రూ.3,000 పెన్షన్ తీసుకుంది. మిమ్మల్ని నా పెద్ద కుమారుడు అని గర్వంగా చెబుతోంది. నాకు ఇల్లు కూడా వచ్చింది. మీరు కులం, మతం, రాజకీయం చూడకుండా అన్నీ గొప్పగా చేస్తున్నారు. మమ్మల్ని ఇప్పుడు వ్యాపారస్తులుగా గుర్తించి గౌరవిస్తున్నారు. గతంలో పేదలను ఎవరూ గుర్తించలేదు. ఈరోజు మేం బ్యాంకులకు వెళ్లి ధైర్యంగా కూర్చుని లోన్ కావాలని అడుగుతున్నామంటే మీరే కారణం. మీరు సీఎంగా రావడం మా అదృష్టం. మిమ్మల్ని తిరిగి గెలిపించుకుంటాం.

– లక్ష్మీదేవి, చిరువ్యాపారి, అనంతపురం

మీ చిరునవ్వుతో రాష్ట్రంలో వెలుగులు



ఎవరి పూచీకత్తు లేకుండా బ్యాంకులో రూ.10 వేలు ఇచ్చారు. మళ్లీ చెల్లించడంతో వడ్డీ తిరిగి ఇచ్చారు. టైలరింగ్ ద్వారా నెలకు రూ.6,000కిపైగా సంపాదిస్తున్నా. నాకు అమ్మ ఒడి వస్తోంది. విద్యా దీవెన ఇస్తున్నారు. ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లు ఖాళీ అయ్యాయి. గవర్నమెంట్ స్కూళ్లలో సీట్లు లేవని బోర్డు పెట్టే పరిస్థితి వచ్చింది. మీరు మా నుంచి వచ్చారు కాబట్టి ఇన్ని పథకాలు ఇస్తున్నారు. మీరు మాకు దేవుడిచ్చిన గిఫ్ట్. మా గ్రూప్ ద్వారా బ్యాంకులో రూ.10 లక్షలు లోన్ తీసుకున్నాం. వైఎస్సార్ సున్నా వడ్డీ వస్తోంది. ఆసరా ద్వారా రూ.3.60 లక్షలు మా గ్రూప్ మొత్తానికి ఇవ్వగా నాకు రూ.36 వేలు వచ్చాయి. నవరత్నాలలో భాగంగా ఇల్లు కూడా వచ్చింది. మా నాన్నకు హార్ట్ ఎటాక్ రావడంతో రూ.5 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఇంటిల్లిపాదీ బాధపడుతున్న సమయంలో మీరు డాక్టర్ రూపంలో కనిపించారు. ఆరోగ్యశ్రీ కింద వెంటనే ఉచితంగా ఆపరేషన్ చేశారు. నాన్న క్షేమంగా ఇంటికి వచ్చారు. అంతేకాకుండా ఏడాది వరకూ ప్రతి నెలా చెకప్, ఉచితంగా రూ.3,000 మందులు ఇస్తున్నారు. గతంలో వయసు మళ్లిన వారు ఎందుకు బతుకుతున్నామా అని భారంగా గడిపేవారు. ఇవాళ వారంతా ఇంటివద్దే పెన్షన్ ఇస్తున్న మిమ్మల్ని తమ బిడ్డలాగా భావిస్తున్నారు. మా నాన్న కూడా నేను ఇక్కడికి వచ్చేటప్పుడు జగనన్న నాకు దేవుడని చెప్పారు. ఉదయం నిద్ర లేవగానే మా ఇంట్లో మేమంతా మీ ఫోటో చూస్తాం. మీరిచ్చిన పథకాల ద్వారా నేను రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు లబ్ధి పొందా. మా అత్తమ్మకు ఆసరా సాయం అందడంతో రెండు ఆవులు కొనుగోలు చేశారు. మా మామకు రైతు భరోసా వస్తోంది. ఏపీలో మీ పథకం అందని ఇల్లంటూ లేదు. ఒక్కొక్కరు నాలుగైదు పథకాలు పొందుతున్నారు. గ్యారెంటీగా ఒక్కో ఇంటికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు దాకా ప్రయోజనం పొందుతున్నారు. ఇంతకంటే ఏం కావాలన్నా? మరెవరూ ఇన్ని పథకాలు అందజేయలేదు. మాకు ఏం కావాలో మీకు తెలుసు. మీ చిరునవ్వుతో ఏపీ వెలిగిపోతుంది.

– గౌరి, చిరువ్యాపారి, విజయనగరం

రుణమాఫీ మోసంతో చెవి పోగులు పోయాయి..



రోడ్డు పక్కన కాయలు విక్రయిస్తూ జీవిస్తున్నాం. కరోనా సమయంలో వ్యాపారం లేక, అప్పులు ఇచ్చిన వారు నానా మాటలు అంటుంటే చావాలో బతకాలో తెలియని పరిస్థితి ఎదుర్కొన్నాం. అలాంటప్పుడు జగనన్న తోడు ద్వారా రూ.10 వేలు అందాయి. ఏటా పెంచుతూ ఇప్పుడు రూ.13,000 ఇచ్చారు. సకాలంలో తిరిగి చెల్లిస్తున్నాం. మాకు వడ్డీ భారం లేకుండా తిరిగి వెనక్కి ఇస్తున్నారు. గతంలో రోడ్డు పక్కన వ్యాపారం చేయడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పుడు మీరు అందించిన సాయంతో సొంతంగా షాప్ పెట్టుకుని ఓనర్‌గా నిలబడ్డాం. గత సర్కారు డ్వాక్రా రుణమాఫీ అంటే నమ్మి మోసపోయాం. వడ్డీల మీద వడ్డీ వేసి నోటీసులు పంపారు. నన్ను చాలా ఇబ్బందులు పెట్టారు. దీంతో బంగారం తాకట్టు పెట్టి కట్టాల్సి వచ్చింది. ఆ తర్వాత ఎన్నిసార్లు తిరిగినా లోన్ ఇవ్వలేదు. గత ప్రభుత్వం నన్ను చాలా మోసం చేసింది. నాడు చెవిదిద్దులు కూడా లేని నేను ఈరోజు గొలుసు వేసుకున్నానంటే నిజంగా మీ దయవల్లే జగనన్నా! అలాంటిది మిమ్మల్ని ఎందుకు వదులుకుంటామన్నా! మాకు వేరే సీఎం, వేరే గవర్నమెంట్ ఎందుకన్నా! మాకు మీరుంటే చాలు. నేను ఇక్కడికి వచ్చే ముందు అమ్మా నువ్వు జగన్‌గారితో మాట్లాడాలని మా పాప ముద్దు పెట్టి పంపింది. టెన్త్ చదువుతున్న మా పాప గతంలో సంక్రాంతి సెలవులు వస్తే ఊరికి వెళ్లేది. ఇప్పుడు ఆన్‌లైన్ క్లాస్‌లు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు హోమ్‌వర్క్‌లు చేసి సార్‌లకు పంపాలట. ఇప్పుడు చదువులు చాలా బాగున్నాయి. నాడు – నేడు ద్వారా స్కూళ్లు ఎంతో బాగున్నాయి. స్కూల్‌కు ఒక్క పూట మానేస్తే ఎందుకు రాలేదని అడుగుతున్నారు. ఆరోగ్యం బాగోలేదంటే తగ్గిందా లేదా అని తరువాత విచారిస్తున్నారు. నా భర్తకు గుండె పోటు రావడంతో ఆరోగ్యశ్రీ కింద రూపాయి ఖర్చు లేకుండా విజయవాడ ఆసుపత్రిలో వైద్యం చేశారు. మా అమ్మమ్మ విజయవాడ ఆసుపత్రిలో క్యాన్సర్ చికిత్స పొందుతోంది. ఆమె దగ్గర ఎవరూ లేకపోయినా ఆసుపత్రిలో వారే దగ్గరుండి అన్నీ చూసుకుంటున్నారు. మందులు ఇచ్చి కోలుకున్న తర్వాత మాకు ఫోన్ చేసి చెబుతున్నారు. ఇదంతా ఆరోగ్యశ్రీ వల్లే! మా అమ్మమ్మ జగన్‌గారికి చూపించమని తన వీడియో కూడా పంపింది. ఆవిడ తరఫున కూడా మీకు ధన్యవాదాలు అన్నా! ఇంతవరకు ఏ ముఖ్యమంత్రీ కాపులను గుర్తించలేదు. మీరు కాపు మహిళలకు సాయం చేస్తున్నారు. ఆ డబ్బులతో చీరల వ్యాపారం చేస్తున్నా. రొటేషన్‌తో రూ.50 వేలకు పెంచగలిగా. నేను అమ్మ ఒడి కూడా తీసుకుంటున్నా. నా భర్తకు పెన్షన్ వస్తోంది. కలెక్టర్ పక్కన కూర్చుని మీతో మాట్లాడే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు.

– అడబాల సత్యవతి, చిరువ్యాపారి, కృత్తివెన్ను, కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి

'వ్యూహం'పై 22న తెలంగాణ హైకోర్టు తీర్పు

సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై వాదనలు పూర్తి

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం సినిమా విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. పిటిషనర్, నిర్మాత, దర్శకుడు, సీబీఎఫ్‌సీ తరఫు న్యాయవాదుల వాదనలు పూర్తి కావడంతో తుది ఉత్తర్వులను ఈ నెల 22న వెల్లడిస్తామని హైకోర్టు పేర్కొంది. తెలుగుదేశం పార్టీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా గురువారం మరోసారి విచారణ చేపట్టారు. నిర్మాత తరఫున సీనియర్ న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. '2023, అక్టోబర్ 28న సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్ కోసం నిర్మాత దరఖాస్తు చేసుకోగా, దానిని అడ్డుకునేందుకు అదే నెల 30న ఫిర్యాదు చేశారు. దీనిని 31న సీబీఎఫ్‌సీ చైర్మన్ తిరస్కరించారు. దాంతో నవంబర్‌లో మరోసారి ఫిర్యాదు చేశారు.నిర్మాత ఇదే హైకోర్టును ఆశ్రయించారు. రివిజన్ కమిటీ ఏర్పాటు చేసి సర్టిఫికెట్ జారీపై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. 9 మందితో ఏర్పాటైన కమిటీ కొన్ని మార్పులతో ఏకగ్రీవంగా సర్టిఫికెట్ జారీ చేసింది. అయితే దీనిని సవాల్ చేస్తూ టీడీపీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఇదే హైకోర్టు ఆదేశాల మేరకు ఇచ్చిన సర్టిఫికెట్‌ను మళ్లీ ఇదే కోర్టు నిలుపుదల చేయడం సరికాదు. చిత్రం విడుదలలో జాప్యం కారణంగా నిర్మాత పెద్ద ఎత్తున నష్టపోయే అవకాశం ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌ను కొట్టివేయాలి'అని విజ్ఞప్తి చేశారు. ఆర్జీవీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్ చెబుతున్నట్లు ఏపీ ఎన్నికలు సరైన కారణం కాదు. చిత్రం విడుదలను ఆపాలన్నదే వారి ఉద్దేశం. నిజంగా ఏపీ ఎన్నికలన్నదే కారణం అయితే మరి తెలంగాణలో విడుదలకు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారు. చిత్రం నిర్మాణం పూర్తయిన నాటి నుంచే అడ్డుకుంటూ వస్తున్నారు'అని వివరించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది శ్రవణ్‌కుమార్, సీబీఎఫ్‌సీ తరఫున ఏఎస్‌జీ నరసింహ శర్మ వాదనలు వినిపించారు.

'అంతరిక్షరంగంలో భారత్ అద్భుతాలు'

ఉప్పల్: అంతరిక్ష రంగంలో భారత్ అద్భుతాలు సృష్టించిందని ఇస్రో ప్రధాన కార్యాలయ అంతరిక్ష విజ్ఞానకార్యక్రమ సంచాలకుడు డాక్టర్ తీర్థ ప్రతిమ్ దాస్ అన్నారు. 'చంద్రయాన్-3 అంతరిక్ష భుజబలం భవిష్యత్తు'అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని ఉప్పల్ సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్ఐ సెమినార్ నిర్వహించాయి. ప్రతిమ్‌దాస్ మాట్లాడుతూ చంద్రయాన్ తొలిమిషన్-1 2008లో, చంద్రయాన్-2 ను 2019లో ప్రారంభించామని, చంద్రయాన్-3ని 2023కి వచ్చేసరికి పరిశోధన రంగాల్లో మార్గాన్ని సుగమం చేశామని పేర్కొన్నారు.



'ఊరు'కులు.. పరుగులు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం నుంచి రద్దీ పెరిగింది. శుక్రవారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో.. గురువారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు బయల్దేరి వెళ్తున్నారు. దీంతో ప్రధానంగా విజయవాడ మార్గంలో జాతీయ రహదారులతోపాటు ఇతర రోడ్లు రద్దీగా మారాయి. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని పంతంగి జీఎంఆర్ టోల్‌ప్లాజా వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. విజయవాడ వైపు పది టోల్ ద్వారాలను తెరిచి ఉంచారు. శుక్రవారం నుంచి రద్దీ మరింత ఎక్కువగా ఉండనుంది. - చౌటుప్పల్

సుప్రీం చెప్పినట్లే 'రిజర్వేషన్లు' ఉండాలి

ఏపీ విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పని చేస్తోన్న ఉద్యోగుల పదోన్నతుల్లో పాటించే రిజర్వేషన్లను సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సమీక్షించి ఇవ్వాలని హైకోర్టు చెప్పినట్లు ఏపీ విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం తెలిపింది. తమ సంఘం వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు సుప్రీం ఇచ్చిన తీర్పుల ప్రకారం భవిష్యత్తులో ఇచ్చే ప్రతి ప్రమోషన్‌లో రిజర్వేషన్లు పాటించాలని హైకోర్టు తీర్పులో పేర్కొన్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ గురువారం తెలిపారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్, భార్య సుధారాణి

సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్, ఆయన భార్య సుధారాణి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిద్దరికీ వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి సీఎం జగన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలు ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములకు ఎన్‌వోసీ ఇవ్వలేదు

సాక్షి, అమరావతి: నెల్లూరు నగరంలోని కలాన్ మసీదుకు చెందిన భూమికి ఎటువంటి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో) ఎల్.అబ్దుల్ ఖాదీర్ స్పష్టం చేశారు. నెల్లూరు మసీదు భూమికి ఎన్‌వోసీ ఇచ్చినట్లు జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నెల్లూరులో సర్వే నంబర్ 542లో 6.03 ఎకరాలకు ఎన్‌వోసీ ఇచ్చినట్టు అసత్య ప్రచారం జరుగుతోందన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

భారతి సిమెంట్స్‌కు బీఐఎస్ అవార్డు



కమలాపురం: సిమెంట్ తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్న భారతి సిమెంట్ పరిశ్రమకు చెందిన కమలాపురం మండలంలోని నల్లింగాయపల్లె యూనిట్‌కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అవార్డు లభించినట్లు భారతి సిమెంట్స్ సీఎంవో సాయి రమేశ్, చీఫ్ మేనేజర్ వై.కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. విజయవాడలో బుధవారం జరిగిన బీఐఎస్ 77వ వార్షికోత్సవ సమావేశంలో బీఐఎస్ సీనియర్ డైరెక్టర్ ఎంఏజే వినోద్ నుంచి భారతి సిమెంట్స్ పరిశ్రమ అధికారులు అవార్డు అందుకున్నారు. అధికారుల సమష్టి కృషి ఫలితంగానే సంస్థకు ఈ అవార్డు వచ్చిందని సాయి రమేశ్, కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారీ

చాగల్లు: అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతోందని ఆ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ జి.రామ్మోహనరావు, సీనియర్ టెక్నికల్ అధికారి ఎస్.భవానీ శంకర్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా చాగల్లులో టీఎస్ఆర్ మూర్తి స్టీల్ అండ్ సిమెంట్ డీలర్ కొండలరావు షాపు వద్ద భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు గురువారం రాత్రి నిర్వహించిన అవగాహన సదస్సులో రామ్మోహనరావు మాట్లాడుతూ.. శాశ్వతమైన భవన నిర్మాణాలకు ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన నాణ్యమైన సిమెంటును ఎంపిక చేసుకోవాలని సూచించారు. సిమెంట్ తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ మొదటి నుంచీ ఎంపిక చేసుకుంటోందని వెల్లడించారు. సీనియర్ టెక్నికల్ అధికారి భవానీ శంకర్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్‌తో నిర్మించిన కాంక్రీట్ శ్లాబ్‌ను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి, నాణ్యతా పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా బాండ్లను అందజేశారు. సేల్స్ అధికారి పి.రాజా, డీలర్ టి.కొండలరావు పాల్గొన్నారు.

19న అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం

అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనంను ప్రారంభించనున్న సీఎం జగన్

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి వెల్లడి

సాక్షి, అమరావతి: విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతివనాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి తెలిపారు. స్మృతివనం పనులను శ్రీలక్ష్మి గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 18.81 ఎకరాల స్థలంలో రూ.400 కోట్లతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంబేడ్కర్ స్మృతివనం, కాంస్య విగ్రహ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహం ఎత్తు 125 అడుగులు కాగా, పాదపీఠం ఎత్తు 85 అడుగులు అని, దీంతో మొత్తం విగ్రహం ఎత్తు 210 అడుగులు ఉంటుందన్నారు. ప్రపంచంలో ఇదే అత్యంత ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం అని తెలిపారు. స్మృతివనంలోని అంబేడ్కర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, కన్వెన్షన్ సెంటర్, మినీ థియేటర్, ఫుడ్ కోర్టు, చిన్నారులకు ప్లే ఏరియా, గార్డెన్లు, మ్యూజిక్ ఫౌంటెయిన్, వాటర్ ఫౌంటెయిన్‌లు కూడా సీఎం జగన్ ప్రారంభిస్తారని వివరించారు. స్మృతివనం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తామన్నారు.



అంబేడ్కర్ స్మృతివనం తుది దశ పనులను పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి

ప్రపంచంలోనే అద్భుతమైన కళాఖండం

ప్రపంచంలోనే అద్భుతమైన కళాఖండంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని తీర్చిదిద్దారని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. అంబేడ్కర్ స్మృతివనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడకే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచిన అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది తరలివస్తారని చెప్పారు.

అణగారిన వర్గాల ఆత్మగౌరవ చిహ్నమే అంబేడ్కర్ విగ్రహం

- నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు
- సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ విజయవాడలో భారీ ర్యాలీ




థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గొప్ప సంకల్పంతో విజయవాడలో ఏర్పాటు చేసిన డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం అణగారిన వర్గాల ఆత్మగౌరవ చిహ్నమని నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గురువారం విజయవాడలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహం వద్ద తుది దశ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ 'థాంక్యూ సీఎం సార్' ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం పరిశపోగు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. సీఎం జగన్ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల అభివృద్ధికి తగిన సహకారం అందిస్తూ.. సామాజిక సాధికారతను సాధించారని చెప్పారు. అమరావతిలో అంబేడ్కర్ స్మృతివనాన్ని నిర్మిస్తానన్న చంద్రబాబు.. ఐదేళ్లపాటు అసలు పట్టించుకోలేదని విమర్శించారు. కానీ సీఎం జగన్ చెప్పిన మాట ప్రకారం విజయవాడ నగర నడిబొడ్డున దేశంలోనే అత్యంత గొప్పగా అంబేడ్కర్ స్మృతివనాన్ని తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఈ నెల 19న జరిగే అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాదిగ వర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేయండి

కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల కోసం పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయడంతోపాటు వాటిలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి డీజీపీ, కలెక్టర్లు, వివిధ శాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. పోలింగ్ స్టేషన్లలో శాఖల వారీగా చేపట్టాల్సిన పనులను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల విద్య, ఉన్నత విద్య, పురపాలక శాఖకు చెందిన పాఠశాలలతో పాటు గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలని, విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్లు, ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.

బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష

తొలుత డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డితో సమావేశమైన జవహర్‌రెడ్డి అక్రమ మద్యం రవాణాను అరికట్టడం, పటిష్టమైన బందోబస్తు, చెక్ పోస్టుల ఏర్పాట్లు, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం, విచారణలో ఉన్న కేసులకు సంబంధించి త్వరలో చార్జిషీట్లు దాఖలు చేయడంపై సమీక్షించారు. సరిహద్దు రాష్ట్రాల వద్ద పటిష్టమైన చెక్ పోస్టుల ఏర్పాటుతో పాటు పోలీస్ బలగాలను పెద్దఎత్తున నియమించాలని సూచించారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. అడిషనల్ సీఈవో హరేందిరప్రసాద్, అడిషనల్ డీజీ బాగ్చి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్, ఎస్ఈబీ డైరెక్టర్ రవిప్రకాష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణపై అసత్య ప్రచారం

సాక్షి, అమరావతి: డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ విషయమై కొన్ని పత్రికల్లో అసత్య కథనాలు వెలువడటంలో ఎలాంటి వాస్తవం లేదని ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పారదర్శకంగా క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపడుతుంటే, కళాశాల విద్య కమిషనరేట్ నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ పత్రికల్లో కథనాలు రావడం బాధాకరమని సంఘ ప్రతినిధులు విచారం వ్యక్తం చేశారు. 23 ఏళ్ల నిరీక్షణ అనంతరం క్రమబద్ధీకరణ జరుగుతున్న తరుణంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సింది పోయి, ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలను వ్యాప్తి చేయడం బాధాకరమన్నారు. క్రమబద్ధీకరణపై సీఎం వైఎస్ జగన్ తీసుకున్న న్యాయబద్ధమైన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని నాయకులు వెంకటమ్మ, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పేర్కొన్నారు



దూడూ బసవన్న విన్యాసాలు



రంగవల్లుల్ని తీర్చిదిద్దుతున్న యువతులు

సచివాలయంలో సంక్రాంతి శోభ

ఏపీ సచివాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కర్రసాము, కత్తి సాము, తప్పెటగుళ్లు, హరిదాసులు, గంగిరెద్దులు, సన్నాయి, మేళతాళాలు, ఎడ్లబళ్లు, మహిళా ఉద్యోగినులు వేసిన రంగవల్లులు సంక్రాంతి శోభ తెచ్చాయి. కూచిపూడి నృత్యకారిణి మల్లిశెట్టి అనూష నాయుడు శిష్య బృందం నృత్యం, భవిరి రవి మిమిక్రీ, సచివాలయ ఉద్యోగులు ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకం అలరించాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎస్.సత్యసులోచన, కార్యదర్శి పి.శ్రీకృష్ణ పాల్గొన్నారు.

– సాక్షి, అమరావతి

కవులు, కళాకారులకు అండగా ప్రభుత్వం

సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే కవులు, కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తెలిపారు. ఏలూరులోని వైఎంహెచ్ఏ హాలులో రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర స్థాయి సంక్రాంతి సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేశ్ సాహితీ రంగంలో విశేష సేవ చేసిన 10 మంది కవులను విశిష్ట సాహిత్య పురస్కారంతో ఘనంగా సన్మానించి వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జిల్లాకు ఒకరు చొప్పున కవులు, సాహితీ సంస్థలను ఎంపిక చేసి వారికి ప్రత్యేక పురస్కారంతో పాటు రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు.



భోగి మంట వెలిగిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

రాష్ట్రంలో ఒంటరి పోరుకు బీజేపీ సిద్ధం

- 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల బయోడేటాల సేకరణ
- జాతీయ పార్టీ ఆదేశాలతో హడావుడిగా ప్రక్రియ ప్రారంభం
- టీడీపీతో పొత్తు కోసం పురందేశ్వరి, మరికొందరు నేతల యత్నాలు
- పొత్తు కోసం జాతీయ నాయకత్వం నిర్ణయాన్ని తొక్కిపట్టిన రాష్ట్ర నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈసారి కూడా ఒంటరిగానే పోటీ చేసేందుకు భారతీయ జనతా పార్టీ ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల నుంచి పార్టీ తరుపున పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల బయోడేటా సేకరణ మొదలుపెట్టింది. జాతీయ పార్టీ నేతల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ హడావుడిగా అభ్యర్థుల వివరాల సేకరణ ప్రారంభించింది. ఇందుకోసం జిల్లాకు ముగ్గురేసి పార్టీ నాయకులతో కమిటీలను ఏర్పాటు చేసి, గురువారం నుంచే జిల్లాలకు పంపింది. ఈ కమిటీలు శుక్రవారం కూడ జిల్లాలోనే మకాం వేసి అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల వారీగా అభ్యర్థుల బయోడేటాలు సేకరిస్తారు. నియోజకవర్గాల వారీగా పార్టీ ఎన్నికల కమిటీలను నియమించే బాధ్యతను ఈ ముగ్గురు సభ్యుల కమిటీలకే అప్పగించారు. ఓ పక్క జాతీయ నాయకత్వం ఒంటరి పోరుకు సిద్ధమైనప్పటికీ, రాష్ట్ర పార్టీలో ముఖ్య నాయకులు మాత్రం ఎలాగైనా ఈ ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మరికొందరు నేతలు ఉబలాటపడుతున్నారు. పొత్తు కోసం ఆఖరి వరకు ప్రయత్నాలు సాగించేందుకు వీలుగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి రహస్యంగా ఉంచారు. జాతీయ నేతల నుంచి గట్టి ఆదేశాలు రావడంతో ఇప్పుడు హడావుడిగా మొదలెట్టారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించిన అప్పటి అధికార తెలుగుదేశం పార్టీతో ఈసారి పొత్తు పెట్టుకోవాలని పురందేశ్వరి, మరికొందరు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందుకే అభ్యర్థుల వివరాలు సేకరించాలన్న జాతీయ నాయకత్వం నిర్ణయాన్ని తొక్కిపెట్టారన్న ఆరోపణలు పార్టీలో వినిపిస్తున్నాయి. పురందేశ్వరి ఆరు నెలల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి టీడీపీతో పొత్తుకు అనుకూలంగా ఉండే నేతలదే హవా అయిందని, వారే పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించేలా కార్యక్రమాలు చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే గతంలో రాష్ట్ర బీజేపీలో క్రియాశీలకంగా ఉండే నాయకులెవరూ ఇప్పుడు పార్టీ కార్యాలయానికి వచ్చే పరిస్థితులు లేవు. పార్టీలో, రాష్ట్ర పార్టీ కార్యాలయంలో 2019 ఎన్నికల తర్వాత టీడీపీ నుంచి వచ్చిన నాయకుల ప్రాధాన్యతే కొనసాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కూడా ఎన్నికలకు సంబంధించి పార్టీ జాతీయ నాయకత్వం నుంచి వచ్చిన కీలక అంశాలు, సమాచారాన్ని కార్యకర్తలు, నేతలకు తెలియకుండా రాష్ట్ర నాయకత్వం జాగ్రత్తగా వ్యవహరిస్తోందని రాష్ట్ర బీజేపీలో చర్చ సాగుతోంది.

‘క్లీన్‌సిటీ’ల్లో విశాఖకు నాలుగో స్థానం

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

- విజయవాడకు ఆరు, తిరుపతికి ఎనిమిదో స్థానం
- ‘ఫాస్ట్ మూవింగ్ సిటీ’ విభాగంలో గుంటూరుకు రెండో ర్యాంకు
- ‘క్లీన్‌సిటీ ఇన్ ద ఏపీ’ కేటగిరిలో పులివెందుల మున్సిపాలిటీకి అవార్డు
- ఫైవ్‌స్టార్ రేటింగ్స్‌తో దక్షిణాదిలో నంబర్‌వన్‌గా నిలిచిన ఏపీ
- వరుస అవార్డులతో విజయవాడ, జీవీఎంసీ హ్యాట్రిక్

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్-2023 ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్‌కు అవార్డుల పంట పడింది. జాతీయ స్థాయిలో ఫైవ్‌స్టార్ రేటింగ్స్‌తో నాలుగు కార్పొరేషన్‌లు ‘క్లీన్‌సిటీ’ అవార్డులను సొంతం చేసుకుని దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ నెంబర్‌వన్‌గా నిలిచింది. దేశంలో అత్యుత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగర పాలక సంస్థలు ఈ అవార్డులు దక్కించుకున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆలిండియా 4వ ర్యాంకు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు 6వ ర్యాంకు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు 8వ ర్యాంకు లభించగా.. హైదరాబాద్ తొమ్మిది, ఇండోర్ మొదటి స్థానంలో నిలిచాయి. అలాగే, ఫాస్ట్ మూవింగ్ సిటీ విభాగంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 2వ ర్యాంకు లభించింది. ఇక సీఎం వైఎస్ జగన్ నియోజకవర్గమైన పులివెందులకు ‘క్లీన్ సిటీ ఆఫ్ ఏపీ’ అవార్డు లభించింది. స్వచ్ఛ భారత్ మిషన్ రూపొందించిన సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్, సర్టిఫికేషన్, సిటిజన్ వాయిస్‌కి సంబంధించి 9,500 మార్కులకు గాను గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) 8,879.25 మార్కులు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది. అలాగే చెత్తరహిత నగరాల్లో ఫైవ్‌స్టార్ రేటింగ్‌ను విశాఖ సాధించింది. మరోవైపు..

- 2021, 2022, 2023 సంవత్సరాలలో గ్రేటర్ విశాఖ బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్, క్లీన్ బిగ్ సిటీ.. విజయవాడ కార్పొరేషన్ ఇండియా క్లీనెస్ట్ సిటీ, క్లీన్ స్టేట్ క్యాపిటల్ జాతీయ అవార్డులను వరుసగా సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకున్నాయి.
- ఇక తిరుపతి నగరం బెస్ట్ స్మాల్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ (2021), సఫాయిమిత్ర సురక్షిత్ ప్రెసిడెంట్ అవార్డు (2022), జాతీయ అవార్డు (2023) దక్కించుకుంది.
- పుంగనూరు పురపాలక సంఘం 2021, 2022లో బెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ అవార్డును, పులివెందుల 2022లో ఇన్నోవేషన్, బెస్ట్ ప్రాక్టీస్ అవార్డు, 2023లో స్టేట్ అవార్డును దక్కించుకున్నాయి.



పెరిగిన స్టార్ రేటింగ్ నగరాలు..

ఇదిలా ఉంటే.. గతేడాది కంటే ఈసారి ఎక్కువ నగరాలు స్టార్ రేటింగ్ ర్యాంకింగ్‌లో నిలిచాయి. గార్బేజ్ ఫ్రీ సిటీ రేటింగ్‌లో గతేడాది జీవీఎంసీ, తిరుపతికి మాత్రమే ఫైవ్‌స్టార్ రేటింగ్ వచ్చాయి. ఈసారి విజయవాడ, గుంటూరు, జీవీఎంసీ, తిరుపతి నగరాలూ ఈ రేటింగ్‌ను సొంతం చేసుకున్నాయి. వీటితోపాటు కర్నూలు, వైఎస్సార్ కడప 3 స్టార్ రేటింగ్‌లోను, బొబ్బిలి, పులివెందుల, రాజమండ్రి 1 స్టార్ రేటింగ్‌లోను నిలిచాయి.

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం..

ఢిల్లీలోని భారత్ మండపంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులను గురువారం ప్రదానం చేశారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ చేతుల మీదుగా మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్‌లు, అధికారులతో కలిసి మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ అవార్డులు అందుకున్నారు.



కేంద్ర మంత్రి నుంచి అవార్డులు అందుకుంటున్న మంత్రి ఆదిమూలపు సురేష్, విశాఖ నగర మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

పారిశుధ్యం విభాగంలో సర్వే, బెస్ట్ ప్రాక్టీస్, సిటీజన్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఈ అవార్డులను కేంద్ర ప్రభుత్వం జారీచేస్తుంది. దేశవ్యాప్తంగా నాలుగు వేల పట్టణ స్థానిక సంస్థలు పోటీపడగా ఏపీ టాప్-10లో నిలవడం విశేషం. అనంతరం.. ఏపీ భవన్‌లో విశాఖపట్నం మేయర్ గొలగాని వెంకటకుమారి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, తిరుపతి మేయర్ శిరీష యాదవ్, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అధికారులతో కలిసి మంత్రి ఆదిమూలపు సురేష్ మీడియాతో మాట్లాడారు.

సీఎం జగన్ ఆలోచనతోనే సాధ్యం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన విధానంతోనే దక్షిణ భారతదేశంలో ఏపీ టాప్-1గా నిలిచిందని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమాన్ని వైఎస్ జగన్ రెండు కళ్లుగా చూశారని, అభివృద్ధి అనేది సమస్యగా కాకుండా ఒక అవకాశంగా తీర్చిదిద్దారన్నారు. ఒకటే ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే ఏం జరుగుతుందో రాష్ట్ర విభజన ద్వారా అందరికీ అర్థమైందని చెప్పారు. ఆ పరిస్థితులు ఏపీలో పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రతి జిల్లాలకు ఒక అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటుచేసి ఆయా ప్రాంతాలన్నింటినీ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన ‘క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)-జగనన్న స్వచ్ఛ సంకల్పం’ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికులు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించడం, తడి-పొడి చెత్తలను వేరుచేయడం, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను అత్యంత హుందాగా, శ్రద్ధగా చేసినట్లు చెప్పారు. మరోపక్క.. రోడ్లు, పారిశుధ్యం, డ్రెయినేజీలు, మొక్కలు నాటడం, జంక్షన్ల అభివృద్ధి వంటి వాటిని అభివృద్ధి చేయడంవల్లే ఇది సాధ్యమైందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో మరిన్ని నగరాలు.. పట్టణాలు టాప్ ర్యాంకులు సాధించి అవార్డులు అందుకుంటాయని ఆదిమూలపు సురేష్ ధీమా వ్యక్తంచేశారు.

ప్రజాభిప్రాయం.. సామాజిక న్యాయం

సాక్షి, అమరావతి : జన బలమే గీటు రాయిగా.. సామాజిక న్యాయం చేకూర్చడంలో మరో అడుగు ముందుకేస్తూ.. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ.. యువతకు ప్రాధాన్యమిస్తూ 15 శాసనసభ స్థానాలకు, 6 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడో జాబితాను ఖరారు చేశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియా పాయింట్‌లో గురువారం రాత్రి విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డిలు ఆ వివరాలను ప్రకటించారు. గత నెల 11న 11 శాసనసభ స్థానాలకు.. ఈ నెల 2న 24 శాసనసభ, 3 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను నియమిస్తూ జాబితాలను విడుదల చేశారు. మొత్తం మూడు జాబితాల్లో కలిపి 50 శాసనసభ, 9 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను ప్రకటించారు. గత ఎన్నికల్లో ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన యువ నేత కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను సమన్వయకర్తగా నియమించారు. విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుంచి గత ఎన్నికల్లో ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని పోటీకి పెట్టగా, ఇప్పుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీని సమన్వయకర్తగా నియమించారు. శ్రీకాకుళం లోక్‌సభ సమన్వయకర్తగా పేరాడ తిలక్(బీసీ)ను నియమించారు. మంత్రి గుమ్మనూరి జయరాం(బీసీ)ను కర్నూలు లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తిరుపతి లోక్‌సభ స్థానం (ఎస్సీ) సమన్వయకర్తగా, విజయవాడ లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా కేశినేని నానిలను నియమించారు.

బీసీలు, మహిళలు, మైనార్టీలకు పెద్దపీట

మూడు జాబితాల్లో 50 శాసనసభ స్థానాల సమన్వయకర్తలను పరిశీలిస్తే.. సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది. గతంలో అగ్ర వర్ణాలకు చెందిన అభ్యర్థులను పోటీ పెట్టిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు స్థానాల్లో బీసీ, రెండు స్థానాల్లో మైనార్టీ వర్గానికి చెందిన వారిని సమన్వయకర్తలుగా నియమించారు. ఆరు శాసనసభ స్థానాలకు మహిళలను, 18 స్థానాల్లో యువతను సమన్వయకర్తలుగా నియమించారు. మొత్తమ్మీద 50 శాసనసభ స్థానాలకు ప్రకటించిన సమన్వయకర్తల్లో.. ఎస్సీలు 14, ఎస్టీలు 3, బీసీలు 16, మైనార్టీలు 4, ఇతర వర్గాలు 13 (రెడ్డి, కాపు, వైశ్య) మంది ఉన్నారు. ఇప్పటి వరకు ప్రకటించిన 9 లోక్‌సభ స్థానాల సమన్వయకర్తల్లో.. బీసీలు 6, ఒక ఎస్సీ, ఒక ఎస్టీ, ఒక ఓసీ ఉన్నారు. పెడన శాసనసభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తిని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్తగా, ఎమ్మెల్సీ మేరిగ మురళిని గూడూరుకు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను టెక్కలికి సమన్వయకర్తలుగా నియమించారు. ఏపీఐఐసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డిని రాయదుర్గం, మాజీ ఎమ్మెల్యే మూతిరేవుల సునీల్‌కుమార్‌ను పూతలపట్టు, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ విజయానందరెడ్డిని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు.

జెడ్పీ చైర్మన్‌లకు అవకాశం

శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియ విజయను ఇచ్ఛాపురం శాసనసభ స్థానం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా సీఎం జగన్ నియమించారు. ఇచ్ఛాపురం జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మను శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించారు. వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని రాజంపేట సమన్వయకర్తగా, చిప్పగిరి జెడ్పీటీసీ బూసినే విరూపాక్షిని ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు.

క్లీన్ స్వీప్ లక్ష్యం

సీఎం వైఎస్ జగన్ గత 56 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూ.2.45 లక్షల కోట్లు.. నాన్ డీబీటీ రూపంలో రూ.1.67 లక్షల కోట్లు.. వెరసి రూ.4.12 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చారు. రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం అందితే.. అందులో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉండటం గమనార్హం. గత 56 నెలల పాలనలో సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన వల్ల రాష్ట్రంలో ప్రతి రంగంలో విప్లవాత్మక మార్పు వచ్చింది. ఆ మార్పు ప్రతి కుటుంబంలో, ప్రతి గ్రామంలో, ప్రతి నియోజకవర్గంలో కళ్లెదుట కన్పిస్తున్నప్పుడు 175కు 175 స్థానాల్లో విజయం సాధించడం సుసాధ్యమేనని పార్టీ శ్రేణులకు సీఎం వైఎస్ జగన్ మార్గనిర్దేశం చేశారు. ప్రతి ఇంటా చేసిన మంచిని ప్రజలకు చెప్పి.. జనంతో మమేకమవుతూ సమస్యలు పరిష్కరించడం ద్వారా వారి మనసులు చూరగొని.. మరింత మంచి చేయడానికి ప్రజల ఆశీస్సులు కోరాలని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు మార్గ నిర్దేశం చేస్తూ వచ్చారు. ప్రజలతో మమేకం కాకుండా.. జనం మనసులు చూరగొనలేని వారికి టికెట్లు ఇవ్వలేనని ఆది నుంచి సీఎం వైఎస్ జగన్ తేల్చిచెబుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 175కు 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అవసరమైన స్థానాలకు సమన్వయకర్తలను నియమిస్తున్నారు.

కొత్త సమన్వయకర్తలు వీరే..

లోక్‌సభ స్థానం	సమన్వయకర్త
1.శ్రీకాకుళం	పేరాడ తిలక్ (బీసీ)
2.విశాఖపట్నం	బొత్స ఝాన్సీ (బీసీ)
3.ఏలూరు	కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ (బీసీ)
4.విజయవాడ	కేశినేని నాని
5.కర్నూలు	గుమ్మనూరి జయరాం (బీసీ)
6.తిరుపతి (ఎస్సీ)	కోనేటి ఆదిమూలం
శాసనసభ స్థానం పేరు	**సమన్వయకర్త**
1.ఇచ్ఛాపురం	పిరియా విజయ (బీసీ)
2.టెక్కలి	దువ్వాడ శ్రీనివాస్ (బీసీ)
3.చింతలపూడి (ఎస్సీ)	కంభం విజయరాజు
4.రాయదుర్గం	మెట్టు గోవిందరెడ్డి
5.దర్శి	బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
6.పూతలపట్టు (ఎస్సీ)	మూతిరేవుల సునీల్‌కుమార్
7.చిత్తూరు	విజయానందరెడ్డి
8.మదనపల్లి	నిస్సార్ అహ్మద్
9.రాజంపేట	ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
10.ఆలూరు	బూసినే విరూపాక్షి (బీసీ)
11.కోడుమూరు (ఎస్సీ)	డాక్టర్ సతీష్
12.గూడూరు (ఎస్సీ)	మేరిగ మురళి
13.సత్యవేడు (ఎస్సీ)	మద్దిల గురుమూర్తి
14.పెనమలూరు	జోగి రమేష్ (బీసీ)
15.పెడన	ఉప్పాల రాము (బీసీ)

మీకు ఓటీపీ ఎందుకు చెప్పాలి?

టీడీపీ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పోతురెడ్డిపల్లి వాసులు

నూజివీడు: ‘మా ఫోన్‌కు వచ్చిన ఓటీపీలు మీకు ఎందుకు చెప్పాలి. ఆ ఓటీపీలు చెప్పడం వల్ల మా బ్యాంక్ ఖాతాలో డబ్బులు పోతే ఎవరు బాధ్యులు...’ అంటూ టీడీపీ కార్యకర్తలను ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని పోతురెడ్డిపల్లి గ్రామస్తులు నిలదీశారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ కార్యకర్తల నుంచి ట్యాబ్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. దీనికి సంబంధించి నూజివీడు రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... పోతురెడ్డిపల్లికి చెందిన నూతక్కి హరిబాబు, మరొక వ్యక్తి అదే గ్రామంలోని కూకటి నాగేంద్రబాబు వద్దకు బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో వెళ్లి ఫోన్ నంబర్ చెప్పాలని అడిగారు. ఆయన నంబరు చెప్పిన తర్వాత ఓటీపీ వచ్చింది చెప్పాలన్నారు. ఓటీపీ చెప్పేందుకు నాగేంద్రబాబు నిరాకరించారు. ఓటీపీ ఎందుకు పంపుతున్నారని, తమ బ్యాంకు ఖాతాలో డబ్బులు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ఇంతలో అదే ప్రాంతానికి చెందిన పులపాక పృథ్వీరాజు, చాట్ల శ్రీను వారి వద్దకు వచ్చి ‘ట్యాబ్‌లో ఏముంది...’ అంటూ నిలదీశారు. దీంతో టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోతుండగా, వారి చేతిలోని ట్యాబ్ జారి పడిపోయింది. దానిని నాగేంద్రబాబు తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో పాటు ట్యాబ్‌ను అందజేశారు. ‘ఫోన్ నంబరుతోపాటు ఓటీపీలు చెప్పమంటున్నారు. తమ వ్యక్తిగత సమాచారమేమైనా తస్కరిస్తున్నారా? సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో బ్యాంకు ఖాతాల్లోని డబ్బు పోతే మా పరిస్థితి ఏమిటి..’ అని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగేంద్రబాబు నుంచి ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మరోవైపు కొందరు టీడీపీ కార్యకర్తలు ట్యాబ్‌లతో తిరుగుతూ ఫోన్ నంబర్లు తీసుకుని ఓటీపీలు చెప్పాలని అడుగుతున్నారని, దీనివల్ల రాబోయే రోజుల్లో ఇదే విధంగా సైబర్ నేరగాళ్లు తమను మోసం చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని పోతురెడ్డిపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటువంటి చర్యలను నిరోధించాలని కోరుతున్నారు.

అన్ని అనర్థాలకు కారణం చంద్రబాబే

ఆయన హయాంలోనే ఎక్కువ అప్పులు
రాష్ట్ర అప్పులపై ఎల్లో మీడియా తప్పుడు రాతలు

- రూ.10 లక్షలు కోట్లని, రూ.13 లక్షల కోట్లని రకరకాలుగా ఎలా రాస్తారు?
- టీడీపీ చేసిన అప్పులు కూడా వైఎస్సార్‌సీపీ ఖాతాలో వేసినా రూ.13 లక్షల కోట్లు లేవు
- రాష్ట్రానికి ఉన్న మొత్తం అప్పు రూ. 7 లక్షల కోట్లలో రూ. 4 లక్షల కోట్లు చంద్రబాబు చేసినవే

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అప్పులు, అన్ని అనర్థాలకు గత ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని, రాష్ట్ర ప్రభుత్వ అప్పుల్లో అధిక శాతం ఆయన చేసినవేనని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తేటతెల్లం చేశారు. ఆయన నిర్ణయాలన్నీ రాష్ట్రానికి అనర్థం కలిగించాయన్నారు. ప్రభుత్వ అప్పులపై టీడీపీ నేతలు, ఎల్లో మీడియా పదే పదే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రితో పాటు ఆర్‌బీఐ, కాగ్ అప్పులపై గణాంకాలతో సహా వెల్లడించినా, వాటిని కాదని లేని అప్పులు ఉన్నట్లుగా ఏ ప్రాతిపదికన, ఏ ఆధారాలతో చంద్రబాబు, ఎల్లో మీడియా చెబుతున్నారో తెలపాలని నిలదీశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎల్లో మీడియా తప్పుడు వార్తలు రాస్తోందన్నారు. మనసులో మాట పుస్తకంలో ప్రభుత్వ ఉద్యోగులకు, సబ్సిడీలకు వ్యతిరేకంగా రాసుకున్న చంద్రబాబు ఇప్పుడు అన్నీ ఇస్తానంటూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ‘మోసం నేర్చెను’.... అసలు తానే మారెను.. అయినా అతడి కాంక్ష తీరలేద’నే పాటలా బాబు వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. అప్పులపైన గణాంకాలతో పాటు, చంద్రబాబు గత నిర్వాకాలను ఆధారాలతో సహా గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుగ్గన వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అప్పులపై నిరాధార ఆరోపణలు

- అప్పులపై విపక్ష నేతలు తలో రకమైన లెక్కలు చెబుతున్నారు. ఒకడు రూ.7 లక్షల కోట్లంటాడు. ఇంకొకరు రూ.8 లక్షల కోట్లంటారు. తెచ్చిన అప్పులు రూ. 7.34 లక్షల కోట్లు ఏం చేశారని ప్రశ్నిస్తున్నారు.



ఈ ఆరోపణల్లో ఒక్కటీ నిజం కాదు. చంద్రబాబు, మాజీ మంత్రి యనమల ఏ ఆధారాలతో మా ప్రభుత్వం రూ. 13 లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపిస్తున్నారు? టీడీపీ చేసిన అప్పులు కూడా వైఎస్సార్‌సీపీ ఖాతాలో వేసినా రూ.13 లక్షల కోట్లు లేవని అన్నారు.

- ప్రభుత్వం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు అప్పు చేసిందని రుణకంటుడు సీఎం అంటూ రాసిన స్టోరీలో చెప్పారు. కానీ ఆ కథనంలోనే రాసిన మొత్తం అప్పు చూస్తే.. కేవలం రూ. 7,68,641 కోట్లు మాత్రమే. మరి రూ. 10 లక్షల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?
- పెండింగ్ బిల్లులు రూ. 1.70 లక్షల కోట్లు ఉన్నాయని రాశారు. డిపాజిట్లు, ఇతర మొత్తాలు కలిపి రూ. 28,286 కోట్లు అని రాశారు. ఈ లెక్కలు వారికి ఎవరు చెప్పారు? ఏ ఆధారాలతో రాశారు? ఇవన్నీ తప్పుడు లెక్కలే.

రాష్ట్ర అప్పు అప్పటికి రూ.4.28 లక్షల కోట్లు

గతంలో చాలాసార్లు చెప్పాం. మళ్లీ చెబుతున్నాం. ‘ఎ స్టడీ ఆఫ్ స్టేట్స్ బడ్జెట్స్’ అని చెప్పి 15 ఏళ్ల డేటాతో ఆర్బీఐ ఒక్కోసారి డాక్యుమెంట్ రిలీజ్ చేస్తుంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సీఏజీ)తో పాటు, వివిధ కేంద్ర రంగ సంస్థల నుంచి తీసుకున్న వివరాల (డేటా) ఆధారంగా ఆర్బీఐ ఆ డాక్యుమెంట్ (బుక్) రిలీజ్ చేస్తుంది. ఆ బుక్‌లో 15 ఏళ్ల డేటా ఉంటుంది.

- ఆ బుక్‌లో ఉన్న వివరాల ప్రకారం.. 2023 మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అప్పు రూ. 4,28,715 కోట్లు. అంతకు ముందు ప్రభుత్వంలో 2019 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ. 2,64,512 కోట్లుగా పేర్కొన్నారు. ఆ తర్వాత మా ప్రభుత్వం ఏర్పడే నాటికి.. అంటే 2019 మార్చి తర్వాత రెండు నెలల్లో గత ప్రభుత్వం చేసిన అప్పు మరో రూ. 7,346 కోట్లు. అంటే గత ప్రభుత్వం దిగిపోయే నాటికి.. అంటే 2019 మే చివరికి రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పు రూ. 2,71,797 కోట్లు. అంటే.. 2023 మార్చి 31 నాటికి ఉన్న ప్రభుత్వ మొత్తం అప్పు రూ. 4,28,715 కోట్లలో గత ప్రభుత్వం చేసిన అప్పు రూ. 2,71,797 కోట్లు తీసేయాలి కదా? అది చెప్పకుండా మొత్తం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చేసినట్లు ఎలా రాస్తారు? ఇలా మొత్తం అప్పులను ఈ ప్రభుత్వానిక ఆపాదించడం దారుణం.

బాబు హయాంలోనే ఎక్కువ అప్పులు

గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు ప్రభుత్వ అప్పు ఎలా పెరిగింది? ఆ తర్వాత 2019 నుంచి నాలుగేళ్లలో ఎంతెంత పెరిగిందని చూస్తే..

- 2014లో రాష్ట్ర విభజన నాటికి ఉన్న ప్రభుత్వ అప్పు రూ. 1,53,346 కోట్లు. గత ప్రభుత్వం దిగిపోయే నాటికి.. అంటే 2019 మే చివరికి ఆ రుణం రూ. 4,12,288 కోట్లకు చేరింది.
- మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాలుగేళ్లలో ప్రభుత్వ అప్పు రూ. 6,38,217 కోట్లు.
- అంటే గత టీడీపీ హయాంలో ప్రభుత్వ వార్షిక అప్పు 21.8 శాతం పెరగ్గా.. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏటా పెరిగిన అప్పు కేవలం 12 శాతమే. అది కూడా కోవిడ్ వంటి మహమ్మారి ఉన్నా కూడా చేసిన అప్పు తక్కువే.

ఆ అప్పుల్లో చంద్రబాబు చేసినవే ఎక్కువ

వారు చెబుతున్న ప్రకారం లెక్క వేసుకున్నా.. వారన్నట్లు రూ. 3.76 లక్షల కోట్లు బహిరంగ రుణాలు ఉంటే.. అందులో పాత రుణం రూ. 2,64,451 కోట్లు ఉన్నాయి. ఇది 2019 మే నాటికే చంద్రబాబు హయాంలో ఉన్నదే.

- ఉదయ్ బాండ్స్ రూ. 8,256 కోట్లు అన్నారు. అది తీసుకుంది 2016లో చంద్రబాబు హయాంలోనే కదా?
- ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుల (ఈఏపీ) కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 33,118 కోట్ల రుణం. పాత ప్రభుత్వం కూడా ఆ ప్రాజెక్టుల కింద అందులో రుణం తీసుకుంది కదా?
- నాన్ గ్యారెంటీ లోన్ పవర్ సెక్టర్‌లో రూ. 95 వేల కోట్ల రుణం అన్నారు. అందులో రూ. 69,596 కోట్ల రుణం చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్నదే. 2019 మే నాటికే ఉంది.
- సీఆర్‌డీఏ బాండ్స్ రూ. 1,500 కోట్లు అప్పు కూడా చంద్రబాబు చేసిందే. పౌర సరఫరాల సంస్థ ద్వారా రూ. 50 వేల కోట్లు అప్పు అంటున్నారు. ఇందులోనూ రూ. 22 వేల కోట్లు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో తీసుకున్న రుణమే.
- రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ ద్వారా రూ. 50 వేల కోట్ల రుణం తీసుకున్నారని రాశారు. నిజానికి ఆ రుణం మొత్తం రూ. 36 వేల కోట్లు మాత్రమే.
- ఇతర కార్పొరేషన్ల ద్వారా రూ. 1.45 లక్షల కోట్ల అప్పు అని రాశారు. ఆ మొత్తంలో పవర్ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణం రూ. 95 వేల కోట్లు కూడా ఉంది. అయితే, ఆ రుణాన్ని వేరుగా చూపారు. ఇంకా చెప్పాలంటే ఆ రూ. 95 వేల కోట్లలో దాదాపు రూ. 70 వేల కోట్లు గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేసిందే.
- నిజానికి రాష్ట్రానికి ఉన్న అప్పు రూ. 7 లక్షలకు అటు ఇటుగా ఉంటే.. దాన్ని దారుణంగా పెంచి రూ. 10 లక్షల కోట్లు అని రాయడం అంతకంటే తప్పు. ఇంకా చెప్పాలంటే ఈ రూ. 7 లక్షల కోట్ల అప్పుల్లో కూడా దాదాపు రూ. 4 లక్షల కోట్లు గత ప్రభుత్వ హయాంలో చేసినవే. అయినా అన్నీ కప్పి పుచ్చి, మొత్తం అప్పును ఈ ప్రభుత్వానికి ఆపాదిస్తూ కథనం రాయడం చాలా దారుణం. కనీసం జర్నలిజం విలువలు పాటించకపోవడం ఎంత అన్యాయం?

పూర్తి వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగలరు

కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీలకు లక్ష్యం మేరకు రుణాలివ్వాలి

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆర్థిక మంత్రి బుగ్గన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కౌలు రైతులకు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రుణాల మంజూరులో పూర్తి స్థాయిలో లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బ్యాంకులకు విజ్ఞప్తి చేశారు. మంత్రి అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో 225వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా గత ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు, 2023 సెప్టెంబరు కీ ఇండికేటర్లు, 2023-24 రాష్ట్ర బ్యాంకుల వార్షిక రుణ ప్రణాళికలో సాధించిన ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి రాజేంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రుణాల మంజూరులో బ్యాంకుల ప్రగతి మెరుగ్గా ఉందని అభినందించారు. నాలుగేళ్లుగా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధనలో మంచి వృద్ధి కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో డెయిరీ రంగం అభివృద్ధికి మరీ ముఖ్యంగా జగనన్న పాల వెల్లువకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున, ఈ రంగంలో లబ్ధిదారులకు పెద్ద ఎత్తున రుణాలివ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు మరింతగా రుణాలివ్వాలన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 3 లక్షల మందికి పైగా కౌలు రైతులకు రూ. 4వేల కోట్లు రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకూ 75 వేల మందికి పైగా కౌలు రైతులకు రుణాలిచ్చారని, వీరికి మరింత తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు. గృహ నిర్మాణ పథకాలకు ముఖ్యంగా టిడ్కో గృహాలకు పెద్దఎత్తున రుణాలందించాలని కోరారు. విద్య, మౌలిక సదుపాయాలకు రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ రంగంలో బ్యాంకుల ప్రగతి మెరుగ్గా ఉందన్నారు. పీఎం ముద్రా యోజన తదితర కేంద్ర పథకాలకు పూర్తిగా తోడ్పాటునందించాలన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని, తద్వారా రాష్ట్ర ఆర్థిక, సామాజికాభివృద్ధికి, జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తున్నారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితీష్ రంజన్ అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు వంటివి ఏర్పాటు వల్ల గ్రామ స్థాయి నుండే మెరుగైన అభివృద్ధి జరుగుతోందన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం తెస్తున్న విప్లవాత్మక మార్పులను ఆయన ప్రశంసించారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కింద రాష్ట్రం అనేక అవార్డులను పొందడం అభినందనీయమని అన్నారు.

రూ.82,329 కోట్లు ఖరీఫ్ పంట రుణాలు

ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎం.రవీంద్రబాబు అజెండా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గత ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యల నివేదికను వివరించారు. 2023-24 బ్యాంకుల వార్షిక రుణ ప్రణాళికలో గత సెప్టెంబరు వరకు సాధించిన ప్రగతిని వివరించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో స్వల్పకాలిక పంట రుణాల కింద ఖరీఫ్, రబీకి కలిపి రూ.1 48 లక్షల కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఖరీఫ్‌లో రూ.82,329 కోట్లు అందించి 56 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. వ్యవసాయ టర్మ్ లోన్స్ రూ.68 వేల కోట్లులో రూ.43,300 కోట్లు, ఫార్మర్ క్రెడిట్‌కు సంబంధించి రూ.2.16 లక్షల కోట్లకు రూ.1.25,629 కోట్లు అందించినట్లు తెలిపారు. వ్యవసాయ ఇన్‌ఫ్రా, యాన్సిలరీ కింద రూ.15 వేల కోట్లకు రూ. 15,303 కోట్లు అందించామన్నారు. ఎంఎస్ఎంఈ రంగంలో రూ.69 వేల కోట్లకు రూ.53,208 కోట్లు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల్లో స్టాండ్ అప్ ఇండియా కింద 93 శాతం, పీఎం ముద్రా యోజన కింద 77 శాతం, పీఎం ఈజీపీలో 56 శాతం, పీఎం ఎఫ్ఎంఈలో 83 శాతం, పీఎం స్వానిధిలో 96 శాతం లక్ష్యాన్ని సాధించామని వివరించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ రాజేశ్ కె మహానా, పలువురు ఇతర అధికారులు, వివిధ బ్యాంకుల రాష్ట్రస్థాయి కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సౌరశక్తితో నడిచే వీల్‌చైర్

ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో రూపకల్పన



సాక్షి, విశాఖపట్నం: నూతన ఆవిష్కరణల్లో ఎప్పటికప్పుడు సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్న విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్.. తాజాగా మరో సరికొత్త పరికరాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. సౌర విద్యుత్‌తో నడిచే ట్రై సైకిల్ వీల్‌చైర్‌ను మెడ్‌టెక్ జోన్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ కేంద్రంలో తయారు చేశారు. ఈ వీల్‌చైర్‌ను కేంద్ర కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి నివేదిత శుక్లావర్మ చేతుల మీదుగా మెడ్‌టెక్ జోన్‌లో గురువారం ఆవిష్కరించారు. ఇంధన వనరుల పరిరక్షణ, కర్బన ఉద్గారాల నియంత్రణలో భాగంగా ఈ సోలార్ వీల్‌చైర్‌ను తయారు చేసినట్లు మెడ్‌టెక్ జోన్ వర్గాలు వెల్లడించాయి.

ఏపీలో 3 రైళ్ల గమ్యస్థానాల పొడిగింపు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ)/లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఏపీలోని పలు గమ్యస్థానాలకు అదనపు ప్రయాణ సౌకర్యాన్ని అందించేందుకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 3 రైళ్ల సర్వీసుల గమ్యస్థానాలను రైల్వేశాఖ పొడిగించింది. వీటిలో గుంటూరు- విశాఖ (22701/22702) రైలు విశాఖ, విజయవాడ,గుంటూరు మీదుగా ప్రయాణిస్తోంది. మిగిలిన 2 రైళ్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభమవుతాయని తెలిపారు. వాటిలో నర్సాపూర్-హుబ్లీ (17225/17226) రైలు గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, భీమవరం, పాలకొల్లు స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. నంద్యాల-రేణిగుంట (07285/07284) రైలు ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లి, కోడూరు, కంభాలపల్లె స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని చెప్పారు. ఈ రైళ్ల సర్వీసులను శుక్రవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రజాప్రతినిధుల సమక్షంలో గుంటూరు రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ రైళ్లు శుక్రవారం నుంచే ప్రయాణికుల సేవల్లోకి అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు.

ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఏవియేషన్ ఫ్లీట్‌పై సమీక్ష

కోస్ట్‌గార్డ్, హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ అధికారుల హాజరు

సాక్షి, విశాఖపట్నం: సముద్ర జలాల్లో భద్రత విషయంపై రాజీ పడే ప్రసక్తే లేదని ఇండియన్ కోస్ట్‌గార్డ్ ప్రిన్సిపల్ డైరెక్టర్ డీఐజీ జమాల్ తాహా స్పష్టం చేశారు. తీరగస్తీ దళ ఏవియేషన్ ఫ్లీట్‌పై విశాఖలోని కోస్ట్‌గార్డ్ ఈస్టర్న్ సీబోర్డ్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. కోస్ట్‌గార్డ్ పరిధిలో ఉన్న డోర్నియర్స్, ధృవ్, చేతక్ హెలికాప్టర్ల సామర్థ్యంపై సమీక్షలో చర్చించారు. తీరగస్తీకి అవసరమైన ఫ్లీట్ తయారీ, డిజైన్, నాణ్యతా ప్రమాణాలు, నిర్వహణ, ఆపరేషన్స్ తదితర అంశాలపై కోస్ట్‌గార్డ్‌తో ఎప్పటికప్పుడు చర్చలు జరిపి.. మంచి ఫలితాలు అందించేందుకు కృషి చేస్తామని హెచ్ఏఎల్ జీఎం ముఖేష్ అగర్వాల్ తెలిపారు. హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్(హెచ్ఏఎల్), కోస్ట్‌గార్డ్‌కు చెందిన 36 మంది అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.



సమీక్షలో కోస్ట్‌గార్డ్, హెచ్ఏఎల్ అధికార బృందం

జగనన్న ఆరోగ్య సురక్ష
జనాలకు రక్ష

రాష్ట్రంలో విజయవంతంగా రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష



గుంటూరు జిల్లా అప్పాపురం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధుడికి వైద్యం చేస్తున్న డాక్టర్

గుంటూరు జిల్లా కాకుమాను మండలం

అప్పాపురానికి చెందిన జి.సుబ్బారావుకు 69 ఏళ్లు. కొద్ది రోజులుగా కంటి చూపు సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే సెకండరీ కేర్ ఆస్పత్రికి.. లేదంటే గుంటూరులోని పెద్దాస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. ఆస్పత్రికి వెళ్లి రావడానికి ప్రయాణచార్జీలు, ప్రయాసల భారం తప్పనిసరి. అయితే ఇవేవీ లేకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష(జేఏఎస్) కార్యక్రమం ద్వారా గ్రామంలోనే సుబ్బారావుకు ప్రభుత్వం కంటి పరీక్షలు నిర్వహించింది. ఈ నెల ఐదో తేదీన రెండో దశ జేఏఎస్‌లో భాగంగా గ్రామంలో వైద్య శాఖ సురక్ష వైద్య శిబిరం నిర్వహించింది. ర్యాండమ్ బ్లడ్ షుగర్, రక్తపోటుతో పాటు, విజన్ టెస్ట్‌లను గ్రామంలోనే ఉచితంగా నిర్వహించారు. విజన్ టెస్ట్‌లో గుర్తించిన అంశాల ఆధారంగా చూపు సమస్య నివారణకు ప్రభుత్వమే ఉచితంగా చికిత్స అందించింది.

- ఇప్పటి వరకూ 1,315 శిబిరాల నిర్వహణ
- గ్రామాలు, వార్డుల్లోనే స్పెషలిస్ట్ వైద్య సేవలు.. మందులు, పరీక్షలు
- తొలి దశలో 60 లక్షల మందికి ఉచిత వైద్య సేవలు

సాక్షి, అమరావతి: సుబ్బారావు తరహాలోనే రాష్ట్రంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి జేఏఎస్ కార్యక్రమం వరంగా మారింది. సమయం, ఓపిక లేని, ఆర్థిక పరిస్థితులు సహకరించని, అదే పనిగా ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకోలేని లక్షలాది మంది ఆరోగ్య సమస్యలను జేఏఎస్ పరిష్కరిస్తోంది. గ్రామ స్థాయిలోనే స్పెషలిస్ట్ వైద్యులు ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తిస్తున్నారు. మందులు అవసరమైతే అక్కడికక్కడే ఉచితంగా అందిస్తున్నారు. మెరుగైన చికిత్సలు అవసరమైతే ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. రిఫరల్ కేసుల్లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వమే ఉచితంగా వైద్యం అందిస్తోంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి ప్రభుత్వమే మందులను డోర్ డెలివరీ చేస్తోంది.

4.19 లక్షల మందికి ఉచిత వైద్యం

రెండో దశ జేఏఎస్ కార్యక్రమాన్ని ఈ నెల రెండో తేదీ నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. ఒక జిల్లాలోని మండలాలను రెండుగా విభజించి సగం మండలాల్లో మంగళవారం, మిగిలిన మండలాల్లో శుక్రవారం శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇక పట్టణ, నగరాల్లో బుధవారం శిబిరాలుంటాయి. ఆరు నెలల్లో రాష్ట్రం మొత్తం శిబిరాలు నిర్వహించేలా కార్యాచరణతో ముందుకెళుతున్నారు. కాగా, ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 1,315 సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించగా.. సగటున 319 మంది చొప్పున 4,19,249 మంది స్వగ్రామం, వార్డుల్లోనే చికిత్సలు అందుకున్నారు. నంద్యాల జిల్లాలో 56 శిబిరాలు నిర్వహించగా రాష్ట్రంలోనే అత్యధికంగా ఇక్కడ సగటున 458 ఓపీలు నమోదు కావడం విశేషం. ఇక ఇప్పటి వరకూ జేఏఎస్-2లో వైద్య సేవలు పొందిన వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. మొత్తంగా 4.19 లక్షల మంది సేవలు పొందగా.. వీరిలో 2.19 లక్షల మంది మహిళలు, 1.99 లక్షల మంది పురుషులున్నారు.

మూడు వేల మంది స్పెషలిస్ట్ వైద్యులతో

ఆరు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రెండో దశ ఆరోగ్య సురక్ష నిర్వహించేలా వేగంగా అడుగులు వేస్తున్నారు. జనవరిలో 3,583 శిబిరాలను నిర్వహించాల్సి ఉండగా.. ఇప్పటికే 1,315 శిబిరాలు పూర్తయ్యాయి. ఇక షెడ్యూల్ ప్రకారం గ్రామం/వార్డులో సురక్ష శిబిరం ఏర్పాటుకు 15 రోజుల ముందు ఒకసారి, మూడు రోజుల ముందు రెండో సారి వలంటీర్‌లు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి జేఏఎస్-2 పై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శిబిరంలో స్థానిక మెడికల్ ఆఫీసర్‌తో పాటు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఉంటారు. ప్రజలకు సొంత ఊళ్లలోనే స్పెషలిస్ట్ వైద్య సేవలందించేందుకు 543 జనరల్ మెడిసిన్, 645 గైనకాలజిస్ట్, 349 జనరల్ సర్జన్, 345 ఆర్థోపెడిక్స్, 378 మంది చొప్పున ఇతర స్పెషలిస్ట్‌లు మూడు వేల మంది వరకూ వైద్యులను, కంటి సమస్యల గుర్తింపునకు స్క్రీనింగ్ చేపట్టడానికి 562 పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లను డిప్లాయ్ చేశారు. వైద్య పరీక్షల నిర్వహణకు ఏడు రకాల కిట్లను, ఈసీజీ, ఇతర పరికరాలను, వందల సంఖ్యలో మందులను శిబిరాల్లో అందుబాటులో ఉంచారు.

జగనన్న ఆరోగ్య సురక్ష తొలి దశలో అందించిన సేవలు

ఆరోగ్య సిబ్బంది సందర్శించిన గృహాలు	1,45,35,705
నిర్వహించిన వైద్య పరీక్షలు	6,45,06,018
నిర్వహించిన మొత్తం సురక్ష శిబిరాలు (రూరల్-10,033, అర్బన్-2,390)	12,423
శిబిరాల్లో నమోదైన ఓపీలు	60,27,843
తదుపరి వైద్యం కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫరల్	1,64,982 మంది

చేయి పట్టి నడిపిస్తూ

వైద్య శిబిరాల ద్వారా స్వగ్రామాల్లోనే వైద్య సేవలు అందించడమే కాకుండా అనంతరం కూడా అనారోగ్య బాధితులను వైద్య పరంగా ప్రభుత్వం చేయిపట్టి ముందుకు నడిపించనుంది. జేఏఎస్ శిబిరాల నుంచి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన రోగులను ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తున్నారు. వీరు ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందడం కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రయాణ చార్జీల కింద రూ.500 చొప్పున పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలో రిఫరల్ రోగులను ఆస్పత్రులకు తరలించి, అక్కడ ఉచితంగా అన్ని వైద్య సేవలు అందేలా సమన్వయం చేస్తారు. జీజీహెచ్‌లు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో కూడా ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసుల కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఉంటాయి. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది. వీరికి ఉచిత కన్సల్టేషన్‌లతో పాటు కాలానుగుణంగా ఉచితంగా మందులు అందజేస్తోంది.

268 మందికి క్యాటరాక్ట్ సర్జరీలు చేయించాం



తొలి ఆరోగ్య సురక్షలో మా పీహెచ్‌సీ పరిధిలో 111 మందిని తదుపరి వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేశాం. వారిలో 72 మందికి ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్సలు పూర్తయ్యాయి. ఇక 306 మందిలో కంటి సమస్యలను గుర్తించాం. వీరిలో 268 మందికి క్యాటరాక్ట్ సర్జరీలు పూర్తయ్యాయి. మిగిలిన వారు పొలం పనుల కారణంగా చికిత్సలు, క్యాటరాక్ట్ సర్జరీలను వాయిదా వేసుకున్నారు. వారికి కూడా వీలైనంత త్వరగా చికిత్సలు పూర్తి చేసేలా ఫాలోఅప్ చేస్తున్నాం.

– డాక్టర్ సుశ్మప్రియదర్శిని, మెడికల్ ఆఫీసర్, వత్సవాయి పీహెచ్‌సీ, ఎన్టీఆర్ జిల్లా

ఆరోగ్యశ్రీ కింద స్టంట్ వేశారు



గతేడాది మా ఊళ్లో ప్రభుత్వం సురక్ష శిబిరం నిర్వహించింది. ఆయాసం, ఇతర సమస్యలతో బాధపడుతున్న నేను శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యుడికి చూపించుకున్నాను. ఈసీజీ తీశారు. ఈ క్రమంలో గుండెకు సంబంధించి సమస్య ఉన్నట్టు గుర్తించారు. విజయవాడ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడికి వెళ్లగా.. రక్తనాళాలు పూడుకుని పోయినట్టు గుర్తించి స్టంట్ వేశారు.

– భారతీలక్ష్మి, దబ్బాకుపల్లి, ఎన్టీఆర్ జిల్లా

కులవాదులకు చరమగీతం పాడతాం

బహుజన పరిరక్షణ సమితి స్పష్టీకరణ



తాడికొండ: కులోన్మాద పోకడలకు చరమగీతం పాడే రోజుల కోసం ప్రజలు ఎదురు చూపులు చూస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం 1201వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరంలో పలువురు మాట్లాడుతూ.. కులవాదులే అమరావతిలో తరతరాలు ఆధిపత్యం చెలాయించాలనే దుర్మార్గపు ఆలోచనతో బాబు ముందస్తుగా ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారని ఆరోపించారు. కానీ ఇదే ప్రాంతంలో చట్టబద్ధంగా ప్రభుత్వం పేదలకు పట్టాలిస్తుంటే ఓర్వలేక ఇక్కడ పేదలకు స్థలాలిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందని కోర్టులను ఆశ్రయించడం కులవివక్ష కాదా? అని ప్రశ్నించారు. 14 ఏళ్లు అధికారంలో ఉండి పేదవాడికి వీసమంత న్యాయం చేయని చంద్రబాబు ఇప్పుడు పేదల కోసం తాను పుట్టినట్లుగా ఓట్ల కోసం తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటన్నారు. బాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు చేసే ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, 85% ఓటు బ్యాంకు ఉన్న బహుజనులు ఎటు మొగ్గు చూపితే ఆ పార్టీయే అధికారంలోకి వస్తుందని చెప్పారు. సమితి నేతలు పులిదాసు, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, మహిళలు పాల్గొన్నారు.

బందరు చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో భారీ చోరీకి పాల్పడిన నేరస్తుడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.26 లక్షల నగదు, నగలు రికవరీ చేశారు. గురువారం బందరు ఇన్‌చార్జి డీఎస్పీ యు.నాగరాజు విలేకరులకు వివరాలు వెల్లడించారు. మచిలీపట్నం జవ్వారుపేటకు చెందిన పద్మనాభుని చిన నాగేశ్వరరావుది ధాన్యం వ్యాపారం. ఈనెల 5న తల్లి ఆరోగ్యం బాగోకపోవడంతో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ ఆస్పత్రికి వెళ్లారు. మరుసటి రోజు తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తీసి ఉండడంతో అనుమానం వచ్చిన నాగేశ్వరరావు లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా కనిపించాయి. రూ.23 లక్షల ఖరీదు చేసే బంగారు, వెండి ఆభరణాలు, రూ.3 లక్షల నగదు కనిపించలేదు. దీంతో అతడు ఇనగుదురుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు నిందితుడి వేలిముద్రలు సేకరించి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. సుకర్లాబాదుకు చెందిన ఉప్పాల శివసాయిరాం చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రూ.26 లక్షల సొత్తును రికవరీ చేశారు. శివసాయిరాంను కోర్టులో హాజరుపరిచినట్లు నాగరాజు పేర్కొన్నారు.

17, 18 తేదీల్లో తిరుపతికి పురావస్తు శాఖ అధికారులు

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరిధిలోని అలిపిరి వద్ద ఉన్న పాదాల మండపం, తిరుమల పుష్కరిణి వద్ద ఉన్న ఆహ్నిక మండపం పునఃనిర్మాణంపై కేంద్ర పురావస్తుశాఖ సలహాలు, సూచనలు అందించాలని టీటీడీ రాసిన లేఖలపై ఎట్టకేలకు ఆ శాఖ అధికారులు స్పందించారు. మూడు నెలల క్రితం పై కట్టడాల పరిశీలన జరిపి తగిన సూచనలు చేయాలని పురావస్తుశాఖ అధికారులకు టీటీడీ లేఖలు రాసింది. కట్టడాలు కూలిపోయే ప్రమాదం ఉండడంతో పై విషయాన్ని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి కేంద్ర సాంస్కృతిక శాఖ అడిషనల్ సెక్రటరీ రంజన్ చోప్రా దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన పురావస్తు శాఖ టీటీడీ కట్టడాలపై సూచనలు చేసేందుకు అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈనెల 17, 18 తేదీల్లో ఈ కమిటీ పరిశీలన జరిపి టీటీడీకు సూచనలు అందించనుంది.

తైవాన్‌లో త్రిముఖం!

- రేపే అధ్యక్ష ఎన్నికలు
- చైనాతో సంబంధాలను నిర్దేశించబోతున్న పోరు
- మూడు పార్టీల మధ్య పోటాపోటీ
- ఎన్నికల బరిలో డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ, కౌమిన్‌టాంగ్ పార్టీ, తైవాన్ పీపుల్స్ పార్టీ

అగ్రరాజ్యం అమెరికా, డ్రాగన్ దేశం చైనా మధ్య ఆధిపత్య పోరాటానికి కేంద్ర బిందువుగా మారిన తైవాన్‌లో అధ్యక్ష ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 13వ తేదీన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు సిద్ధమయ్యారు. ద్వీప దేశమైన తైవాన్‌లో జరుగుతున్న ఈ ఎన్నికలు ప్రపంచమంతటా ఆసక్తి కలిగిస్తున్నాయి. తైవాన్‌కు ప్రధాన ప్రత్యర్థిగా మారిన చైనాతో తదుపరి సంబంధాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఈ ఎన్నికలు నిర్దేశించబోతున్నాయి. తైవాన్‌లో ఉద్యోగులు, కార్మికుల వేతనాలు తగ్గిపోవడం, ఇళ్ల ధరలు భారీగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో త్రిముఖ పోరు కనిపిస్తోంది. చైనా దూకుడును కట్టడి చేయగల సత్తా ఉన్న నాయకుడికే ఈ ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టే అవకాశం ఉందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అధికార డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(డీపీపీ) ప్రస్తుత ఉపాధ్యక్షుడు విలియం లాయ్ చింగ్-టి, మాజీ ప్రతిపక్ష కౌమిన్‌టాంగ్(కేఎంటీ) పార్టీ నుంచి మాజీ పోలీసు చీఫ్, న్యూ తైపీ నగర మాజీ మేయర్ హౌ యు-హీ, తైవాన్ పీపుల్స్ పార్టీ(టీపీపీ) నుంచి కొ వెన్-జె ఈ ఎన్నికల బరిలో నిలిచారు. వారి బలాబలాలు, విజయావకాశాలు ఎలా ఉన్నాయో చూద్దాం..

- సాక్షి, నేషనల్ డెస్క్

తైవాన్ పార్లమెంట్‌లో మొత్తం స్థానాలు: 113

ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్థానాలు: 57

ప్రభుత్వ పదవీ కాలం: 4 ఏళ్లు

2020లో ఎవరికి ఎన్ని స్థానాలు

పార్టీ	గెలిచిన స్థానాలు
డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ	61
కౌమిన్‌టాంగ్ పార్టీ	38
తైవాన్ పీపుల్స్ పార్టీ	5
ఇతరులు	9



చైనా పెత్తనాన్ని ప్రశ్నిస్తున్న విలియం లాయ్ చింగ్-టి

64 ఏళ్ల విలియం లాయ్ చింగ్-టి మృదు స్వభావిగా పేరుగాంచారు. తైవాన్‌కు స్వయం పాలన హోదాను నిలబెట్టడానికి చాలా ఏళ్లుగా పోరాటం సాగిస్తున్నారు. చైనా పెత్తనాన్ని గట్టిగా వ్యతిరేకిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించారు. తైవాన్ స్వాతంత్య్రం కోసం పోరాడుతున్న యోధుడిగా తనను తాను అభివర్ణించుకుంటున్నారు. విలియం లాయ్ చింగ్-టి అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో వైద్య విద్య అభ్యసించారు. స్వదేశంలో కొన్నాళ్లు డాక్టర్‌గా పనిచేశారు. 1990వ దశకంలో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తొలుత తైనాన్ సిటీ నుంచి చట్టసభకు ఎన్నికయ్యారు. 2010లో తైనాన్ మేయర్‌గా విజయం సాధించారు. ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ నుంచి అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగారు. చైనాతో సత్సంబంధాలను తాను కోరుకుంటున్నానని ఎన్నికల ప్రచారంలో చెబుతున్నారు. శత్రువులుగా కాదు, మిత్రులుగా ఉందామని చైనాకు సూచిస్తున్నారు. తైవాన్ తరహాలో చైనాలోనూ ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటివి వర్ధిల్లాలని తాను ఆశిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, చైనా మాత్రం విలియం లాయ్ చింగ్-టి పట్ల విముఖత వ్యక్తం చేస్తోంది. ఆయన ఒక పేచీకోరు అని నిందలు వేస్తోంది. తరచుగా లేనిపోని సమస్యలు సృష్టిస్తుంటాడని విమర్శిస్తోంది. డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ నుంచి ఉపాధ్యక్ష పదవికి హెసియావో బి-కిమ్ పోటీపడుతున్నారు. ఆమె జపాన్‌లో జన్మించారు. అమెరికాలో పెరిగారు. కరడుగట్టిన స్వాతంత్య్ర ఉద్యమకారిణిగా ఆమెకు పేరుంది.

చైనాకు అనుకూలం! హౌ యు-హీ

కౌమిన్‌టాంగ్(కేఎంటీ) పార్టీ నేత, 66 ఏళ్ల హౌ యు-హీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. చిన్నప్పుడు తన కుటుంబ వృత్తి అయిన పందుల పెంపకం చేపట్టారు. పంది మాంసం విక్రయించారు. విద్యాభ్యాసం అనంతరం పోలీసు అధికారిగా పనిచేశారు. పందులను పట్టుకోవడానికి చిన్నప్పుడు నేర్చుకున్న నైపుణ్యం పోలీసు అధికారిగా ఉన్నప్పుడు చాలాసార్లు పనికొచ్చిందని ఆయన ఒక సందర్భంలోచెప్పారు. చాలా హై-ప్రొఫైల్ కేసులను సమర్థవంతంగా ఛేదించారు. హంతకులను అరెస్టు చేశారు. పదవీ విరమణ తర్వాత 2010లో రాజకీయాల్లో చేరారు. 2018లో 'న్యూ తైపీ' నగర మేయర్‌గా ఎన్నికయ్యారు. 2022లో మరోసారి మేయర్‌గా విజయం సాధించారు. పోలీసు అధికారిగా, మేయర్‌గా ఆయన పనితీరు ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంది. అందుకే అధ్యక్ష ఎన్నికల్లో తమ అభ్యర్థిగా హౌ యు-హీని కౌమిన్‌టాంగ్ పార్టీ ఎంపిక చేసింది. ఎనిమిదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న ఆ పార్టీ ఈసారి గెలుపు కోసం శ్రమిస్తోంది. ఎన్నికల ప్రచారంలో హౌ యు-హీ చైనా గురించి పెద్దగా ప్రస్తావించడం లేదు. చైనా అనుకూలవాది అంటూ ఆయనపై కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. 'స్వతంత్ర తైవాన్'కు హౌ యు-హీ వ్యతిరేకి అని ఆరోపిస్తున్నారు. తైవాన్, చైనా మధ్య సంబంధాలు రిపబ్లిక్ ఆఫ్ చైనా రాజ్యాంగంపై ఆధారపడి ఉంటాయని, ఇందులో గందరగోళం ఏమీ లేదని ఆయన తేల్చిచెబుతున్నారు. కౌమిన్‌టాంగ్ పార్టీ నుంచి ఉపాధ్యక్ష పదవికి జా షా-కాంగ్ పోటీ పడుతున్నారు. చైనా, తైవాన్ పునరేకీకరణ జరగాలని జా షా-కాంగ్ వాదిస్తుంటారు.



యువత ఆదరణ చూరగొంటున్న కొ వెన్-జె

తైవాన్ పీపుల్స్ పార్టీ(టీపీపీ) నుంచి 64 సంవత్సరాల కొ వెన్-జె రేసులో నిలిచారు. ఆయన వైద్యుడిగా పనిచేస్తూ పదేళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చారు. 2014లో జరిగిన 'సన్ ఫ్లవర్ ఉద్యమం'లో పాల్గొన్నారు. అప్పట్లో చైనాకు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఆ తర్వాత కొ వెన్-జె 2015లో తైపీ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఎనిమిదేళ్లపాటు అదే పదవిలో సేవలందించారు. మేయర్‌గా చైనాతో సంబంధాలు పెంచుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు. 2019లో తైవాన్ పీపుల్స్ పార్టీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చైనాతో సంబంధాల విషయంలో ఎలాంటి వైఖరిని వ్యక్తం చేయకుండా గుంభనంగా వ్యవహరిస్తున్నారు. చైనాకు అనుకూలమో, వ్యతిరేకమో చెప్పకుండా దాట వేస్తున్నారు. ప్రధానంగా యువతలో ఆయన పట్ల ఆదరణ కనిపిస్తోంది. డీపీపీ, కేఎంటీ పార్టీలకు తామే ప్రత్యామ్నాయం అని కొ వెన్-జె పేర్కొంటున్నారు. 2020 ఎన్నికల్లో 113 స్థానాలకు గాను టీపీపీ కేవలం ఐదు సీట్లు గెలుచుకుంది. తైవాన్ పార్లమెంట్‌లో మూడో అతిపెద్ద పార్టీగా మారింది. ఇక టీపీపీ నుంచి ఉపాధ్యక్ష రేసులో సిట్టింగ్ ఎంపీ, సంపన్న వ్యాపారవేత్త సింథియా వు నిలిచారు. తైవాన్‌లో ప్రఖ్యాతిగాంచిన వ్యాపార సంస్థ 'షిన్ కాంగ్ గ్రూప్' ఆమె కుటుంబానికి చెందినదే.



31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ వర్గాలంటున్నాయి. 31న ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు ఫిబ్రవరి 9 వరకు కొనసాగనున్నాయని సమాచారం. సమావేశాల తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించనున్నారు. తర్వాతి రోజు ఫిబ్రవరి ఒకటిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెడతారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వానికి ఇది చివరి బడ్జెట్. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు అవసరమైన ఖర్చులకు పార్లమెంట్ ఆమోదం తీసుకునేందుకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చే ప్రభుత్వం తిరిగి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మహిళా రైతులను ఆకట్టుకునేలా కీలక ప్రకటన ఉంటుందని చెబుతున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని రెట్టింపు చేసే ప్రతిపాదన ఉండొచ్చని సమాచారం. మహిళా రైతులకు కిసాన్ నిధిని పెంచితే ప్రభుత్వానికి అదనంగా రూ.12,000 కోట్లు రావచ్చని లెక్కలు వేస్తున్నాయి. ఈ ప్రకటనను ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో హైలైట్ చేసే అవకాశం ఉందని చెబుతున్నాయి.

మళ్లీ ఎన్నికైతే నియంతలా పరిపాలిస్తా

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా తాను మళ్లీ ఎన్నికైతే ఒక నియంత తరహాలో పరిపాలన సాగిస్తానని మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. తనకు రెండు లక్ష్యాలు ఉన్నాయని, వాటిని నెరవేర్చవడానికి అవసరమైతే నియంతలా మారుతానని స్పష్టం చేశారు. మెక్సికో సరిహద్దు నుంచి నుంచి అమెరికాలోకి చొరబాట్లను అరికట్టడం, ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రోత్సాహం ఇవ్వడం తన లక్ష్యాలు అని వివరించారు. ప్రతిపక్షాలు తనపై తప్పుడు ప్రచారం సాగిస్తూ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయని ట్రంప్ మండిపడ్డారు. ఒకవేళ తనపై అక్రమ కేసులు నమోదు చేసి, విచారణ చేపడితే అమెరికా మొత్తం స్తంభించిపోతుందని తేల్చిచెప్పారు. విపక్షాలు తనను నియంతగా చిత్రీకరించి, ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అధ్యక్షుడిగా అధికారంలో తాను యుద్ధాలు చేయలేదని, విదేశాల్లో ఉన్న అమెరికా దళాలను వెనక్కి రప్పించానని గుర్తుచేశారు. జో బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇతర దేశాల్లో యుద్ధాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ యుద్ధాల నుంచి రాజకీయంగా లాభం పొందాలని బైడెన్ ఎత్తుగడలు వేస్తున్నారని ట్రంప్ ధ్వజమెత్తారు.

జమిలి ఎన్నికలను అంగీకరించం

ఉన్నత స్థాయి కమిటీకి మమతా బెనర్జీ లేఖ



కోల్‌కతా: 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'విధానాన్ని తాము అంగీకరించబోమని టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తేల్చి చెప్పారు. మన దేశ సమాఖ్య నిర్మాణం ప్రకారం 'ఒక దేశం-ఒకే ఎన్నిక' ఆలోచన ఆచరణ సాధ్యం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికల విధానం అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ కార్యదర్శి డాక్టర్ నితేన్ చంద్రకు ఈ మేరకు మమతా బెనర్జీ లేఖ రాశారు. ఈ అంశాన్ని హేతుబద్ధతతో పరిశీలించాలని ఆమె ఎన్నిల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. 'జమిలి ఎన్నికల యోచన సమాఖ్య నిర్మాణ కోణంలో చూస్తే సాధ్యం కాదు, ఆమోద యోగ్యం కాదు. సరైన విధానం కూడా కాదు. అందుకే, నేను ఈ విధానాన్ని ఆచరణాత్మక కోణంలో అంగీకరించను. ఈ అంశాన్ని చాలా చాలా హేతుబద్ధంగా ప్రత్యేకంగా పరిశీలించాలని కూడా భారత ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నాను'అని ఆమె గురువారం సెక్రటేరియట్ వద్ద విలేకరుల సమావేశంలో అన్నారు. 'ఇది కేవలం టీఎంసీ అభిప్రాయం మాత్రమే కాదు, ఇండియా కూటమి పార్టీలది కూడా. ఈ యోచనను పరిశీలించేటప్పుడు కేంద్ర, రాష్ట్ర విధానాలు, కేంద్రం, రాష్ట్ర నిర్మాణాలు వంటి వాటిని కూడా చూడాలి'అని ఆమె పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ జమిలి ఎన్నికల నిర్వహణపై అభిప్రాయాలు తెలపాలంటూ రాజకీయ పార్టీలకు లేఖలు రాసిన విషయం తెలిసిందే.

మెహబూబా ముఫ్తీకి తప్పిన ప్రమాదం



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ రోడ్డు ప్రమాదం నుంచి త్రుటిలో సురక్షితంగా బయటపడ్డారు. గురువారం ఆమె ప్రయాణిస్తున్న కారు అనంత్‌నాగ్ జిల్లా సంగం ప్రాంతంలో మరో కారును ఢీకొట్టింది. ఘటనలో ఆమె కారు తీవ్రంగా దెబ్బతినగా, డ్రైవర్‌కు, అందులో ఉన్న భద్రతాధికారి ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ముఫ్తీకి మాత్రం ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించేందుకు ఖానాబల్ వైపు వెళ్తుండగా ఘటన చోటుచేసుకున్నట్లు చెప్పారు. ఘటన అనంతరం మెహబూబా ముఫ్తీ వేరే కారులో తన ప్రయాణాన్ని కొనసాగించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదం నుంచి తన తల్లి సురక్షితంగా బయటపడ్డారని ముఫ్తీ మీడియా అడ్వైజర్, ఆమె కుమార్తె ఇల్తిజా ముఫ్తీ ధ్రువీకరించారు.

లైంగిక వేధింపుల ఆరోపణలు.. నేపాల్ 'బుద్ధ బాయ్' అరెస్ట్



కఠ్మాండు: నేపాల్‌కు చెందిన ఆధ్యాత్మిక నేత, బుద్ధుడి అవతారంగా భావించే రామ్ బహదూర్ బోంజన్(33)ను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆశ్రమంలోని పలువురు యువతుల అదృశ్యం, అత్యాచారం ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. నీళ్లు, ఆహారం, నిద్ర లేకుండా ధ్యానంలో అతడు నిశ్చలంగా నెలలపాటు ఉంటాడని ఆయన అనుచరులు నమ్ముతారు. అతడిని బుద్ధ బాయ్‌గా పిలుచుకుంటారు. తన ధ్యానానికి ఆటంకం కలిగించినందుకుగాను పలువురిపై అతడు దాడి చేసినట్లు, అనుయాయులపై భౌతిక, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలున్న రామ్ బహదూర్ దశాబ్ద కాలంగా తప్పించుకు తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. సలార్హి ఆశ్రమంలో ఓ బాలికపై 2018లో అత్యాచారానికి పాల్పడినట్లు కూడా పోలీసులకు ఫిర్యాదు అందింది. బుధవారం పట్టుబడిన సమయంలో అతడి వద్ద 3 కోట్ల నేపాలీ కరెన్సీతోపాటు 22,500 డాలర్లు లభించినట్లు సమాచారం.

అది 'భారత్ తోడో అన్యాయ్ యాత్ర': నడ్డా



ఇటానగర్: కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రను బీజేపీ చీఫ్ జేపీ నడ్డా భారత్ తోడో అన్యాయ్ యాత్రగా అభివర్ణించారు. దేశాన్ని ఐక్యంగా ఉంచడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ప్రయత్నించలేదన్నారు. విభజించి- పాలించు రాజకీయాలకు మారుపేరైన కాంగ్రెస్ దేశాన్ని విభజించేందుకే యత్నించిందని ఆరోపించారు. అప్పటి దుర్మార్గాలను దాచి ఉంచేందుకే తాజాగా యాత్ర మొదలుపెట్టిందన్నారు. గురువారం ఆయన ఇటానగర్‌లో మాట్లాడారు.

బంగ్లా ప్రధానిగా అయిదోసారి హసీనా ప్రమాణం

ఢాకా: అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా(76) గురువారం బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా అయిదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవలి ఎన్నికల్లో అవామీ లీగ్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలను ప్రధాన ప్రతిపక్షం బీఎన్‌పీతోపాటు ఆ పార్టీ మిత్ర పక్షాలు బహిష్కరించాయి. అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ దేశ 12వ ప్రధానిగా హసీనాతో ప్రమాణం చేయించారు. దీంతో వరుసగా నాలుగోసారి, మొత్తమ్మీద అయిదోసారి ఆమె ప్రధానిగా పగ్గాలు చేపట్టినట్లయింది. అనంతరం మంత్రివర్గ సభ్యులు కూడా ప్రమాణం చేశారు.

అజ్మీర్ దర్గాకు ప్రధాని మోదీ చాదర్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అజ్మీర్‌లోని ప్రముఖ షరీఫ్ దర్గాకు చాదర్ అందజేశారు. గురువారం ఢిల్లీలో ఆయన్ను కొందరు ముస్లిం ప్రముఖులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి చాదర్‌ను అందజేశారు. సూఫీ ప్రవక్త ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ వర్ధంతి సందర్భంగా జరిగే ఉర్సులో ఈ చాదర్‌ను కప్పుతారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వ్యవహారాల మంత్రి స్మృతీ ఇరానీ, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు జమాల్ సిద్దిఖి ఉన్నారు. ప్రధాని మోదీ 'ఎక్స్'లో స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈడీ విచారణకు ఫరూక్ అబ్దుల్లా డుమ్మా

న్యూఢిల్లీ: నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా (86) గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు గైర్హాజరయ్యారు. జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐ 2018లో కేసు నమోదు చేసింది. ఇందులో మనీ లాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు జరుపుతున్న ఈడీ శ్రీనగర్‌లోని తమ కార్యాలయంలో విచారణకు రావాలంటూ నోటీసులు పంపింది. 'ఈరోజు నేను వెళ్లడం లేదు'అని పీటీఐతో ఆయన నివాసం నుంచి ఫోన్‌లో తెలిపారు. కారణాలను వెల్లడించలేదు.

అద్వానీ అయోధ్యకు వస్తున్నారు: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: బీజేపీ కురువృద్ధ నేత, రామ జన్మభూమి ఉద్యమాన్ని ముందుండి నడిపిన ఎల్‌కే అద్వానీ (96) అయోధ్యలో ఈ నెల 22వ తేదీన జరగనున్న ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొంటారని వీహెచ్‌పీ అధ్యక్షుడు అలోక్ కుమార్ చెప్పారు. అవసరమైతే, ఆయన కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. అయితే, బీజేపీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు, సీనియర్ నేత మురళీ మనోహర్ జోషీ రాకపై ఇప్పటి వరకు స్పష్టత లేదని అన్నారు.

ఢిల్లీలో భూ ప్రకంపనలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతోపాటు ఉత్తరాది రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. గురువారం మధ్యాహ్నం రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1 గా నమోదైనట్లు జాతీయ భూకంప కేంద్రం వెల్లడించింది. భూకంప కేంద్రం పాకిస్తాన్-అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లోని హిందూకుష్ ప్రాంతంలో ఉంది. దీంతో దేశరాజధానితో పాటు పంజాబ్, చండీగఢ్, జమ్మూకశ్మీర్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో కొద్దిసేపు భూమి కంపించింది. పాక్‌లోని లాహోర్, ఇస్లామాబాద్, ఖైబర్ ఫఖ్తుఖ్వా సహా పలు ప్రాంతాల్లో భూ ప్రకంపనలు నమోదైనట్లు అక్కడి మీడియా వెల్లడించింది.

మాల్దీవుల్లో విదేశీ జోక్యాన్ని వ్యతిరేకిస్తున్నాం: చైనా

బీజింగ్: మాల్దీవుల అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నామని చైనా పేర్కొంది. మాల్దీవుల సార్వభౌమత్వం, స్వాతంత్య్రాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపింది. మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు చైనాలో అయిదు రోజుల పర్యటన శుక్రవారంతో ముగియ నుంది. ఈ సందర్భంగా రెండు దేశాలు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు పరస్పరం మద్దతుగా నిలవాలంటూ ఒక ప్రకటన విడుదలైంది. 'మాల్దీవుల సార్వభౌమాధికారం, స్వాతంత్య్రం, జాతి గౌరవాన్ని నిలబెట్టడంలో చైనా గట్టిగా మద్దతిస్తుంది. మాల్దీవుల విధానాలను గౌరవిస్తుంది, మద్దతు ఇస్తుంది. మాల్దీవుల అంతర్గత వ్యవహారాల్లో బాహ్య జోక్యాన్ని వ్యతిరేకిస్తుంది'అని అందులో పేర్కొంది. భారత ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులను అధ్యక్షుడు ముయిజ్జు తొలగించడం, ఈ వ్యవహారం ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తలు పెంచడం తెలిసిందే. ఈ సమయంలోనే చైనా అనుకూలుడిగా పేరున్న ముయిజ్జు బీజింగ్ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. పర్యటన అనంతరం చైనాపై ప్రకటన విడుదల చేయడం గమనార్హం.



ఓ సూపర్ మార్కెట్ నుంచి సామాన్లు ఎత్తుకెళ్తున్న జనం

పపువా న్యూగినీలో అల్లర్లు.. 15 మంది మృతి

పోర్ట్ మోర్స్‌బీ: పసిఫిక్ ద్వీప దేశం పపువా న్యూగినీ అల్లర్లతో అట్టుడుకుతోంది. వేతనాల్లో కోతకు నిరసనగా పోలీసులు సమ్మెకు దిగడంతో జనం దుకాణాలు, కార్లకు నిప్పుపెట్టారు. సూపర్‌మార్కెట్లను దోచుకున్నారు. ఇప్పటికే నిరుద్యోగం, అధిక ధరలు ఆకాశాన్నంటడంతో అసంతృప్తితో జనం రగిలిపోతున్నారు. బుధవారం పోలీసులు, ఇతర విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు పార్లమెంట్ ఎదుట నిరసనకు దిగారు. వేతనాల్లో 50 శాతం వరకు కోతపెట్టడాన్ని నిరసించారు. అయితే, కంప్యూటర్‌లో పొరపాటు కారణంగానే వేతనంలో కోత పడినట్లు ప్రధాని చెప్పారు. ఈ సమాధానంతో సంతృప్తి చెందని ఆందోళనకారులు పార్లమెంట్ భవనం లోపలికి చొచ్చుకెళ్లారు. ప్రధానమంత్రి కార్యాలయం ఆవరణలోని కారుకు నిప్పుపెట్టారు. గేటును విరగ్గొట్టారు. అనంతరం సాధారణ ప్రజానీకం వారికి తోడైంది. అందరూ కలిసి పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చి యథేచ్ఛగా విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణల్లో రాజధానిలో 8 మంది, దేశంలోని రెండో అతిపెద్ద లే నగరంలో ఏడుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. రాజధాని పోర్ట్ మోర్స్‌బీలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అదనంగా బలగాలను రప్పించారు. 14 రోజుల పాటు ఎమర్జెన్సీ అమల్లో ఉంటుందని ప్రధానమంత్రి జేమ్స్ మరపే ప్రకటించారు. బుధవారం సాయంత్రానికే పరిస్థితి అదుపులోకి వచ్చినప్పటికీ పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నట్లు ప్రధాని చెప్పారు. సోషల్ మీడియాలో అసత్యాల ప్రచారమే పరిస్థితికి కారణమని నిందించారు. పోలీసులు లేకపోవడంతో అవకాశవాదులు రెచ్చిపోయారన్నారు.

సరిహద్దులు సురక్షితం.. కానీ కొంత సున్నితం

- మన సైనిక దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయి
- ఎలాంటి సవాలు ఎదురైనా తిప్పికొట్టడానికి సిద్ధం
- భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే వెల్లడి



న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి భారత్-చైనా సరిహద్దుల్లో పరిస్థితులు ప్రస్తుతం సాధారణంగా, స్థిరంగానే ఉన్నప్పటికీ, కొంత సున్నితమైనవేనని భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే చెప్పారు. సరిహద్దుల్లో ఎప్పుడు ఎలాంటి సవాలు ఎదురైనా గట్టిగా తిప్పికొట్టడానికి మన సైనిక దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఉన్నతస్థాయి సన్నద్ధతను పాటిస్తున్నాయని వెల్లడించారు. తగినన్ని సైనిక రిజర్వ్ దళాలు సరిహద్దుల్లో మోహరించాయని పేర్కొన్నారు. సరిహద్దుల్లో భద్రతాపరమైన వైఫల్యాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. సైనిక దినోత్సవం నేపథ్యంలో జనరల్ మనోజ్ పాండే గురువారం మీడియాతో మాట్లాడారు. సరిహద్దు వివాదం సహా ఇతర అంశాలకు పరిష్కారం కనుగొనడానికి భారత్, చైనా మధ్య సైనిక, దౌత్యవర్గాల స్థాయిలో చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇక భారత్, పాకిస్తాన్ సరిహద్దుల్లో నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) వెంబడి చొరబాట్లను కట్టడి చేస్తున్నామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో హింసాకాండ తగ్గుముఖం పట్టిందని, రాజౌరీ-పూంచ్ సెక్టార్‌లో మాత్రం హింసాత్మక సంఘటనలు కొంతమేరకు పెరిగాయని వివరించారు. సరిహద్దుకు అవతలివైపు ఉగ్రవాద సంస్థలు చురుగ్గా కార్యకలాపాలు సాగిస్తున్నాయని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో కాల్పుల విరమణ కొనసాగుతోందన్నారు. సరిహద్దు అవతలి వైపు నుంచి భారత్‌లోకి ఆయుధాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన యాంటీ డ్రోన్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు తెలిపారు.

ఇండియా-మయన్మార్ సరిహద్దులో..

రెండు దేశాల నడుమ సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకొనే దిశగా భూటాన్-చైనా మధ్య కొనసాగుతున్న చర్చలపై జనరల్ మనోజ్ పాండే స్పందించారు. ఈ పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. భూటాన్‌తో భారత్‌కు బలమైన సైనిక సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇక ఇండియా-మయన్మార్ సరిహద్దులో పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉందని అంగీకరించారు. అక్కడి పరిస్థితిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని అన్నారు.

బ్యాగులో మద్యం బాటిళ్లున్నాయ్!

- క్యాబ్ డ్రైవర్‌తో సూచనా సేథ్
- బ్యాగులో బిడ్డ మృతదేహంతో 12 గంటల ప్రయాణం

బెంగళూరు: గోవాలో నాలుగేళ్ల కొడుకు చంపి, మృతదేహం ఉంచిన సూట్ కేసును బెంగళూరుకు తీసుకువచ్చిన సీఈవో సూచనా సేథ్ గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. దాదాపు 12 గంటలపాటు కొడుకు మృతదేహంతో కారులో ప్రయాణించిన సమయంలో ఆమె ఎలా ప్రవర్తించిందనే విషయాన్ని క్యాబ్ డ్రైవర్ రేజాన్ డిసౌజా వెల్లడించాడు. ప్రయాణం ప్రారంభమైనప్పటి నుంచి ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉన్నట్లు డిసౌజా తెలిపాడు. జనవరి 7వ తేదీన అర్ధరాత్రి 12.30 సమయంలో గోవాలోని కండోలిమ్‌లో ఉన్న 'సోల్ బన్యాన్ గ్రాండ్'అనే సర్వీస్ అపార్టుమెంట్ నుంచి డిసౌజాకు కాల్ వచ్చింది. ఒక మహిళను అర్జంటుగా బెంగళూరుకు తీసుకెళ్లాల్సి ఉందనేది కాల్ సారాంశం. వెంటనే డిసౌజా కారుతో అక్కడికి వెళ్లాడు. ఒంటి గంటకు సూచనా సేథ్ బయటకు వచ్చింది. డిసౌజా ఆమెను రిసెప్షన్ దగ్గర రిసీవ్ చేసుకున్నాడు. ఆమెతోపాటు ఉన్న నల్ల రంగు బ్యాగు చాలా బరువుగా ఉంది. బ్యాగు గురించి ఆ సమయంలో డిసౌజాకు ఎటువంటి అనుమానం రాలేదు. 'మద్యం బాటిళ్లు గానీ ఉన్నాయా మేడం, బ్యాగు బరువుగా ఉంది'అని అడిగా. అందుకామె, అవును, మద్యం బాటిళ్లున్నాయి అని సమాధానమిచ్చిందని డిసౌజా తెలిపాడు. ప్రయాణం మొత్తమ్మీద దాదాపుగా వాళ్లిద్దరూ మాట్లాడుకోలేదు. గోవా-కర్ణాటక సరిహద్దుల్లో భారీ ట్రాఫిక్ జామ్‌తో 4 గంటలు లేటయింది. అయినా కూడా సూచన ఎటువంటి అసహనం కానీ, భయపడ్డట్లుగానీ కనిపించలేదని డిసౌజా చెప్పాడు. 'ఆమె ఎవరికీ ఫోన్ చేయలేదు. ఆమెకు కూడా ఫోన్ కాల్స్ రాలేదు'అని తెలిపాడు. 'ట్రాఫిక్ జామ్ క్లియర్ అయ్యేందుకు ఆలస్యమవుతుంది మేడం. అర్జంటు అన్నారు కదా, యూ-టర్న్ తీసుకుని ఎయిర్ పోర్టుకు పోనివ్వమంటారా? అని అడిగా. అయితే, ఆమె ఎయిర్‌పోర్టుకు వద్దు, ట్రాఫిక్ క్లియర్ అయ్యాకే వెళ్దామని బదులిచ్చింది. అర్జంటుగా వెళ్లాలంటూనే, ట్రాఫిక్ సమస్య ఉన్నా సమస్య లేదనడం వింతగా అన్పించింది. కర్ణాటక సరిహద్దులు దాటగానే గోవా పోలీసుల నుంచి ఫోనొచ్చింది. కారులో ఉన్న మహిళతోపాటు బాబు ఉన్నాడా అని అడిగారు. ఆమె ఇచ్చిన అడ్రస్, ఇతర వివరాలన్నీ ఫేక్ అని చెప్పారు. దగ్గర్లోని పోలీస్ స్టేషన్ దగ్గరికి వెళ్లాలని సూచించారు. నేరుగా పోలీస్ స్టేషన్‌లావరణలో కారును ఆపడంతో, సూచన ఇక్కడికెందుకు తీసుకొచ్చావు? అని అడిగింది. పోలీసులు మీతో మాట్లాడుతామన్నారు'అని ఆమెకు చెప్పినట్లు వివరించాడు. 'పోలీసులు కారు సోదా చేసి, బ్యాగులో చిన్నారి మృతదేహాన్ని కనుగొన్నారు'అని డిసౌజా చెప్పాడు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన భోగావరపు హరి జగదీష్‌కుమార్ కుటుంబం రూ. లక్ష విరాళాన్ని అందజేసింది.



అంధుల క్రికెట్ కెప్టెన్‌కు సన్మానం

మొగల్రాజపురం: అర్జున అవార్డు గ్రహీత, భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డిని కోస్టల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బి.వేణుగోపాల్‌రెడ్డి గురువారం సత్కరించారు.



సంక్రాంతి శోభ

ముందస్తు సంక్రాతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. గురువారం పలు కళాశాలల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు.

న్యూస్‌రీల్

వాణిజ్య పన్నుల శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నులశాఖ గెజిటెడ్, అండ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘ 2024 క్యాలెండర్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో వాణిజ్య పన్నుల ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వట్టిపల్లి రామస్వామి, మరిపూడి వెంకటేశ్వరరావులు కలిసి తమ క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా అక్కడే ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో సైతం పాల్గొని వెంకట్రామిరెడ్డికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ అరవ పాల్, మురికిపూడి దేవపాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్ర హ్యాండ్ బాల్ జట్టు



విజయవాడ స్పోర్ట్స్: రాజస్థాన్‌లో జరుగుతున్న జాతీయ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు వరుస విజయాలతో సత్తా చాటుతోంది. ఈ నెల తొమ్మిదో తేదీన జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో ఒడిశా జట్టుపై 22–13 తేడాతో, పదో తేదీన రెండో లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ జట్టుపై 32–26 తేడాతో గెలిచి పూల్ విన్నర్‌గా ప్రీ క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. గురువారం ఉదయం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో జార్ఖండ్ జట్టుపై 30–18 తేడాతో గెలిచి క్వార్టర్స్‌కు చేరింది. సాయంత్రం హోరాహోరీగా జరిగిన క్వార్టర్స్‌లోనూ చండీగఢ్ జట్టును 39–38 ఓడించి సెమీస్‌కు చేరింది. నేడు జరిగే సెమీ ఫైనల్‌లో హరియాణా జట్టుతో రాష్ట్ర జట్టు తలపడనుంది. వరుస విజయాలతో దూసుకుపోతున్న జట్టు బృందాన్ని ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పెనుమత్స సత్యనారాయణరాజు అభినందించారు.

స్పాట్ అడ్మిషన్‌ల గడువు పెంపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో డిగ్రీ, పీజీ స్పాట్ అడ్మిషన్ గడువు పెంచినట్లు డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. అజంతకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, ఓపెన్ ఇంటర్ పాసయ్యిన వారు డిగ్రీ కోర్సులలో చేరేందుకు అర్హులన్నారు. అలాగే పీజీలో ప్రవేశానికి 3 సంవత్సరాల డిగ్రీ పాసయ్యి ఉండాలన్నారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు ఏపీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో స్వయంగా కానీ, యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో కానీ, 0866–2434868, 7382929642 ఫోన్ నంబర్‌లలో కానీ సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): పోషణ్ అభియాన్ స్కీం ద్వారా మహిళ, శిశు సంక్షేమశాఖలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు బ్లాక్ కో–ఆర్డినేటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎస్. సువర్ణ గురువారం తెలిపారు. బీసీ–ఏ, ఎస్టీ, ఓసీ మహిళలు 21 నుంచి 42 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అభ్యర్థులు డిగ్రీ, రెండు సంవత్సరాల టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ కలిగి ఉన్నవారు అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీలోగా కానూరులోని అకాడమీ రోడ్డులో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో సాయంత్రం 5గంటల్లోపు పంపాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7901597290, 9949331320లో సంప్రదించాలన్నారు.

కేఆర్‌యూ క్రికెట్ జట్టుకు వరుస విజయాలు

విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల క్రికెట్ నాక్ అవుట్ పోటీల్లో కృష్ణా యూనివర్సిటీ జట్టు వరుస విజయాలను నమోదు చేస్తోంది. ఈ నెల తొమ్మిదో తేదీన చెన్నైలోని హిందుస్థాన్ యూనివర్సిటీలో ఈ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. పూల్–బిలో చోటు దక్కించుకున్న కృష్ణా వర్సిటీ జట్టు తొలి రోజు మ్యాచ్‌లో 20 పరుగుల తేడాతో కళసలింగం యూనివర్సిటీ జట్టుపై గెలిచింది. పదో తేదీన జరిగిన రెండో మ్యాచ్‌లో మద్రాస్ యూనివర్సిటీ జట్టును 10 పరుగుల తేడాతో ఓడించింది. గురువారం మూడో మ్యాచ్ లో అనంతపురం జేఎన్‌టీయూ జట్టుపై 58 పరుగుల తేడాతో గెలిచింది. మరో రెండు మ్యాచ్‌లలో విజయం సాధిస్తే జాతీయ పోటీలకు జట్టు అర్హత సాధిస్తుందని జట్టు కోచ్ వెంకటేశ్వరరావు తెలిపారు.

స్వచ్ఛతలో సిక్సర్

- నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు
- గార్బేజ్ ఫ్రీ సిటీ విభాగంలో 5 స్టార్ సాధించిన వీఎంసీ
- ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ లోనూ 5 స్టార్
- ఢిల్లీలో అవార్డు అందుకున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్

దేశంలోనే ఆరో స్వచ్ఛ నగరంగా బెజవాడ



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరం మరోమారు జాతీయ స్థాయిలో సత్తా చాటింది. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్–2023లో ఆరో స్థానం కైవసం చేసుకుంది. ప్రభుత్వ ఆదేశాలతో నగరపాలక సంస్థ అధికారులు చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలు ఇవ్వడంతో అవార్డు అందుకుంది. నగరంలోని 64 డివిజన్లలో నుంచి వచ్చే 550 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సమర్థంగా నిర్వహించటంతో 286 వార్డు సచివాలయాల పరిధిలో రోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరించటం, అన్ని రహదారులను శుభ్రం చేయటం, మురుగునీటి శుద్ధికి ఎస్‌టీపీల సమర్థ నిర్వహణ, అర్బన్ గ్రీనరీ, కాలుష్య నియంత్రణను సమర్థంగా నిర్వహించడంతో ర్యాంకు సాధించింది. ఏటా కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను 'సర్వీస్ లెవెల్ ప్రోగ్రెస్', 'గార్బేజ్ ఫ్రీ సిటీ', 'సిటిజన్స్ వాయిస్' కేటగిరీలలో నగరాల పనితీరు ఆధారంగా ఇస్తుంది.

చెత్త సేకరణకు 'క్లాప్'..

నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని 64 డివిజన్లలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణకు క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ (క్లాప్) ద్వారా వచ్చిన ప్రతి సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన వాహనాలు 286 వాహనాల ద్వారా చెత్త సేకరణ చేస్తున్నారు. తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాల సేకరణ విడివిడిగా చేయటంతోపాటు వాటి నగరంలో ఎక్కడా డంపింగ్ చేయకుండా పూర్తిస్థాయిలో చెత్తను ప్రాసెసింగ్ నిమిత్తం గుంటూరులోని జిందాల్ సంస్థకు పంపుతుండటంతో సర్వీస్ లెవెల్ ప్రోగ్రెస్‌లో నగరం సత్తా చాటింది. అలాగే అజిత్ సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్లో చేస్తున్న వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల నుంచి కొత్త ఉత్పత్తులను తయారు చేస్తుండటంతో ఈ విభాగంలో మంచి ప్రదర్శన కనబరిచింది.

కాలుష్య నియంత్రణకు పేవర్‌బ్లాక్‌లు..

కాలుష్య నియంత్రణ మండలి సూచనలతో వీఎంసీలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రహదారులతోపాటు పలు కాలనీల్లో పేవర్‌బ్లాక్‌లు ఏర్పాటు చేసి రోడ్ల వెంబడి దుమ్మూ–ధూళి లేకుండా అధికారులు చేయగలిగారు. బందరురోడ్డు, ఏలూరురోడ్డు, చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిని లిట్టర్‌ఫ్రీజోన్(వ్యర్థాలు కనబడకుండా నిరంతరం యంత్రాలు, కార్మికులతో శుభ్రం చేయటం) పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టారు.

ఆహ్లాదం.. ఆనందం..

నగరంలోని 64 డివిజన్‌లలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ కాలనీలతోపాటు ప్రధాన సెంటర్లలో ఆహ్లాదాన్ని పంచే కొత్త పార్కులను ఏర్పాటు చేయటంతో పాటు ఇప్పటికే ఉన్న 74 పార్కులను మరమ్మతులను చేసి అందుబాటులోకి తేవడంతో నగరవాసుల నుంచి మంచి ఫీడ్ బ్యాక్ వచ్చి అర్బన్ కేటగిరీలో మంచి మార్కులు పడ్డాయి. కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను ఏరివేయటంలో వీఎంసీ చేపట్టిన ప్రత్యేకచర్యలు ర్యాకింగ్‌కు సహకరించాయి. రాష్ట్రంలోనే తొలిసారిగా మరబోట్లతో కాల్వలో ఉన్న వ్యర్థాలను తొలగించి వాటర్‌బాడీస్ (నీటి నిల్వల పునరుద్ధరణ)ను చేపట్టి విజయం సాధించింది. దీంతో గార్బేజ్ ఫ్రీ సిటీ కేటగిరిలో ఫైవ్ స్టార్ రేటింగ్ దక్కించుకుంది.

ఓడీఎఫ్‌లో 5 స్టార్..

ఓడీఎఫ్ (ఓపెన్ డెఫకేషన్ ఫ్రీ సిటీ) విభాగంలో బహిరంగ మలమూత్ర రహిత నగరం, ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ సర్టిఫికేషన్‌లో విజయవాడ 5 స్టార్ రేటింగ్ సాధించింది. నగరంలోని రద్దీ కలిగిన ప్రదేశాల్లో వీఎంసీ కమ్యూనిటీ టాయిలెట్లు, పబ్లిక్‌టాయిలెట్లు, నమ్మటాయిలెట్లు, పింక్‌టాయిలెట్లు నిర్మించి బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన రహిత నగరంగా మార్చినందుకు వీఎంసీ 5స్టార్ రేటింగ్ సాధించింది. ఈ కేటగిరీలో దేశంలోని ప్రధాన నగరాలైన ఇండోర్, ముంబై, సూరత్ నగరాలకు దీటుగా వీఎంసీ నిలిచింది.

అవార్డు స్వీకరణ..

కేంద్ర పట్టణాభివృద్ధి, గృహకల్ప మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం దేశ రాజధాని ఢిల్లీ భారత్ మండపంలో ఈ అవార్డు ప్రదానోత్సవం అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ మంత్రి ఆదిమూలపు సురేష్, విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్నారు.

బాధ్యత పెరిగింది..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వీఎంసీకి జాతీయ స్థాయిలో ఆరో స్థానం రావడం సంతోషదాయకం. ఈ అవార్డు కేవలం గుర్తింపు మాత్రమే కాదు ఇదొక బాధ్యత. భవిష్యత్తులో మరింత ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ప్రయత్నిస్తాం. రాష్ట్రంలో ఇతర నగరాలకు రోల్ మోడల్‌గా విజయవాడను తీర్చిదిద్దుతాం. అవార్డు రావడానికి నగరపాలక సంస్థ పాలక వర్గం, అధికారులు, సిబ్బంది, కార్మికుల కృషి ఎంతో ఉంది.

– రాయన భాగ్యలక్ష్మి, మేయర్, విజయవాడ

విజయమే లక్ష్యం

- ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జుల మార్పు
- సామాజిక న్యాయానికి పెద్ద పీట
- విజయవాడ పార్లమెంట్ సమన్వయకర్తగా కేశినేని నాని
- పెడన సమన్వయకర్తగా ఉప్పాల రాము
- పెనమలూరుకు ఇన్‌చార్జిగా మంత్రి జోగి రమేష్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నిరంతరం ప్రజాక్షేత్రంలో గడుపుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లి, ప్రజల మనసులకు మరింత చేరువైన నేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. జిల్లాలోని అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ పలు నియోజకవర్గాల ఇన్‌చార్జిలను నియమించారు. కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గ సమన్వయ కర్తగా ఉప్పాల రాము, పెనమలూరు నియోజకవర్గానికి మంత్రి జోగి రమేష్, ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సమన్వయకర్తగా కేశినేని నానిని నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

విజయవాడపై ఫోకస్..



విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సమన్వయకర్తగా ఎంపీ కేశినేని నానిని నియమించారు. ఈయనకు విజయవాడ ఈస్ట్, సెంట్రల్, వెస్ట్ నియోజకవర్గాలతో పాటు తిరువూరు, మైలవరం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పట్టు ఉంది. వరుసగా రెండు సార్లు ఎంపీగా గెలుపొందిన ఆయన టాటా ట్రస్టు తరఫున గ్రామీణ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పెనమలూరుకు మంత్రి జోగి..



పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి జోగి రమేష్ నియమితులయ్యారు. ఈ నియోజకవర్గంలో ఎస్సీ, బీసీలు అధికంగా ఉన్నారు. దీంతో ఈ నియోజక వర్గంలో బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తూ.. గౌడ సామాజిక వర్గానికి చెందిన మంత్రి జోగి రమేష్‌ను సమన్వయ కర్తగా నియమించారు. ఈయనకు నియోజక వర్గ వ్యాప్తంగా సన్నిహిత సంబంధాలు ఉండటంతో పాటు గట్టి పట్టు ఉంది.

విధేయతకు పట్టం..



పెడన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉప్పాల రామును ప్రకటించారు. ఈయన బీసీ గౌడ సామాజిక వర్గానికి చెందినవారు. పార్టీ ఆవిర్భావం నుంచి తన తండ్రి రాంప్రసాద్‌తో పాటు కుటుంబ సభ్యులు పార్టీని వెన్నంటి ఉండి, పార్టీ కోసం కష్టపడి పని చేశారు. వీరి సేవలను గుర్తించిన పార్టీ ఇప్పటికే ఉప్పాల రాము భార్య ఉప్పాల హారికను ఉమ్మడి కృష్ణా జిల్లా చైర్‌పర్సన్‌గా నియమించింది. కాగా పెడన నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉంది. అలాగే ఈ కుటుంబానికి ఇక్కడ మంచి గుర్తింపు ఉంది. క్యాడర్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇవన్నీ వీరికి కలిసొచ్చే అంశం.

రాము ఇంటి వద్ద కోలాహలం..



పెడన నియోజకవర్గ సమన్వయకర్తగా రామును నియమించడంతో ఆయన ఇంటి వద్ద గురువారం రాత్రి కోలాహలం కనిపించింది. వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బారులు తీరారు. అభినందనలు తెలియజేస్తూ పుష్ప గుచ్ఛాలను ఇచ్చి, మిఠాయిలు తినిపించారు.

టీడీపీకి మరో షాక్

- ఆ పార్టీకి మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్ రాజీనామా
- సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిక

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ముందు టీడీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఇప్పటికే విజయవాడ ఎంపీ కేశినేని నాని వైఎస్సార్ సీపీలో చేరి టీడీపీకి ఝలక్ ఇచ్చారు. ఎంపీ కేశినేని నాని బాటలోనే తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్, ఆయన భార్య, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్ సీపీలో చేరి టీడీపీకి మరో షాక్ ఇచ్చారు. ప్రజారంజక పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా వైఎస్సార్ సీపీలో ఎంపీ కేశినేని నాని, నల్లగట్ల స్వామి దాస్ చేరడంతో పార్టీ మరింత బలోపేతం కానుంది.

క్లీన్ స్వీప్‌పై గురి..



విజయవాడ పార్లమెంటు స్థానంతో పాటు, దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లలో క్లీన్ స్వీప్ చేసే దిశగా వైఎస్సార్ సీపీ అడుగులు వేస్తోంది. టీడీపీ 60 శాతం పైగా ఖాళీ అవుతుందని ఇప్పటికే ఎంపీ కేశినేని నాని ప్రకటించారు. అందుకు అనుగుణంగా టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు ప్రారంభమయ్యాయి.

అవమానాలు భరించలేక..

నల్లగట్ల స్వామిదాసు 30 ఏళ్లుగా టీడీపీని అంటి పెట్టుకుని ఉన్నారు. పార్టీ కోసం కష్టపడ్డారు. చంద్రబాబునాయుడు ఇంటి గేటు వద్ద కాపలా కాసినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని స్వామిదాసు ఆవేదన వ్యక్తం చేయడం తిరువూరు టీడీపీ నేతల్లో చర్చనీయాంశంగా మారింది. ఆత్మగౌరవం లేనిచోట తాము ఉండలేమని ఆయన చేసిన వ్యాఖ్యలు టీడీపీలో కలకలం రేపుతున్నాయి. 1994, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా స్వామిదాసు పోటీ చేసి విజయం సాధించారు. ఆయన భార్య సుధారాణి కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. 2014 ఎన్నికల సమయంలో చివరిలో పార్టీ టికెట్టు ఇవ్వకుండా చంద్రబాబు మోసం చేసి మాజీ మంత్రి జవహర్‌కు టికెట్టు కేటాయించారు. అయినా స్వామిదాసు టీడీపీనే అంటి పెట్టుకొని ఉన్నారు. తిరువూరు సభలో తనను అవమానించడంతో స్వామిదాసు సభకు దూరంగా ఉన్నారు. కాగా నియోజకవర్గంలో ఇప్పటికే వరుసగా రెండు సార్లు విజయాలతో వైఎస్సార్ సీపీ బలంగా ఉంది. స్వామిదాస్ రాకతో మరింత పుంజుకోనుంది.

ఉపాధి కల్పనకు సరికొత్త వెబ్‌సైట్

ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్



వెబ్ పోర్టల్‌ను ప్రారంభించిన సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరొక ముందడుగు వేసిందని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వెబ్ పోర్టల్‌ను జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక సంస్థల్లో ఉపాధి అవకాశాలను తెలుసుకుని దరఖాస్తు చేసుకునే విధంగా ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారన్నారు. ఈ వెబ్‌సైట్ ద్వారా అనేక ప్రాంతాలలో ఖాళీగా ఉండే ఉద్యోగ వివరాలను పొందుపరిచారన్నారు. వీటి ద్వారా నిరుద్యోగ యువతకు వారి అర్హతను బట్టి కావాల్సిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడం సులభతరమవుతుందన్నారు.

ఉద్యోగావకాశాలు..

అనంతరం జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు మాట్లాడుతూ గతంలో స్థానిక ఉపాధి కల్పన కార్యాలయాల్లో నిరుద్యోగ యువత వివరాల నమోదు జరిగేదని, తద్వారా సీనియారిటీ ప్రకారం ఉద్యోగాల భర్తీ పూర్తి చేసేవారన్నారు. ఈ పోర్టల్‌లో ఆధార్, ఫోన్ నంబర్ ద్వారా లాగిన్ అయి తమ విద్యార్హతల వివరాలను నమోదు చేయగానే మొబైల్‌లో సందేశం వస్తుందన్నారు. ఆ వెంటనే వివరాలు అయా జిల్లా స్థాయి అధికారికి చేరి వారి ఆమోదంతో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ వస్తుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతల నమోదు తదితర సేవలు వెబ్ పోర్టల్ ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధి అధికారి వై.సత్య బ్రహ్మం (ఒకేషనల్ గైడెన్స్), ఎస్.జయరాజు పాల్గొన్నారు.

అన్న తోడుంటే వ్యాపారం పండుగే

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు' సాయం

- జిల్లాలో 16,967 మంది లబ్ధిదారులకు రూ. 17.95 కోట్ల రుణాలు
- మరో 18,397 మందికి రూ. 51.29 లక్షల వడ్డీ మాఫీ
- ఎన్టీఆర్ జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్



జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్‌ను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని అమలుచేస్తోందని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ అన్నారు. జిల్లాలో 8వ విడతలో 16,967 మంది లబ్ధిదారులకు రూ. 17.95 కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. అదే విధంగా సకాలంలో రుణాలు చెల్లించిన 18,397 మందికి రూ. 51.29 లక్షల వడ్డీ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారన్నారు. ఈ కార్యక్రమాన్ని గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదా రులతో కలిసి జేసీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుతో కలిసి లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు.

జిల్లాలో లబ్ధి ఇలా..

జేసీ సంపత్ కుమార్ మాట్లాడుతూ వడ్డీ వ్యాపారులు, ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవిస్తున్న చిరు వ్యాపారులకు అండగా నిలిబడేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని అమలుచేస్తోందన్నారు. చిరువ్యాపారులు, హస్తకళాకారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారికి రూ. 10 వేల చొప్పున సున్నా వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన వారికి రూ. 10 వేలకు అదనంగా ఏడాదికి మరో రూ. వెయ్యి చొప్పున జోడిస్తూ రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. 8వ విడతతో కలిపి జిల్లాలో ఇప్పటి వరకు 1,46,724 మంది లబ్ధిదారులకు రూ. 149.39 కోట్ల రుణాలు అందినట్లు తెలిపారు. అదే విధంగా 70,428 మందికి రూ. 1.68 కోట్ల మేర వడ్డీ రీయింబర్స్ చేశామన్నారు.


వృత్తిదారులకు ప్రయోజనం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న తోడు పథకం ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 వేలు చొప్పున బ్యాంకు ద్వారా అందుతున్న వడ్డీ లేని రుణాలతో చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు ప్రయోజనం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, భట్రాజ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి దేవి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో కృష్ణా జిల్లాకు రెండో స్థానం

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఉపాధి హామీ పథకం కింద పనిదినాల కల్పనలో రాష్ట్రంలో కృష్ణా జిల్లా రెండోస్థానంలో నిలిచిందని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రాధాన్య భవనాలు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ రాజాబాబు సీఎస్‌కు జిల్లా ప్రగతిని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా 68 లక్షల పనిదినాల కల్పన లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 66 లక్షల పనిదినాలు కల్పించి 97 శాతంతో రాష్ట్రంలో జిల్లా రెండోస్థానంలో నిలిచిందన్నారు. జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో పెద్ది రోజా, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జిల్లా వైద్య శాఖాధికారి గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో జేసీ గీతాంజలి, డీఆర్వో రోజా

అంబేడ్కర్ ఫొటో ప్రదర్శన పరిశీలన



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న జేసీ గీతాంజలి శర్మ, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను గురువారం కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పరిశీలించారు. ఈ నెల 19వ తేదీన విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో సామాజిక సమతా సంకల్ప మహోత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అంబేడ్కర్ జీవితచరిత్రపై జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను జేసీ గీతాంజలిశర్మ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితచరిత్ర ప్రతి ఒక్కరూ ఈ ఫొటో ప్రదర్శన ద్వారా తెలుసుకుని ఆయన ఆశయాలకు స్ఫూర్తిగా నడుచుకోవాలని సూచించారు. ఈ ఫొటో ప్రదర్శన శుక్రవారం కూడా కొనసాగుతుందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహెద్‌బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ చంద్రయ్య పాల్గొన్నారు.

విస్తృతంగా 'జన్ భగీదరి'

చిలకలపూడి(మచిలీపట్నం): సామాజిక సమతా సంకల్పం (జన్ భగీదరి) పేరుతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ నేపథ్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో 508 గ్రామ, వార్డు సచివాలయాలకు గానూ ఇప్పటి వరకు 498 సచివాలయాల స్థాయిలో ఈ కార్యక్రమాలు నిర్వహించి 28,317 మంది పౌరులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారన్నారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిస్తామని మద్దతు తెలుపుతూ ప్రతిజ్ఞ చేస్తూ 27,079 మంది సంతకాలు చేశారన్నారు. ఈ నెల 17వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల్లో అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్ది పూలమాలలతో ఘనంగా నివాళులర్పిస్తారన్నారు. ఈ నెల 18వ తేదీన జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో కోనేరు సెంటర్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడలి (లక్ష్మీటాకీస్ సెంటర్) వరకు మారథాన్ నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

అవనిగడ్డ సబ్ డివిజన్‌లో 900 మంది బైండోవర్



చల్లపల్లి: సంక్రాంతి, ఎన్నికల సందర్భాలను పురస్కరించుకుని అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో 900 మందిని బైండోవర్ చేసినట్లు అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషనులో గురువారం సాయంత్రం డీఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు. సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేలు, పేకాట నిర్వహించేవారు, కోడి కత్తులు తయారు చేసేవారు, విక్రయించేవారు, ఎన్నికల నేపథ్యంలో నేర ప్రవృత్తి కలిగిన వారిని 900 మందిని గుర్తించి బైండోవర్ చేసినట్లు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుండాట, ఇతర జూదాలు నిర్వహించినా, పాల్గొన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ సీహెచ్ నాగ ప్రసాద్, చల్లపల్లి, మోపిదేవి ఎస్‌ఐలు సీహెచ్ చినబాబు, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

నగదు, వెండి వస్తువులు స్వాధీనం



పోలీసుల అదుపులో వెండి సామాన్లతో షాపు యజమాని

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు రహదారుల్లో పోలీసులు గురువారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ ఎ. పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం..బంటుమిల్లి నుంచి గుడివాడ, మచిలీపట్నం, నర్సాపురం రహదారుల్లో పోలీసు బృందాలు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా రూ. 3.84 లక్షల నగదును విజయవాడ నుంచి అమలాపురం తీసుకువెళుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అలాగే విజయవాడ నుంచి భీమవరం తరలిస్తున్న సుమారు 15 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని విజయవాడకు చెందిన మీనాక్షి సిల్వర్ షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. ముమ్మరంగా తనిఖీలు చేసిన ఎస్‌ఐని, సిబ్బందిని పెడన సీఐ ఎండీ హబీబ్‌బాషా అభినందించారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం

- మొత్తం 7 విభాగాల్లో పోటీలు
- పూజ చేసి పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొడాలి నాని
- తొలిరోజు రెండు పళ్ల విభాగంలో పాల్గొన్న 11 ఎడ్ల జతలు



బండ లాగుతున్న ఎడ్ల జత



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని లింగవరం రోడ్డులో ఉన్న కే కన్వెన్షన్ నగర్‌లో ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు జాతీయస్థాయి పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రెండు పళ్ల విభాగం పోటీలను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో మొత్తం నాలుగు రాష్ట్రాలకు చెందిన రైతులు తమ ఎడ్లను తీసుకువస్తున్నారన్నారు. రెండు పళ్లు, నాలుగు పళ్లు, ఆరు పళ్ల విభాగాలతో పాటు, సేద్య విభాగం, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మొత్తం ఏడు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఒక్కొక్క విభాగానికి 9 బహుమతులు ఉంటాయని, రెండు పళ్ల విభాగంలో రూ.30 వేల నుంచి రూ.5 వేల వరకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ పోటీలు కొనసాగుతాయని వివరించారు. ఒంగోలు జాతి పశు సంపద అంతరించిపోకుండా రైతులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొడాలి నాని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ పోటీలను తిలకించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సీనియర్ నాయకులు పాలడుగు రామ్ ప్రసాద్, దుక్కిపాటి శశిభూషణ్, రూరల్ మండల ఎంపీపీ గద్దె పుష్పరాణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మట్టా నాగమణి, నియోజకవర్గానికి చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎడ్ల పోటీల విజేతలు

మొదటిరోజు రెండు పళ్ల విభాగంలో మొత్తం 11 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా మొత్తం 9 విభాగాలలో బహుమతులు అందజేశారు. కన్నిదార రవితేజ చౌదరి ఎడ్లు మొదటి బహుమతి రూ.30 వేలు, బిట్టా కార్తికేయ ఎడ్లు రెండో బహుమతి రూ.25 వేలు, బెల్లంకొండ రామాయమ్మ, కంచనకుర్తి గంగరాజు ఎడ్లు మూడో బహుమతి రూ.22 వేలు, ములకలపల్లి సురేష్ సంధ్య, కె.గోపిరెడ్డి ఎడ్లు నాలుగో బహుమతి రూ.18 వేలు, దండూరి శ్రీరాములు ఎడ్లు ఐదో బహుమతి రూ.15 వేలు, అత్తలూరి లక్ష్మీతిరుపతమ్మ ఎడ్లు ఆరో బహుమతి రూ.13 వేలు, మార్నెళ్ల నాగేశ్వరరావు, గరికెపాటి వెంకట్ ఎడ్లు ఏడో బహుమతి రూ.10 వేలు, కూతుర్ల దక్షితారెడ్డి, నిషాంత్ రెడ్డి ఎడ్లు ఎనిమిదో బహుమతి రూ.8 వేలు, కైప వెంకటరామిరెడ్డి ఎడ్లు తొమ్మిదో బహుమతి రూ.5 వేలు కైవసం చేసుకున్నాయి.

తుర్లపాటి పాత్రికేయ జీవితం తెరచిన పుస్తకం



తుర్లపాటి సంస్మరణ సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి

విజయవాడకల్చరల్: సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు పాత్రికేయ జీవితం తెరచిన పుస్తకమని రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి అన్నారు. తెలుగు కళావాహిని కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి, కృష్ణ కళాభారతి సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద బుధవారం తుర్లపాటి కుటుంబరావు తృతీయ సంస్మరణ, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ తుర్లపాటి వార్తల్లోని వ్యక్తి శీర్షిక ద్వారా నాలుగు వేలకు పైగా ప్రముఖ వ్యక్తుల జీవితాలను తెలుగు వారికి అందించినట్లు తెలిపారు. తెలుగు పత్రికా రంగంలో తొలి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారన్నారు. 16 మంది ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సన్నిహితంగావుండేవారని గుర్తుచేశారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ అనేకమంది దేశ విదేశీ ప్రముఖులతో తమ భావాలను పంచుకునేవారన్నారు. శాసన సభ్యుడు గద్దె రామ్మోహన్, ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణ, తుర్లపాటి కుటుంబరావు కుమారుడు తుర్లపాటి జవహర్, నగర సీపీఎం నాయకుడు బాబూరావు, డాక్టర్ వేణుగోపాల రెడ్డి, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్, తుర్లపాటితో అనుబంధం గుర్తు చేసుకున్నారు. అతిథులు తుర్లపాటి చిత్ర పటానికి నివాళి సమర్పించారు.

అఖిల భారత వర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో రష్మితకు కాంస్యం



కాంస్య పతకం సాధించిన రష్మిత

విజయవాడస్పోర్ట్స్: అఖిల భాతర విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన క్రీడాకారిణి దోనేపూడి రష్మిత సత్తా చాటింది. చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ నెల ఏడో తేదీ నుంచి జరుగుతున్న పోటీల్లో ఆమె కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. రష్మిత ఎస్ఆర్ఎం యూనివర్సిటీ(చెన్నై)లో బీబీఏ చదువుతోంది. ఈ పోటీలకు అదే యూనివర్సిటీ నుంచి ఆమె ప్రాతినిధ్యం వహించింది. ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా వర్సిటీ పోటీల్లో పతకం సాధించిన రష్మితను కృష్ణాజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పరసా శ్రీనివాస్ అభినందించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బైక్ చోరీ కేసులో భవానీపురం పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రూ. 2.15లక్షల విలువైన 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలు జరుగుతున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ విశాల్ గున్ని సూచనలతో విజయవాడ వెస్ట్ డివిజన్ ఏసీపీ డాక్టర్ హనుమంతు రావు పర్యవేక్షణలో భవానీపురం టౌన్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి దర్యాప్తు వేగవంతం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని అనుమానితులు, పాత నేరస్తుల కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేశారు. రామరాజ్యనగర్ కట్ట వద్ద గల చెట్ల పొదల్లో అనుమానితుడైన వ్యక్తి షేక్ బాషాని అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు చోరీ చేసిన బైక్ లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు

కైకలూరు: వరసకు బావ అయిన తన భర్త అన్నయ్య వేధిస్తుండడంతోపాటు, తన భర్త అదనపు కట్నం కోసం ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓ వివాహిత కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోకర్ణపురం గ్రామానికి చెందిన అదూరి సుబ్బలక్ష్మి శృంగవరప్పాడు అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తోంది. ఆమెకు దుర్గాప్రసాద్‌తో 23 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, ఆయన సోదరుడు సుబ్రహ్మణ్యం లైంగికంగా వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ ఎస్సై జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమసమాజం కోసం పాటుపడిన అంబేడ్కర్

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్



రైల్వేస్టేషన్ సెంటరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మారుమూడి విక్టర్‌ప్రసాద్

మచిలీపట్నంటౌన్: దేశంలో సమసమాజ నిర్మాణం కోసం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్, పోర్టురోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఈ నెల 19వ తేదీన ఆవిష్కరిస్తున్న నేపథ్యంతో పాటు విక్టర్‌ప్రసాద్ జన్మదినం కావటంతో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆదుకుంటున్నారన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ముందుకు సాగుతున్న వైఎస్ జగన్ ఆ మహనీయుడి మహా విగ్రహాన్ని విజయవాడలో ఆవిష్కరించనున్న నేపథ్యంలో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. నిడుమోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విద్యార్థుల మధ్య మారుమూడి విక్టర్‌ప్రసాద్ జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనంద బాబు (జానీ), వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, చీలి చక్రపాణి, దార్ల చెన్నకేశవరావు, దళిత జేఏసీ నాయకులు కొండమంచిలి చంద్రశేఖర్, సీహెచ్ రవికుమార్, దాసి సీతారామరాజు, కుంపటి జయకర్‌బాబు, శ్రీహరి, తప్పెట రాజు తదితరులు పాల్గొన్నారు.

నయవంచనతో యువతి బలవన్మరణం

- పురుగుల మందు తాగి మృతి
- నిందితునిపై లైంగిక దాడి, ఆత్మహత్య ప్రేరేపణ కేసు నమోదు



కంకిపాడు: ప్రేమించానన్నాడు...నమ్మింది..ప్రేమకు లొంగింది. సర్వం అర్పించింది. తీరా పెళ్లి చేసుకోమంటే నిరాకరించాడు. ప్రేమ పేరుతో జరిగిన నమ్మక ద్రోహానికి తట్టుకోలేకపోయింది. నయవంచన తట్టుకోలేక పురుగుల మందు తాగి బలవన్మరణం చెందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు...పట్టణానికి చెందిన యువతి (20) కొరియర్ షాపులో పనిచేసేది. మండలంలోని కాసరనేనివారిపాలెం గ్రామానికి చెందిన చోడవరపు రాజు (20) కంకిపాడులోని విస్తరాకుల షాపులో పనిచేస్తుంటాడు. వీరిద్దరికీ పరిచయం ఏర్పడి అది కాస్తా ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించటంతో సర్వం అర్పించింది. తీరా వివాహం చేసుకోమని కోరితే రాజు నిరాకరించాడు. నమ్మక ద్రోహం భరించలేక ఈనెల 9వ తేదీ సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు ఆసుపత్రికి వెళ్లి ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువతి మృతి చెందింది. ఈ ఘటనపై లైంగికదాడి, ఆత్మహత్య ప్రేరేపణ కేసులు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా నిందితుడు చోడవరపు రాజును అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపారు.

జాతీయ క్రాస్ కంట్రీ అథ్లెటిక్ పోటీలకు పీబీ సిద్ధార్థ విద్యార్థి



జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన పవన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

విజయవాడస్పోర్ట్స్: జాతీయ క్రాస్ కంట్రీ అథ్లెటిక్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి బి.పవన్ ఎంపికైనట్లు పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ వ్యాయామ విద్యా అధ్యాపకుడు ఎ.చినబాబు తెలిపారు. ఇటీవల సామర్లకోటలో జరిగిన అండర్–20 రాష్ట్ర స్థాయి 8 కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పోటీల్లో పవన్ తృతీయ స్థానం సాధించడంతో పాటు జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాడన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి బీహార్‌లో జరిగే 58వ క్రాస్ కంట్రీ జాతీయ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. జాతీయ పోటీలకు ఎంపికైన పవన్‌ను కాలేజీ ప్రిన్సిపాల్ మేకా రమేష్, డైరక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల కాలేజీ ప్రాంగణంలో గురువారం అభినందించారు. జాతీయ పతకం సాధించి జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని చాటాలని ఈ సందర్భంగా క్రీడాకారుడికి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



రాకేష్ మృతదేహం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి–సావరగూడెం రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల సమాచారం ప్రకారం...ఆగిరిపల్లి మండలం కొమ్మూరు గ్రామానికి చెందిన దోమ రాకేష్(23) ఎస్‌బీఐ క్లర్క్ పరీక్ష రాసేందుకు కానూరు వచ్చాడు. సాయంత్రం బైక్‌పై తిరిగి వెళ్తుండగా కేసరపల్లి–సావరగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డులో కల్వర్టు వద్ద మలుపు తిరుగుతుండగా వాహనం అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసు లకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్లు జైలు

విజయవాడస్పోర్ట్స్: పదేళ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన 50 ఏళ్ల వ్యక్తికి ఐదేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజిని గురువారం తీర్పు చెప్పారు. విజయవాడ నున్న పోలీస్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య నగర్‌కు చెందిన బాలిక సమీపంలోని పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. స్కూల్ నుంచి ఇంటికి వచ్చే సమయంలో అదే ప్రాంతానికి చెందిన పసుపులేటి రాము డబ్బులు ఆశ చూపి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లి దిశ పోలీసులను ఆశ్రయించింది. 2022 నవంబర్ 18వ తేదీన వెలుగు చూసిన ఈ ఘటనపై దిశ పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితుడు రాముపై కేసు నమోదు చేశారు. బాధితుల తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.నాగిరెడ్డి కోర్టుకు వాదనలు వినిపించారు. ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించిన జరిమానాలో రూ.20 వేలను, మరో రూ.50 వేలను నష్ట పరిహారంగా బాధితురాలికి అందజేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

బైకుపై నుంచి కిందపడిన వ్యక్తి మృతి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వీధి కుక్క అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు బైకుపై నుంచి కిందపడి గాయాలపాలైన ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సింగ్‌నగర్‌లో జరిగింది. సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ ఎంకే బేగ్ స్కూల్ సమీపంలో నివసిస్తున్న వెన్నెల హరికృష్ణ(34) బీసెంట్ రోడ్డులోని మహంతి చేపల మార్కెట్‌లో చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలానే ఈ నెల 10వ తేదీన కూడా తన పనులన్నీ ముగించుకొని రాత్రి 11 గంటల సమయంలో సింగ్‌నగర్‌లోని తన ఇంటికి బైకుపై వెళ్తుండగా సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద వీధికుక్క అడ్డు వచ్చింది. దీంతో ఒక్కసారిగా బైకు అదుపుతప్పి కిందపడిపోవడంతో హరికృష్ణ తలకు, ఛాతీపై తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మెరుగైన వైద్యసేవల కోసం కుటుంబ సభ్యులు మంగళగిరి ఎన్ఆర్‌ఐ హాస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్లు జైలు

విజయవాడస్పోర్ట్స్: అదనపు కట్నం కోసం వేధించి భార్య ఆత్మహత్య చేసుకునేందుకు ప్రేరేపించిన భర్తకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్, ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజాదేవి గురువారం తీర్పు చెప్పారు. విజయవాడ నందమూరి నగర్‌కు చెందిన శిరీష పీహెచ్‌డీ పూర్తి చేసి నగరంలోని ఓ కళాశాలలో అధ్యాపకురాలుగా పని చేసేది. ఇదే క్రమంలో అదే ప్రాంతానికి చెందిన బాణం రాజేష్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెద్దల సమక్షంలో ఇరువురు వివాహం చేసుకున్నారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. కొన్నాళ్ల తరువాత అదనపు కట్నం కోసం రాజేష్ నిత్యం వేధిస్తుండటంతో శిరీష ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 2020 మార్చి తొమ్మిదో తేదీన ఈ ఘటన జరిగింది. శారీరక, మానసిక వేధింపుల కారణంగానే తన కుమార్తె ఉరి వేసుకుని చనిపోయిందని శిరీష తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు రాజేష్‌ను కోర్టులో హాజరుపర్చారు. బాధితుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.హెచ్.విష్ణువర్ధన్ కోర్టుకు వాదనలు వినిపించారు. 12 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు రాజేష్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ భారతీ నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు ప్రకటనలో తెలిపారు. భారతీ నగర్ మెయిన్ రోడ్డుతో పాటుగా 1 నుంచి 15వ అంతర్గత రహదారి వరకు, నోవాటెల్ హోటల్ పరిసర ప్రాంతాలు, వివేకానంద విగ్రహం రోడ్డు, తిమ్మరుసు వారి వీధి, శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

397 మందికి వైద్య పరీక్షలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ 15వ డివిజన్ 71 వ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన వచ్చింది. గురువారం డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మెడికల్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా 397 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెల్లం దుర్గ మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి రామలింగేశ్వరనగర్‌లో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్థానికులు వైద్యసేవలను పొందుతున్నారన్నారు. మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, డివిజన్ అధ్యక్షులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జీవనోపాధి నిమిత్తం తోపుడు బండి పంపిణీ



గుణదల (విజయవాడ తూర్పు): పేదలకు సహాయ కార్యక్రమాలు నిర్వహించే దిశగా దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తుందని ఆ ట్రస్ట్ వైస్ చైర్మన్ దేవినేని సుధీర అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బాబు అనే వ్యక్తికి తోపుడు బండి అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగరంలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్‌లలో బడ్డీ కొట్లు, ఇస్త్రీ పెట్టెలు, తోపుడు బండ్లను పంపిణీ చేశామన్నారు. రూ. 25 వేలు ఖరీదు చేసే బండిని వితరణ చేశారు. కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, కోఆప్షన్ సభ్యులు ముసునూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఓబన్న కృషి చిరస్మరణీయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల వడ్డెర కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి ఘనంగా నిర్వహించారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల రమణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవల్ల రేవతి హాజరయ్యారు. ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడ్డెర జాతి అభ్యున్నతి కోసం ఓబన్న చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అటువంటి మహనీయుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని నేటి వడ్డెర యువత ముందుకు సాగాలని కోరారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయటమే కాకుండా దానికి చైర్మన్, డైరెక్టర్లను నియమించి వడ్డెర జాతికి అందిస్తున్న సంక్షేమ పథకాల సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని చెప్పారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల వెంకట రమణారావు మాట్లాడుతూ వెనుకబడిన కులాలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. ముఖ్యంగా వడ్డెర సామాజికవర్గ ప్రజల అభ్యున్నతి కోసం సీఎం జగనన్న చేస్తున్న కృషి మరువలేమన్నారు. ఆయన స్ఫూర్తితోనే వడ్డెర సామాజికవర్గానికి సేవలు అందిస్తామని తెలిపారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో భోగి మంటల వద్ద విద్యార్థినులు, అధ్యాపకుల సందడి



సంక్రాంతి ముగ్గులు వేస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బొమ్మల కొలువులు, భోగి మంటలు, గొబ్బెమ్మలు, గాలిపటాలు, రంగవల్లులతో పీబీ సిద్ధార్థ కళాశాల మైదానం సందడిగా మారింది. సిద్ధార్థ కళాశాల గుడ్ హ్యాబిట్స్ క్లబ్, ఉమెన్స్ క్లబ్, మహిళా సాధికారతా విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను కళాశాల ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు అమ్మాయి, తెలుగు అబ్బాయి పేరుతో నిర్వహించిన పోటీల్లో సాంప్రదాయ దుస్తుల్లో యువతీ యువకులు పాల్గొన్నారు. భోగి మంటలు వేసి చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డీన్ రాజేష్‌తో పాటుగా అధ్యాపకులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో....

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థినులు రంగు రంగుల రంగవల్లులు వేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు, బొమ్మల కొలువు, కోలాటం, భోగిపళ్లు, గాలిపటాలు, నృత్యరూపకాలు, ఆటల పోటీలు, రకరకాల పిండి వంటలు వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎ.సునీత, కల్చరల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బొమ్మల కొలువుల వద్ద విద్యార్థులు



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న విద్యార్థులు

పేదల సంక్షేమానికి అహర్నిశలూ కృషి

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లో మహ్మద్ వలి స్ట్రీట్, మల్లెల తిరుపతమ్మ స్ట్రీట్, మసీద్ స్ట్రీట్, జెండా చెట్టు రోడ్డు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డితో కలిసి గురువారం ఆయన పర్యటించారు. గడప గడపకి వెళ్లి నాలుగున్నర ఏళ్ల జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే కార్యక్రమాలను మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నుంచి ఇతర పార్టీలకు వెళ్లే నాయకులందరూ ప్రజల్లో అభిమానం కోల్పోయిన, పార్టీకి భారమైన వారేనన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. దేవినేని అవినాష్ కుటుంబ సభ్యులు పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. 3వ డివిజన్‌లో కామినేని నగర్, గణేష్‌నగర్ ప్రాంతాలలో దేవినేని సుధీర, 12వ డివిజన్‌లో శివాజీ రోడ్డు ప్రాంతంలో దేవినేని క్రాంతి, 14వ డివిజన్‌లో నల్లూరి సత్యనారాయణ నగర్ ప్రాంతంలో వై.సిద్ధార్థ గడప గడపకి వెళ్లి గత నాలుగున్నర ఏళ్ల కాలంలో జరిగిన సంక్షేమాభివృద్ధిని వివరిస్తూ మీ అవినాష్ అన్న హామీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో 3, 14 డివిజన్ల కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, చింతల సాంబశివరావు, కో ఆప్షన్ మెంబర్ ముసునూరు సుబ్బారావు, 12వ డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్ వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్

రాజకీయాలకు అతీతంగా ముదిరాజ్ సమాజ నిర్మాణం

ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొర్న నారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాజకీయాలకు అతీతంగా సమర్ధవంతమైన ముదిరాజ్ సమాజాన్ని నిర్మించటమే ఈ ముదిరాజ్ జనచైతన్య యాత్రల ముఖ్య ఉద్దేశమని ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్న నారాయణ తెలిపారు. రాష్ట్రంలోని ముదిరాజులను చైతన్య పరచే దిశగా వివిధ ప్రాంతాల్లో రేపటి తరం కోసం నేటి తరం ప్రయత్నం పేరుతో జరుగుతున్న ముదిరాజ్ జన చైతన్య రథ యాత్రలో భాగంగా గురువారం సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో నిర్వహించిన రథయాత్రలో ఆయన మాట్లాడారు. జనాభా ధామాషా ప్రకారం రాజకీయాల్లో మన వాటాను కోరుకోవడం ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కని తెలిపారు. ముదిరాజ్ మహాసభలో నాయకులు, కార్యకర్తలు వేరు కాదని, మేధావులు, ఉద్యమకారులు, కళాకారులు సమష్టిగా పని చేస్తున్నారని చెప్పారు. ఈ ముదిరాజ్ మహాసభ ఏక వ్యక్తి నాయకత్వం కింద నడిచే సంస్థ కాదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు బీసీ–డీలో ఉన్న ముదిరాజులను బీసీ–ఎ కేటగిరిలోకి మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పుడే ముదిరాజ్ సంఘీయులకు అనేక ప్రయోజనాలు ఒనకూరతాయని తెలిపారు. ముదిరాజ్ మహాసభ యూత్ ప్రసిడెంట్ కోలా ఏడుకొండలు మాట్లాడుతూ రేపటి తరం కోసం నేటి ప్రయత్నం పేరుతో ఊరూరా తిరుగుతూ సాగుతున్న ముదిరాజ్ జనచైతన్య రథయాత్రలో మన సంఘీయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివాజి (క్రేన్ శివాజి) మాట్లాడుతూ ముదిరాజ్‌లకు రాజ్యాధికారం కావాలని, ఆ దిశగా ముదిరాజ్ సమాజాన్ని చైతన్యపరచాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

కళాకారుడు బుల్లెట్ వెంకన్న నేతృత్వంలో వరంగల్‌కు చెందిన ముదిరాజ్ కళా మండలి కళాకారులు డప్పు నరసింహం, వై. చంద్రకళ, కె.హారిక, టి.కల్యాణి ఆలపించిన చైతన్య గీతాలు అందరినీ ఆలోచింప చేశాయి. ముదిరాజ్ నాయకులు కంటు మహేష్, నామాల సుధాకర్, మేకల సుధాకర్, ఈర్ల నారాయణ, గోనేపల్లి రాజు, చెరుకుమల్లి నరేంద్ర, పుల్లారావు, మహిళా నాయకులు ఝాన్సీ, లలిత తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్ సంఘీయులతో కొర్న నారాయణ, ఏడుకొండలు, క్రేన్ శివాజి తదితరులు

కృష్ణా వర్సిటీ మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్ కేబీఎన్

మచిలీపట్నం... వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా హ్యాండ్ బాల్ పోటీల్లో కేబీఎన్ కళాశాల విద్యార్థినులు చాంపియన్‌షిప్‌ను సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. విశ్వ విద్యాలయ అంతర్ కలాశాలల హ్యాండ్ బాల్ మహిళా పోటీలు ఇటీవల మైలవరంలోని డాక్టర్ ఎల్ హెచ్ ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జరిగినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా తమ విద్యార్థినుల బృందం గతంలో సాధించిన విధంగానే ఈ ఏడాది సైతం విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. తమిళనాడు సేలంలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ మహిళా హ్యాండ్ బాల్ పోటీలకు కృష్ణా విశ్వవిద్యాలయం పక్షాన హాజరయ్యేందుకు ఏడుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అందులో ఎ.రాగ మౌనిక, పి.శివాని, జి. లలితా శ్రీ, జి.మానస, ఎస్.వెంకటేశ్వరమ్మ, బి.జెస్సీ, బి. లోకేశ్వరి ఉన్నారు. విజేతలను, వారిని కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావుని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాసు అభినందించినట్లు పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు.



విజయం సాధించిన విద్యార్థులు

అయ్యప్ప స్వాములకు అన్నసంతర్పణ



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని శ్రీ కోదండ రామాలయంలో శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములకు, భక్తులకు శరత్ గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. అయ్యప్ప స్వామి శరణ ఘోషలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. తొలుత అయ్యప్ప స్వాములు పూజ నిర్వహించి ఇరుమడి కట్టుకున్నారు. అనంతరం సద్ది స్వీకరించి శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు.

రైల్వే డీఆర్ఎంతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు భేటీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): సెంట్రల్ నియోజకవర్గంలో జరుగుతున్న పలు రైల్వే ప్రాజెక్టులపై ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పలు రైల్వే పనులపై డీఆర్ఎంతో చర్చించారు. ముఖ్యంగా శ్రీనగర్ కాలనీలో రైల్వే శాఖ కట్టిన గోడల వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసరంగా బయటకు వెళ్లే వారు బీఆర్టీఎస్ రోడ్డుకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. శ్రీనగర్, సత్యనారాయణపురం రైల్వేకాలనీని కలిపే రహదారిని పునరుద్ధరించాలని కోరారు.

వీఎంసీలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు



నూతనంగా ఏర్పాటైన ప్రత్యేక కమిటీలను అభినందిస్తున్న వెంకటసత్యం, వసంతలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకటసత్యం, వీఎంసీ కార్యదర్శి వసంత లక్ష్మి సంయుక్త ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరూ గురువారం సమావేశమయ్యారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులోని ఫ్లోర్ లీడర్ చాంబర్లో నిర్వహించిన సమావేశంలో గురువారం ఆరు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. నూతనంగా ఆరు ప్రత్యేక కమిటీలకు కార్పొరేటర్లను ఎన్నుకున్నారు. మంచినీటి సరఫరా భూగర్భ నీటిపారుదల ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా 54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ అకీబ్ అర్షద్, డెప్యూటీ చైర్మన్ వియ్యపు అమర్నాథ్ ఆరవ డివిజన్ కార్పొరేటర్ ఎన్నికయ్యారు. క్రీడలు, ట్రాఫిక్ ప్రత్యేక కమిటీకి చైర్‌పర్సన్‌గా 21 డివిజన్ కార్పొరేటర్ పుప్పాల నరస కుమారి డెప్యూటీ చైర్ పర్సన్ 61 డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి ఎన్నికయ్యారు. రోడ్లు, డ్రెయిన్లు వంతెనలు భవనముల నిర్మాణం ప్రత్యేక కమిటీకి చైర్మన్‌గా 40వ డివిజన్ కార్పొరేటర్ వై. ఆంజనేయ రెడ్డి, డెప్యూటీ చైర్మన్‌గా 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేద్కర్ ఎన్నికయ్యారు. లైటింగ్ పార్కుల అభివృద్ధి ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్ 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపురం విజయలక్ష్మి, డెప్యూటీ చైర్మన్‌గా 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ప్రజా ఫిర్యాదుల ప్రత్యేక కమిటీ చైర్ పర్సన్‌గా 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, డెప్యూటీ చైర్మన్ 43వ డివిజన్ కార్పొరేటర్ కోటిరెడ్డి ఎన్నికయ్యారు. మురికివాడల అభివృద్ధి ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్‌గా ఒకటవ డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, డెప్యూటీ చైర్మన్ 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ఎన్నికయ్యారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నడిబొడ్డులో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవానికి రాష్ట్రంలోని నూర్ బాషా సంఘీయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ ఓ.రసూల్ పిలుపునిచ్చారు. గురువారం గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగే స్మృతివనం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేశ చరిత్రలోనే ఒక అద్భుతమైన ఘట్టం ఆవిష్కృతం కాబోతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు జగన్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సముచిత స్థానం కల్పించారన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా 139 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నూర్ బాషా సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ, ఉపాధ్యక్షులు పులిమద్ది చిన మస్తాన్, నూర్‌బాషా, ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిన్నా, యువజన సంఘం నాయకులు షేక్ శ్రీను బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ ఓ రసూల్

అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చేందుకు కృషి

గుణదల (విజయవాడ తూర్పు): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. ఆర్థికంగా, సామాజికంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చే దిశగా స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు దేశంలోనే అతిపెద్ద విగ్రహానికి జగనన్న శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. విజయవాడ నడిబొడ్డు బందరు రోడ్డు స్వరాజ్య మైదానంలో 125 అడుగుల ఎత్తున అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించడం హర్షణీయమన్నారు. ఈ నెల 19వ తేదీన ఈ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, డెప్యూటి మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, వెంకట సత్యనారాయణ, భట్రాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలీ దేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలి

గుణదల (విజయవాడతూర్పు): విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రతిభావంతులుగా ఎదగాలని రాష్ట్ర గ్రంథాలయ సంఘం కార్యదర్శి రవి శారద అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో స్ఫూర్తి-2024 కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని కోరారు. మంచి ఫలితాలు సాధించి ఉన్నత వ్యక్తిత్వంతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతో పాటు తమలో ఉన్న ప్రతిభకు సానపెట్టి మంచి గుర్తింపు సాధించాలని కోరారు. లలిత కళలు, క్రీడలు, వంటి రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. కేవలం మార్కులకే పరిమితం కాకుండా సామాజిక అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులను బాధ్యతగల వ్యక్తులుగా తీర్చి దిద్దేందుకు ఆంధ్ర లయోల కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రూపు డ్యాన్సులు, స్కిట్స్, సింగింగ్ వంటి పోటీల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



శారదను సత్కరిస్తున్న లయోల కళాశాల సిబ్బంది

భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డికి సత్కారం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అర్జున అవార్డు గ్రహీత, భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డిని కోస్టల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బి.వేణుగోపాల్‌రెడ్డి విజయవాడ గాయత్రీ నగర్‌లోని ప్రధాన కార్యాలయంలో గురువారం సత్కరించారు. అజయ్‌కుమార్‌రెడ్డి క్రికెట్‌లో రాణించేందుకు బ్యాంకు తరపున సహకారం అందిస్తామని వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. 2018 సంవత్సరంలో అజయ్‌కుమార్ రెడ్డి కెప్టెన్ ఉన్న సమయంలో భారత్‌కు ప్రపంచ కప్ సాధించిందన్నారు. అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్జున అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ కేఏవీ రామన్, బ్యాంక్ చీఫ్ క్రెడిట్ ఆఫీసర్ వై.సత్యనారాయణ, బ్యాంక్ చీఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆఫీసర్ సురేష్‌కుమార్ అగ్రవాలాతో పాటుగా బ్యాంకు ఉద్యోగులు అజయ్‌కుమార్‌రెడ్డిని సత్కరించారు.

● పాయకాపురం: నున్న పోలీసు స్టేషన్ పరిధి ఏపీఎస్ రెడ్డి రోడ్డులో లక్ష్మీగణపతి కనస్ట్రక్షన్‌లో అద్దెకుంటున్న రిటైర్డు పాలిటెక్నిక్ కాలేజి లెక్చరర్ డీవీఎన్ పోతురాజు అనే మతి స్థిమితం లేని వ్యక్తి ఇంటి యజమాని చెల్లెలు కరణం సింహాచలం అనే మహిళపై గురువారం కత్తితో దాడి చేశాడు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. పోతురాజును పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వద్దు బాబూ.. మీకో దండం

సొంత జిల్లాలో చంద్రబాబు ఎదురీత.. కుప్పంలో ఓటమి ఖాయమని సర్వేల్లో తేటతెల్లం

తిరుపతి, చిత్తూరుకు పార్లమెంట్ అభ్యర్థులు ఎక్కడ?.. మిగిలిన అసెంబ్లీ స్థానాలకు వేధిస్తున్న క్యాండిడేట్ల కొరత



సాక్షి, తిరుపతి: అపర చాణక్యుడిగా ఎల్లో మీడియా ప్రచారం చేస్తున్న చంద్రబాబు 2024 సార్వత్రిక ఎన్నికల్లో బొక్కబోర్లాపడటం ఖాయంగా కనిపిస్తోంది. సొంత జిల్లాలో ఓటమి భయం ఆయన్ను వెంటాడుతోంది. చిత్తూరు జిల్లా మొత్తం వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని సర్వేలు తేటతెల్లం చేస్తుండటంతో టీడీపీ నుంచి అభ్యర్థులుగా బరిలో దిగేందుకూ నాయకులు వెనకాడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నా ఆ పార్టీ ఇంకా అభ్యర్థుల కోసం వెంపర్లాడుతోంది. తిరుపతి, చిత్తూరు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకలేదు. గత ఎన్నికల్లో తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన పనబాక లక్ష్మి ప్రస్తుతం బరిలోకి దిగేందుకు ససేమిరా అంటున్నారు. చిత్తూరు పార్లమెంట్‌కు అంజనం వేసినా అభ్యర్థి కనిపించటం లేదు. ఇక అసెంబ్లీ స్థానాల విషయానికొస్తే అభ్యర్థులు పూర్తిగా ఆశలు వదులుకున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా కనీసం అభ్యర్థులు కూడా దొరక్కపోవటంతో ఇటు టీడీపీ, అటు జనసేన పార్టీలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి.

సర్వేలో బహిర్గతమైన ఓటమి

చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో ఆయనపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక సర్వే కూడా నిర్వహించుకున్నట్లు సమాచారం. ఆ సర్వేలో చంద్రబాబు ఓటమి అంచున ఉన్నారని స్పష్టమవడంతో మరో స్థానం నుంచి పోటీ చేయాలని ఆయన నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే చంద్రబాబు ఇటీవల మూడు రోజుల పాటు కుప్పంలో పర్యటించి మరోసారి అమలు చేయలేని హామీలు కురిపించారు. కుప్పంలో విమానాశ్రయం నిర్మించి అమెరికాకు కూరగాయలు అమ్మిస్తానని మోసపూరిత ప్రకటనలు చేశారు. చంద్రబాబు చేసిన ప్రకటనతో కుప్పం వాసులు ఇలాంటి వ్యక్తినా తాము ఇన్నేళ్ల నుంచి గెలిపిస్తూ వచ్చింది? అని నోరెళ్లబెట్టారు. ఇన్నేళ్లు చంద్రబాబుని గెలిపిస్తున్నా కనీసం స్థానికంగా సొంత ఇల్లు కూడా లేదనే విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో శాంతిపురం మండలంలో హడావుడిగా ఇంటి నిర్మాణానికి పూనుకున్నారు.

మాజీ మంత్రికి ఓటమి భయం

పలమనేరు టీడీపీ నేత చంద్రబోస్ వైఎస్సార్‌సీపీలో చేరిపోవటంతో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డికి మరోసారి ఓటమి భయం పట్టుకుంది. గతంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గెలిచి, టీడీపీ అధికారంలోకి వచ్చిందని తిరిగి పచ్చకండువా కప్పుకున్నందుకు 2019తో అమర్‌కు స్థానికులు గుణపాఠం చెప్పారు. చంద్రబాబుతో పాటు అమర్‌నాథ్‌రెడ్డిని వెన్నుపోటు వెంటాడుతోంది. పూతలపట్టు అభ్యర్థి మురళీమోహన్‌పై స్థానిక నేతలు గుర్రుగా ఉన్నారు. మరో వ్యక్తికి టికెట్ ఇప్పించేందుకు స్థానిక టీడీపీ నేతలు అమరావతి చుట్టూ తిరుగుతున్నారు. పొత్తులో భాగంగా జిల్లా కేంద్రాలైన చిత్తూరు, తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌పై జనసేన ఆశలు పెట్టుకుంది. అయితే ఆ రెండు చోట్లా తన అభ్యర్థులనే బరిలోకి దింపాలని చంద్రబాబు ప్రణాళిక రచించారు. అందులో భాగంగా చంద్రబాబు తన పార్టీకి చెందిన టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ డీకే ఆదికేశవులు నాయుడు మనుమరాలు చైతన్యను రంగంలోకి తీసుకొచ్చారు. జనసేన తరుపున చిత్తూరు లేదా శ్రీకాళహస్తి టికెట్ ఇప్పించేందుకు బాబు స్కెచ్ వేశారని ప్రచారం జరుగుతోంది.

అభ్యర్థుల కోసం అన్వేషణ

గంగాధర నెల్లూరు స్థానానికి అసలు టీడీపీ నుంచి అభ్యర్థే లేరు. సరైన నాయకుడు దొరక్కపోవటంతో సీటు కోసం చాలా మంది పోటీపడుతున్నారంటూ ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. పుంగనూరులో మరొకసారి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విజయం ఖాయం అని తెలిసినా పరువు కాపాడుకునేందుకు చంద్రబాబు ఎత్తులు వేస్తున్నారు. అక్కడ చల్లా రామచంద్రారెడ్డి సరైన అభ్యర్థి కాదనే నిర్ణయానికి వచ్చారు. సోషల్ మీడియా ప్రతినిధులకు ప్యాకేజీ ఇచ్చి ప్రచారం చేసుకుంటూ హడావుడి చేస్తున్న రామచంద్రయాదవ్‌ని జనసేన నుంచి అభ్యర్థిగా బరిలోకి దింపాలని చూస్తున్నారు. చంద్రగిరిలో ఈ సారి కూడా ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఢీకొట్టటం సాధ్యం కాదని, సొంత సర్వేల్లో కూడా టీడీపీకి ఓటమి ఖాయమని తేలిపోయింది. దీంతో ప్రస్తుతం అభ్యర్థిగా ప్రకటించుకుంటున్న పులివర్తి నానిని పక్కన పెట్టాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ పథకంలో భాగంగానే ఇద్దరు వ్యక్తుల పేర్లను చంద్రబాబు తెరపైకి తీసుకొచ్చారు. ఈ విషయంపైనా పులివర్తి నాని వర్గీయులు చంద్రబాబు తీరుపై భగ్గుమంటున్నారు.

తిరుపతిలో పలాయనమే..

తిరుపతిలో జనసేన అభ్యర్థిని పోటీలోకి దించడం చంద్రబాబుకు ససేమిరా ఇష్టం లేదు. అందుకే మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు జనసేన కండువా కప్పించాలని నిర్ణయానికి వచ్చారు. జనసేన అభ్యర్థిగా తన పార్టీ నాయకురాలు సుగుణమ్మను బరిలోకి దించనున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న జనసేన సైనికులు చంద్రబాబు కుట్రలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదటి నుంచి జెండా మోస్తున్న తమకు కేటాయించకుండా పథకం ప్రకారం టీడీపీ వారినే జనసేన అభ్యర్థులుగా దింపటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు చెప్పిన దానికి పవన్ తలూపటంపైనా జనసైనికులు మండిపడుతున్నారు.

పచ్చకండువా కప్పుకున్న నాయకులకు గింగిరాలే..

వెంకటగిరిలో వైఎస్సార్‌సీపీ గుర్తుతో గెలుపొంది ప్యాకేజీ కోసం పచ్చకండువా కప్పుకున్న ఆనం రాంనారాయణరెడ్డిపై స్థానికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఆనంకి టికెట్ ఇస్తే ఓటమి తప్పదని చంద్రబాబు భయపడుతున్నారు. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డిపై నమ్మకం లేకపోవటంతో ఎస్సీవీ నాయుడు లేదా మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గురవయ్య నాయుడు కుమారుడు లేదా ఆయన కోడల్ని రంగంలోకి దింపాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సత్యవేడులో టీడీపీ ఓటమి ఖాయం కావటంతో డాక్టర్ హెలెన్, జేడీ రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఆదిత్య మధ్య పోటీ రాజేశారు. ఒకరికి తెలియకుండా ఒకరితో మాట్లాడుతూ వారి మధ్య విభేదాలు సృష్టించారు. సీటు కోసం పోటీపడుతున్నట్లు డిమాండ్ సృష్టించారు. సూళ్లూరుపేట నుంచి గతంలో పోటీ చేసిన అభ్యర్థులు ఈ సారి బరిలో దిగేందుకు సుముఖంగా లేరు. చెన్నైలో స్థిరపడిన ఓ వైద్యుడిని పోటీ చేయాలని అభ్యర్థించినట్లు తెలిసింది. ఆయన అంగీకరించడంతో ముందుగా రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఆయన ఆలోచనలో పడ్డారు. గూడూరులో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ పేరు వినిపిస్తున్నా, ఆయన గతంలో వైఎస్సార్‌సీపీ గుర్తుతో గెలుపొంది ప్యాకేజీ కోసం పచ్చ కండువా కప్పుకున్నారు. సునీల్‌ని బరిలోకి దింపాలా? లేదా జనసేనలో చురుగ్గా ఉన్న తీగల చంద్రశేఖర్‌ని పోటీకి దింపాలా? అనే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మొత్తంగా చూస్తే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీకి ఓటమి ఛాయలు స్పష్టంగా కనిపిస్తుండటంతో చంద్రబాబు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా...

'మద్దిపాటి' మాకొద్దు

- నేడు చంద్రబాబును కలవనున్న గోదావరి జిల్లాల టీడీపీ నేతలు

ద్వారకాతిరుమల: గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు మాకొద్దు.. ఆయనకు తప్ప ఎమ్మెల్యే టికెట్ ఇంకెవరికిచ్చినా మాకు అభ్యంతరం లేదు.. అంటూ ఆ పార్టీ ముఖ్య నేతలు ముక్తకంఠంతో చెబుతున్నారు. ఈ విషయాన్ని చాలాసార్లు టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో, ఈసారి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పార్టీ నేతలు తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా చంద్రబాబును కలిసి తాడోపేడో తేల్చుకునేందుకు వారు శుక్రవారం దాదాపు 400కు పైగా కార్లలో మంగళగిరికి తరలివెళ్లనున్నారు. గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును పక్కన బెట్టి, మద్దిపాటి వెంకట్రాజును నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా నియమించినప్పటి నుంచి గోపాలపురం టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరింది. సీనియర్ నాయకులను పక్కనపెట్టిన మద్దిపాటి తనకు నచ్చినవారిని వెంటబెట్టుకుని తిరుగుతూ, గ్రూపు రాజకీయాలు చేస్తున్నాడన్న విమర్శలు ఉన్నాయి. వీటిని పట్టించుకోని చంద్రబాబు, లోకేశ్ లు మద్దిపాటే ఎమ్మెల్యే అభ్యర్థి అని ఇప్పటికే పలుసార్లు పార్టీ నేతలకు సూత్రప్రాయంగా చెప్పారు. కానీ మద్దిపాటికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడానికి వీల్లేదని ఆ పార్టీ నేత, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఆయన వర్గీయులు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. మద్దిపాటి మాకొద్దు అన్న నినాదంతోనే వారు ముందుకెళ్తున్నారు. ఈ నెల 27న నల్లజర్లలో టీడీపీ 'రా.. కదలిరా..' సభను నిర్వహించనున్నారు. ఆ సమయంలో గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా మద్దిపాటి పేరును చంద్రబాబు ప్రకటించే అవకాశం ఉందని బాపిరాజు వర్గీయులు భావిస్తున్నారు. అందుకే తమ తుది నిర్ణయాన్ని ముందే చంద్రబాబుకు చెప్పాలన్న ఉద్దేశంతో నేతలు మంగళగిరికి వెళ్లాలని నిర్ణయించారు. రెండు జిల్లాల నేతలు, కార్యకర్తలు ముందుగా కలపర్రు టోల్‌గేటు వద్దకు చేరుకుని, అక్కడి నుంచి భారీ ర్యాలీగా మంగళగిరికి తరలి వెళ్లనున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో బలపడండి

- ఏపీ నేతలకు కాంగ్రెస్ అధిష్టానం సూచన

సాక్షి, న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా రాష్ట్ర నాయకత్వం సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నేతలకు హైకమాండ్ మార్గనిర్దేశం చేసింది. రాష్ట్రంలో సానుకూల వాతావరణం లేనప్పటికీ, పూర్వ వైభవం వచ్చేలా పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది. 2024లో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలతో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ భేటీ అయ్యారు. ఏపీ నుంచి తులసిరెడ్డి, నజీర్ అహ్మద్, గురునాథం, ధనేకుల మురళి సహా 20మంది నేతలు హాజరయ్యారు. బూత్ కమిటీల బలోపేతం, వార్‌రూం, ఓటర్ మ్యాపింగ్, వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పథకాలు తదితర అంశాలపై చర్చించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు షర్మిలకు ఇవ్వొద్దు

- మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: తెలంగాణ బిడ్డనని చెప్పుకుంటున్న షర్మిలకు ఏపీ కాంగ్రెస్ పగ్గాలు ఇవ్వొద్దని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ వంటివి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ బిడ్డనని చెప్పుకుంటున్న షర్మిలకు ఏపీలో నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే అవన్నీ ప్రజలు నమ్మబోరని, పార్టీ నాశనం అవుతుందన్నారు. వచ్చే నెల 8న రాజమహేంద్రవరం సమీపాన బొమ్మూరు వద్ద నిర్వహిస్తున్న దళిత సింహగర్జన సభకు దళితులు లక్షలాదిగా తరలిరావాలని కోరారు. రాష్ట్ర దళిత నాయకులతో బొమ్మూరు సభా వేదిక వద్ద శుక్రవారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తాను అమలాపురం నుంచే ఎంపీగా పోటీ చేస్తానని తెలిపారు.

భీమిలి జనసేనలో తిరుగుబాటు

తగరపువలస: భీమిలి జనసేనలో సీనియర్ నాయకుడు రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన గుడివాడ కిరణ్ ఆ పార్టీ ఇంచార్జ్ పంచకర్ల సందీప్‌పై గురువారం తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు. పదేళ్లగా పార్టీకి సేవ చేసిన తనకు భీమిలి మండల పార్టీ అధ్యక్ష పదవి ఇస్తామని మాట ఇచ్చి ఇటీవల పార్టీలో చేరిన సందీప్ సామాజిక వర్గానికి చెందిన కాపు వ్యక్తికి అమ్ముకున్నారని ఆరోపిస్తూ సోషల్ మీడియా ద్వారా కిరణ్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవలే పార్టీలో చేరిన వారికి రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు అప్పగించడంపై నిరసన వ్యక్తం చేశారు. సందీప్‌కు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని తన లాంటి జన సైనికులను నమ్మించి పార్టీకి పనిచేయించుకుని గాలికి వదిలేసినట్టు ఆరోపించాడు. మండలంలోని 16 పంచాయతీలలోని జన సైనికులను కలుపుకుని జనసేన అధినేత పవన్‌ను కలిసి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు.

మహిళల మద్దతుతో మళ్లీ అధికారంలోకి వైఎస్సార్‌సీపీ

- ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం
- మహిళా సమగ్రాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట
- పార్టీ మహిళా విభాగం సమావేశంలో విజయసాయిరెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీకి రాష్ట్ర వ్యాప్తంగా మహిళల పూర్తి మద్దతు ఉందని, వారి సహకారంతోనే త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకొస్తుందని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. తాడేపల్లిలో గురువారం పార్టీ మహిళా విభాగ అధ్యక్షులు పోతుల సునీత, వరుదు కళ్యాణిల అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో మహిళా సాధికారత అమలు చేసినట్టు తెలిపారు. కులమతాలకతీతంగా మహిళా సాధికారతకు సీఎం జగన్ చిత్తశుద్ధితో కృషి చేశారని చెప్పారు. మహిళలనుద్దేశించి రూపొందించిన అన్ని పథకాలూ మహిళలను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకేనన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని, దేశ, రాష్ట్ర స్థూల ఉత్పత్తి అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాలన్నదనే సీఎం జగన్ ఉద్దేశమన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందిందని, జనాభాలో 50 శాతం మహిళలు ఉన్నప్పుడు వారికి ఆ మేరకు రిజర్వేషన్ ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసిన విషయాన్ని విజయసాయిరెడ్డి గుర్తు చేశారు. సీఎం జగన్ ప్రధానిని కలిసిన ప్రతిసారీ మహిళా సాధికారత, రిజర్వేషన్ల గురించి ప్రస్తావించడంతో కల సాకారమైందన్నారు. డీబీటీ ద్వారా 3,43,02,005 మహిళా లబ్ధిదారులు రూ.95,867 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 30,76,018 మందికి రూ.75,670 కోట్ల ఆర్థిక సహకారాన్ని సీఎం జగన్ అందించారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం, ఆరోగ్యం, విద్య, వైద్యం, రక్షణ కోసం వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. నవరత్నాల కింద 2023 బడ్జెట్‌లో మొత్తం రూ.27,697 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద 30 లక్షల మంది లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, జగనన్న బడుగు వికాసం తదితర పథకాల ద్వారా మహిళలకు అనేక విధాలుగా తోడ్పాటునందిస్తున్నట్టు తెలిపారు. వీటన్నింటిని ప్రతి ఇంటా ప్రతి మహిళకు వివరించాలని, ఇందుకోసం వచ్చే ఎన్నికల్లో మహిళలంతా సీఎం జగన్ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీతోనే కాపులకు న్యాయం

వైఎస్సార్‌సీపీ కాపు నేస్తం పథకం కింద ఏడాదికి రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో రూ.75 వేల చొప్పున.. మొత్తం 3,57,844 మంది మహిళల ఖాతాల్లో రూ.2,028.77 కోట్లు జమ చేసినట్టు తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వంలో కాపులకు ఏం చేశారో చెప్పలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ హౌసింగ్ స్కీం కింద 3076018 మహిళలకు ఇళ్ల పట్టాలు అందించారని, అలాగే వైఎస్సార్ పెన్షన్ కానుక కింద 4,17,70,406 మంది మహిళా లబ్ధిదారులకు పింఛన్ అందించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల్లో, కార్పొరేషన్లు, స్థానిక సంస్థల్లో 55.1 శాతం మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినట్టు తెలిపారు. రాష్ట్రంలో దిశ చట్టాన్ని అమలు చేయడంతో గతంలో కంటే మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. మహిళలపై నేరాలు 2019లో 67.09 శాతం ఉండగా, 2020లో 65 శాతానికి తగ్గాయన్నారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎన్ ఎఫ్ హెచ్ఎస్) డేటా ప్రకారం రాష్ట్రంలో మహిళలపై లింగ వివక్ష, హింస 43.04 శాతం నుంచి 30 శాతానికి తగ్గినట్లు విజయసాయిరెడ్డి వివరించారు. ఎమ్మెల్సీలు పోతుల సునీత, వరుదు కళ్యాణిలు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో మహిళలు సురక్షితంగా, గౌరవంగా జీవిస్తున్నారని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మహిళా సాధికారతలో ఏపీ దేశంలోనే ముందుందని వివరించారు.

చింతమనేనికి టీడీపీ, జనసేన నేతల షాక్



ప్రజా వ్యతిరేకి చింతమనేని అంటూ దెందులూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఒకటి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో తనకు ఎదురే లేదంటూ విర్రవీగే మాజీ ఎమ్మెల్యే చింతమనేనికి టీడీపీలోని సీనియర్ నాయకులు, జనసేన నాయకులు ఊహించని షాక్ ఇచ్చారు. 'ప్రజా వ్యతిరేకి చింతమనేని వద్దు–ఎవరైనా ముద్దు' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశం ఏలూరులోని స్వాగత్ రెసిడెన్సీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు రాయన భాస్కరరావు, ఆలపాటి అమరేంద్రనాథ్ దత్తు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కె.విద్యాసాగర్, జనసేన నాయకుడు కొఠారి ఆదిశేషు మాట్లాడారు. అధిష్టానం నిర్ణయం మేరకు అభ్యర్థిగా ఎవరిని నిలబెట్టినా వారి గెలుపు కోసం కృషి చేస్తామని చెబుతూనే.. నియోజకవర్గంలో ఇరు పార్టీల నుంచి క్లీన్ ఇమేజ్ ఉన్న కొత్త అభ్యర్థిని నిలబెట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేనలకు చెందిన ఎవరికి టిక్కెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. తాము టీడీపీ ఏర్పడిన నాటి నుంచి పార్టీలో ఉన్న సీనియర్ నాయకులమని, చింతమనేని వ్యవహార శైలిపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను పలుమార్లు ఆయన దృష్టికి తీసుకెళ్లినా చింతమనేని ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని చెప్పారు. ప్రతి ఒక్కరినీ బూతులు తిడుతూ, పార్టీ ప్రతిష్టను దిగజార్చుతుండటం తమను బాధిస్తోందని తెలిపారు. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న చింతమనేని ప్రభాకర్‌ను పక్కనపెట్టి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. 2019లో ఓటమి పాలైనా చింతమనేని తీరులో మార్పు రాలేదు.. దీంతో వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కాగా, ఇరు పార్టీల ముఖ్యనేతలంతా వెళ్లి అధిష్టానం వద్ద చింతమనేని అభ్యర్థిత్వంపై తమ వ్యతిరేకత తెలియజేయాలని సమావేశంలో నిర్ణయించారు.


వరదరాజులరెడ్డి


ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


రమేష్ కుమార్‌రెడ్డి


ద్వారకనాథరెడ్డి


రాంప్రసాద్‌రెడ్డి

'వరద'కు సీటు గోవిందా!

- ప్రొద్దుటూరులో ప్రవీణ్‌కు లోకేశ్ అభయం.. రాయచోటిలో రమేష్‌రెడ్డి ఆశలపై నీళ్లు
- తారకరత్న కుటుంబం కోసం ద్వారకనాథరెడ్డి వైపు మొగ్గు

సాక్షి ప్రతినిధి, కడప: అవసరానికి వాడుకుని ఆ తరువాత వదిలేయడం తెలుగుదేశం పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. ఉమ్మడి కడప జిల్లాలో ఆ విద్యతో గారడీలు మొదలెట్టేశారు పార్టీ అధినేత చంద్రబాబు. డబ్బు, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతికే పెద్దపీట వేస్తున్నారు. ఇందుకు ప్రొద్దుటూరు, రాయచోటి నియోజకవర్గాలు తాజా ఉదాహరణలు. ప్రొద్దుటూరులో ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన నంద్యాల వరదరాజులురెడ్డి 2019 తర్వాత క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే చంద్రబాబు హామీతో వయస్సు పైబడినా చివరి అవకాశంగా ప్రజాతీర్పు కోరేందుకు సన్నద్ధమయ్యారు. మరోవైపు పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి వరదరాజులును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినా టికెట్ తనకే వస్తుందనే ధీమాతో చురుగ్గా రాజకీయాల్లో పాల్గొంటున్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధినేత స్వరంలో మార్పు వచ్చింది. నియోజకవర్గ ప్రస్తుత ఇన్‌చార్జి గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి అభయం ఇచ్చినట్లు తెలుస్తోంది. వరదరాజులరెడ్డికి మొండిచేయి ఖాయంగా కనిపిస్తోంది.

బాలయ్య బంధుప్రీతి కోసం

రాయచోటి టికెట్ తనకే దక్కుతుందనే ధీమాతో ఉన్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి ఆశలు వదులుకునే సూచనలు కనిపిస్తున్నాయి. మరో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి నందమూరి బాలకృష్ణ హామీ ఇవ్వడమే కారణంగా చెబుతున్నారు. ఇటీవలే ద్వారక టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. లోకేశ్ పాదయాత్ర ప్రారంభం రోజున గుండెపోటుకు ఆ తర్వాత మరణించిన సినీ నటుడు నందమూరి తారకరత్న భార్య అలేఖ్యారెడ్డి ద్వారకనాథరెడ్డికి మేనకోడలు. ఆమె పట్ల బాలకృష్ణకు సానుభూతి ఉంది. ఈ కారణంగానే రాయచోటి టికెట్‌పై గ్యారంటీ లభించినట్లు సన్నిహితులతో ద్వారకా చెబుతున్నారు. మరోవైపు రాయచోటి టికెట్ రేసులో రమేష్‌రెడ్డితో పాటు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలున్నారు. రాంప్రసాద్‌రెడ్డి అభ్యర్థిత్వం కోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి విశేషంగా యత్నించి, అభయం దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో రమేష్‌రెడ్డి భవితవ్యం అగమ్యగోచరంగా మారింది.

చినబాబు ప్రమేయం

తన ప్రొద్దుటూరు పాదయాత్రకు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అతని సన్నిహితుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి 'ఆర్థిక' అండదండలు అందించడంతో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి చినబాబు నారా లోకేశ్ అభయం ఇచ్చేశారు. ఆయనే అభ్యర్థని టీడీపీ శ్రేణులకు అప్పట్లోనే సంకేతాలిచ్చేశారు. దీంతో ప్రవీణ్ పార్టీలో వేగం పెంచారు. మరోవైపు చంద్రబాబుపై నమ్మకంతో వరదరాజులు రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తాజాగా ప్రొద్దుటూరు టీడీపీ టికెట్ విషయంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి స్పష్టమైన హామీ లభించినట్లు విశ్వసనీయ సమాచారం.

డబ్బుకు బాబు దాసోహం!



ధనవంతులకోసం టీడీపీ అధినేత చంద్రబాబు వేట

- కళ్యాణదుర్గంలో అతిపెద్ద కాంట్రాక్టర్‌ను బరిలోకి దింపే యోచన
- గుంతకల్లులో డబ్బున్న ఓ సీఐ స్థాయి పోలీస్ అధికారి
- రాప్తాడులో రియల్ ఎస్టేట్ వ్యాపారి పేరు హల్చల్
- ఎన్నో ఏళ్లుగా జెండా మోసేవారికి రిక్తహస్తం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొత్త క్యాండిడేట్ల కోసం టీడీపీ వెదుకులాట ప్రారంభించింది. ఓట్లను డబ్బుతోనైనా కొని గెలవాలని నిర్ణయించుకుని దండిగా డబ్బున్నవారికోసం వలవేస్తోంది. కాంట్రాక్టర్లు, రియల్టర్లు వంటి వారిని బరిలోకి దింపాలని చూస్తోంది. అనంతపురం జిల్లాలో కొత్త అభ్యర్థులను తీసుకొచ్చేందుకు కొందరు సీనియర్ నాయకులను రంగంలోకి దింపింది. ప్రస్తుతం నెలకొన్న ఈ పరిస్థితులు సామాన్య కార్యకర్తలకు, నాయకులకు శరాఘాతంగా మారాయి. గతంలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో సీఎం రమేష్, సుజనా చౌదరి, కనకమేడల, టీజీ వెంకటేష్ వంటి బడావ్యాపారులకు సీట్లిచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే వ్యూహం అనుసరించబోతున్నట్టు తాజా పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. తాజాగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో బడా కాంట్రాక్టర్‌ను దించాలని యోచిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా అక్కడ పార్టీకి పని చేస్తున్న వారిని ఈసారి పక్కన పెట్టొచ్చని విశ్వసనీయంగా తెలిసింది. గుంతకల్లు నియోజకవర్గంలో ఇప్పటివరకూ పనిచేసిన అభ్యర్థులను కాదని, ఒక సీఐ స్థాయి పోలీసు అధికారిని నిలిపేందుకు పావులు కదుపుతున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో రెండుసార్లు పరిటాల సునీత పోటీ చేశారు. ఇప్పుడు బాగా డబ్బున్న ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిని తెరమీదకు వచ్చారు. ఈయన పేరు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఈయనకు టికెటిస్తే రూ.50 కోట్లయినా ఖర్చు చేయగలరని చంద్రబాబు విశ్వసిస్తున్నట్టు సమాచారం. ఈసారి రాయదుర్గం టికెట్ కాల్వ శ్రీనివాసులుకు ఇవ్వకుండా దీపక్‌రెడ్డికి ఇచ్చే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది.

అగ్రకులాల చేతిలో రిజర్వుడు స్థానాలు

మడకశిర, శింగనమల రిజర్వుడు స్థానాల్లో అభ్యర్థుల ఖరారు మొత్తం ఆర్థిక బలమున్న అగ్రకులాల చేతుల్లోకి వెళ్లింది. పార్టీకి పనిచేసిన వాళ్లకు కాకుండా డబ్బున్న వాళ్లు ఎవరికి చెబితే వారికే దక్కే అవకాశం ఉంది. అందుకే ఇప్పటివరకూ శింగనమలకు బండారు శ్రావణి, మడకశిరకు ఈరన్న పేర్లను ఖరారు చేయకుండా నాన్పుతున్నారు. రూ.10 కోట్లయినా ఖర్చు చేయగలిగే వాళ్లకే ఇక్కడ టికెట్లు ఇవ్వాలనేది బాబు యోచన. మిగిలిన స్థానాల్లోనూ ఆర్థిక బలమున్న అభ్యర్థులనే ఎంపిక చేయాలని కసరత్తు చేస్తున్నారు.

హనుమాన్‌జంక్షన్‌లో జనసేన బాహాబాహీ


ఘర్షణ పడుతున్న జనసేనలోని రెండు వర్గాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): కృష్ణాజిల్లా బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌లో జనసేన నాయకులు గురువారం బాహాబాహీకి దిగారు. జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, ఆ పార్టీ నాయకుడు గరికపాటి శివశంకర్ వర్గీయులు.. తేల్చుకుందాం.. అంటూ సవాళ్లు, ప్రతి సవాళ్లతో పోలీసుల సమక్షంలోనే ఘర్షణకు దిగారు. స్థానిక ఇందిరానగర్‌లో ఇరు గుపారుగు మధ్య ఏర్పడిన ఇళ్లస్థలం సరిహద్దు వివాదం చినికిచినికి గాలివానగా మారింది. స్థలవివాదంపై గురువారం పంచాయితీ చేసేందుకు వెళ్లిన జనసేన నాయకుడు చలమలశెట్టి రమేష్‌బాబుకు, అక్కడే ఉన్న మరో నాయకుడు గరికపాటి శివశంకర్ మధ్య వాగ్వాదం జరిగింది. వీరిద్దరి మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు ఈ వివాదంతో ఒక్కసారిగా భగ్గుమంది. రెండువర్గాలు ప్రధాన కూడలిలో మోహరించటంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్‌నరసింహమూర్తి, ఎస్ఐలు ఎ.డి.ఎల్.జనార్దన్, తిరుమలరావు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల సమక్షంలోనే ఇరువర్గాలు కర్రలు, ఇనుపరాడ్లతో దాడులకు తెగబడ్డారు. పోలీసులు వారినుంచి కర్రలు, ఇనుపరాడ్లు లాక్కుని అక్కడ మోహరించిన యువకులను చెదరగొట్టారు. అదే సమయంలో స్థానిక ప్రముఖుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావు వచ్చి ఇరువర్గాలకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఆర్‌పీసీ సెక్షన్ 107 కింద చలమలశెట్టి రమేష్‌బాబు, గరికపాటి శివశంకర్‌తో పాటు ఇరువర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేశారని, ఆర్డీవో కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.

ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా సుధీర్‌రెడ్డి



నెల్లూరు (దర్గామిట్ట): ఏపీ డెయిరీ డెవలప్ మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా చిల్లకూరు సుధీర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. సర్వేపల్లి నియోజకవర్గం పొట్లపూడికి చెందిన విజయా డెయిరీ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ విధేయుడిగా ఉండటంతో సీఎం వైఎస్ జగన్ ఆయన సేవలను గుర్తించారు. వైఎస్ జగన్ చేపట్టిన ఓదార్పు యాత్ర నుంచి వైఎస్సార్ కుటుంబానికి విధేయుడిగా ఉన్న నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించి పదవి వరించింది. సీఎం జగన్, మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి సుధీర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అజయ్‌కుమార్‌రెడ్డిని సత్కరించిన శాప్ ఎండీ



సాక్షి, అమరావతి : అర్జున అవార్డు విజేత భారతీయ అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఐ.అజయ్‌కుమార్‌రెడ్డిని శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర అభినందించారు. గురువారం శాప్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు. పల్నాడు ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్‌రెడ్డి 2017, 2018, 2022 అంధుల టీ–20 ప్రపంచ కప్‌ను సాధించిన అంధుల జట్టుకు సారథ్యం వహించారు. ఇటీవల బర్మింగ్‌హామ్‌లో జరిగిన ఐబీఎస్ఏ వరల్డ్ గేమ్స్‌లో జట్టుకు రజత పతకాన్ని అందించారు. వివిధ ఫార్మాట్లలో 90 మ్యాచ్‌ల్లో 15 శతకాలు, 36 అర్ధశతకాలు సాధించడంతో పాటు 258 వికెట్లు పడగొట్టారు.

‘కిసాన్ డ్రోన్స్’ వచ్చేశాయ్

తొలి దశలో రాష్ట్రానికి 160 ‘ఇఫ్కో’ కిసాన్ డ్రోన్ యూనిట్లు

- ఇప్పటికే చేరుకున్న 70 డ్రోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు
- నానో ఎరువుల వినియోగం పెంచడమే లక్ష్యం



పంపిణీకి సిద్ధం చేసిన ఎలక్ట్రిక్ వెహికల్‌తో కూడిన ఇఫ్కో కిసాన్ డ్రోన్

సాక్షి, అమరావతి: సాగులో కూలీల వెతలకు చెక్ పెట్టడమే కాకుండా తగిన మోతాదులో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడం ద్వారా సాగు ఖర్చుల్ని తగ్గించే ప్రధాన లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఆర్బీకే స్థాయిలో డ్రోన్స్ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఆర్బీకే స్థాయిలోని సీహెచ్‌సీల్లో రైతులు, నిరుద్యోగ యువతకు ఉచితంగా డ్రోన్ పైలట్ శిక్షణ కూడా ఇస్తోంది. ఏపీ బాటలోనే ఇఫ్కో కిసాన్ డ్రోన్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. తొలి దశలో దేశవ్యాప్తంగా 2,500 డ్రోన్స్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని ఇఫ్కో సంకల్పించింది. ఆంధ్రప్రదేశ్‌కు 160 డ్రోన్స్ ఇవ్వాలని నిర్ణయించగా.. ఇప్పటికే 70 డ్రోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలను అందించింది. మార్చి నెలాఖరు నాటికి మిగిలిన యూనిట్లను కూడా విడుదల చేయనుంది.

మహిళలకు ఉచిత శిక్షణ

ఏపీకి కేటాయించిన ఇఫ్కో కిసాన్ డ్రోన్స్‌ను నిరుద్యోగ యువతకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయిస్తారు. వీటిని పొందగోరే అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. గ్రామీణ యువతకు ప్రాధాన్యత ఉంటుంది. అభ్యర్థుల వయసు 18–50 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన అభ్యర్థులకు 15 రోజుల పాటు చెన్నైలోని దక్ష, మైసూర్‌లోని జనరల్ ఏరోనాటిక్స్ సంస్థల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ కోసం రూ.50 వేలు ఖర్చవుతుండగా.. రూ.15 వేలు అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.35 వేలు ఇఫ్కో భరిస్తుంది. అదే పొదుపు సంఘాల మహిళలకైతే శిక్షణ ఉచితంగానే అందిస్తుంది. శిక్షణ పూర్తికాగానే డ్రోన్ పైలట్ లైసెన్స్ జారీ చేస్తారు. లైసెన్స్ పొందిన అభ్యర్థులకు రూ.15 లక్షల విలువైన డ్రోన్‌తో కూడిన ఎలక్ట్రిక్ ఆటోలను అందిస్తారు. యూనిట్ అంచనా వ్యయంలో రూ.లక్ష సెక్యూరిటీ డిపాజిట్‌గా అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుంది. ఎలక్ట్రిక్ వెహికల్‌పై 2 రోజుల పాటు ఆన్‌ఫీల్డ్ ట్రైనింగ్ కోసం అభ్యర్థులు మరో రూ.16 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

20 వేల ఎకరాల్లో పిచికారీ చేస్తే ఓనర్‌షిప్

డ్రోన్ పొందిన అభ్యర్థులు కనీసం 20వేల ఎకరాల్లో పిచికారీ చేయడం గానీ.. ఐదేళ్ల పాటు నిర్వహించిన తర్వాత గానీ డ్రోన్, ఎలక్ట్రిక్ వాహనం ఓనర్ షిప్‌ను అభ్యర్థుల పేరిట బదిలీ అవుతుంది. ఎంపికైన అభ్యర్థులు ఈ మేరకుఇఫ్కోతో ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఇఫ్కో ద్వారా 60 మందికి శిక్షణ ఇచ్చారు. వీరిలో 10 మంది స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు కూడా ఉన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి 70 డ్రోన్స్‌తో కూడిన ఎలక్ట్రికల్ వెహికల్స్ చేరుకున్నాయి. మార్చి నాటికి మిగిలిన వారికి సమకూర్చేందుకు ఇఫ్కో సన్నాహాలు చేస్తోంది.

సూక్ష్మ ఎరువుల వినియోగం పెంచడమే లక్ష్యం



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించాలన్న సంకల్పంతోనే ఇఫ్కో కిసాన్ డ్రోన్స్‌ను అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చిన నానో యూరియా, డీఏపీ ఎరువులకు రైతుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. వాటి వినియోగం పెరగాలంటే డ్రోన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నాం. భవిష్యత్‌లో డిమాండ్‌ను బట్టి మరింత మందికి శిక్షణ ఇవ్వడంతో పాటు డ్రోన్స్ అందుబాటులోకి తీసుకొస్తాం.

– టి.శ్రీధర్‌రెడ్డి, ఏపీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్, ఇఫ్కో

జగన్‌తోనే సామాజిక వికాసం

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారం
- చంద్రబాబు హామీలు మాటలకే పరిమితం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తలు టి.ఎన్.దీపిక, కె.శాంతమ్మలను దీవించాలని కోరుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

హిందూపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక వికాసం సాధ్యమని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఆయన గురువారం వైఎస్సార్‌సీపీ హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తలు టి.ఎస్.దీపిక, బోయ శాంతమ్మలతో కలిసి లేపాక్షి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాటలు చెప్పి తప్పించుకునే నేత అని, వైఎస్ జగన్ మాటిచ్చారంటే చేసి చూపిస్తారని చెప్పారు. మహిళలు, బడుగు, బలహీనవర్గాలకు అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో వైఎస్ జగన్ పెద్దపీట వేశారన్నారు. ఈ క్రమంలోనే హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్తగా బోయ సామాజికవర్గానికి చెందిన శాంతమ్మను, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా కురుబ సామాజికవర్గానికి చెందిన టి.ఎస్.దీపికను నియమించారని చెప్పారు. ఇలా మహిళలకు పదవులిచ్చి ప్రజల్లో నిలిపే సత్తా, ధైర్యం చంద్రబాబుకు ఉన్నాయా అని ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధి గురించి మాట్లాడుతున్న చంద్రబాబు.. ఓటుకు కోట్లు కేసుకు భయపడి రాత్రికిరాత్రే హైదరాబాద్‌ను వదలి పారిపోయి వచ్చారని, ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. అమరావతిలో రాజధాని పేరిట రూ.కోట్లు ఖర్చుచేసి లీకు బిల్డింగ్ కట్టి రాష్ట్రాన్ని మరింత అప్పుల పాలుచేసి చేశారని చెప్పారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు చంద్రబాబు ఎన్నిమాటలైనా చెబుతారని, ఇప్పటికే ఈ విషయం ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. అందువల్లే 2019లో చంద్రబాబును జనం పక్కనపెట్టారన్నారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు, ఆయన బావమరిది బాలకృష్ణ వచ్చి ప్రతి ఇంటికీ కేజీ బంగారం ఇస్తాం.. ప్రతి రైతుకు ట్రాక్టర్, డ్రైవర్ జీతం కూడా ఇస్తామంటే ప్రజలు నమ్ముతారా అని అడిగారు. అబద్ధాలు, మోసకారి మాటలకు ఓటు వేయాలా.. చెప్పింది చేతల్లో చేసి చూపించే జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మాలా అని ఆలోచించండని కోరారు.

ఇది రైతుసంక్షేమ ప్రభుత్వం

రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా సకలం అందిస్తున్నారని గుర్తుచేశారు. వ్యవసాయానికి అంతరాయం లేకుండా 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. అందువల్లే రైతుభరోసా కేంద్రాల్లో జరుగుతున్న సహాయ సహకారాలను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ పర్యటనలో ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డప్పరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వైఎస్సార్‌సీపీ నేత కొండూరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఐ ఉత్పత్తులు పెంచడమే లక్ష్యం

అవసరమైన చేయూతనిస్తాం • పద్మశ్రీ డాక్టర్ రజనీకాంత్

సాక్షి, అమరావతి: భౌగోళిక గుర్తింపు కల్గిన ఉత్పత్తులు, ఉత్పత్తిదారుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంబంధిత రంగ నిపుణులు పద్మశ్రీ డాక్టర్ రజనీకాంత్ అభిప్రాయపడ్డారు. విజయవాడలో గురువారం భౌగోళిక గుర్తింపు, ప్రోత్సాహం అంశంపై నాబార్డు ఆధ్వర్యంలో ప్రాంతీయ సలహా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ.. భౌగోళిక గుర్తింపు (జీఐ) ఉత్పత్తులు జాతీయ స్థాయిలో 485 ఉండగా, ఆంధ్రప్రదేశ్ లో 20 మాత్రమే ఉన్నాయన్నారు. వీటి సంఖ్యను పెంచడంతో పాటు ఈ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంలో నాబార్డు చేయూతనిచ్చేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. జీఐ ఉత్పత్తుల మార్కెటింగ్, కొత్త ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ తీసుకువచ్చే అంశంపై ఆయన పలు సూచనలు చేశారు. కొత్త ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ తీసుకురావడంలో అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్ మాట్లాడుతూ.. వ్యవసాయ, ఉద్యాన పంట ఉత్పతులు, చేనేత, హస్తకళల్లో భౌగోళిక గుర్తింపు సాధించగల ఉత్పత్తులు చాలా ఉన్నాయన్నారు. ఇప్పటికే గుర్తింపు కల్గిన ఉత్పత్తుల మార్కెటింగ్ చేసే ఉత్పత్తిదారుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నాబార్డు తగిన చేయూతనిస్తుందన్నారు. కార్యశిబిరంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల సంచాలకులు శామ్యూల్ గ్రీప్, జనరల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాద్, ఉద్యాన శాఖ అదనపు సంచాలకులు ఎం.వెంకటేశ్వర్లు, ఎన్జీ రంగా యూనివర్శిటీ శాస్త్రవేత్త రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ రజనీకాంత్‌ని సత్కరిస్తున్న నాబార్డు సీజీఎం ఎం.ఆర్.గోపాల్

జాబ్ మేళాలో 74 మందికి ఉద్యోగాలు

సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం నిర్వహించిన జాబ్ మేళాలో 74 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 2022, 2023 ఉత్తీర్ణుల కోసం ఈ జాబ్ మేళాను నిర్వహించామన్నారు. ఇందులో 74 మంది విద్యార్థులు సుజ్లాన్ గ్లోబల్‌లో ఉద్యోగాలు పొందారన్నారు. ఎలక్ట్రికల్ నుండి 28, మెకానికల్ ఇంజనీరింగ్ నుండి 46 మంది డిప్లొమా ఇంజనీర్ ట్రైనీ స్థానాలకు ఏడాదికి రూ.2లక్షల ప్యాకేజీ లభిస్తోందన్నారు. ఎంపికైనవారు 8 రాష్ట్రాల్లో పాన్ ఇండియా స్థాయిలో ఆపరేషనల్ మెయింటెనెన్స్ సర్వీసెస్‌లో పని చేస్తారన్నారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకే కాకుండా డిప్లొమా గ్రాడ్యుయేట్లకు కూడా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహించడానికి కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



మరొకటి గెలిస్తే మెయిన్ ‘డ్రా’లోకి...

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించాడు. మెల్‌బోర్న్‌లో గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 139వ ర్యాంకర్ సుమిత్ 6–3, 6–2తో ‘వైల్డ్ కార్డు’ ప్లేయర్ ఎడ్వర్డ్ వింటర్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు. 64 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. 12 విన్నర్స్ కొట్టిన సుమిత్ 11 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్‌వద్దకు 14 సార్లు దూసుకొచ్చి 10 సార్లు పాయింట్లు గెలిచాడు. 118వ ర్యాంకర్ మోల్కన్ (స్లొవేకియా)తో నేడు జరిగే ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో సుమిత్ నెగ్గితే రెండోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో మెయిన్ ‘డ్రా’కు అర్హత సాధిస్తాడు. సుమిత్ 2019, 2020 యూఎస్ ఓపెన్‌లో, 2021 ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ ‘డ్రా’లో పోటీపడ్డాడు.

అమన్ ‘పసిడి పట్టు’



జాగ్రెబ్ (క్రొయేషియా): కొత్త ఏడాదిని భారత రైజింగ్ స్టార్ రెజ్లర్ అమన్ సెహ్రావత్ స్వర్ణ పతకంతో ప్రారంభించాడు. జాగ్రెబ్ ఓపెన్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో అమన్ 57 కేజీల విభాగంలో చాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో అమన్ 4 నిమిషాల 21 సెకన్లలో 10–0తో ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో చైనా రెజ్లర్ జౌ వాన్‌హావోపై గెలుపొందాడు. ప్రత్యర్థిపై 10 పాయింట్ల ఆధిక్యం వచ్చిన వెంటనే రిఫరీ బౌట్‌ను నిలిపివేసి ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో విజేతగా ప్రకటిస్తారు. అమన్ తాను పోటీపడిన నాలుగు బౌట్‌లలోనూ ప్రత్యర్థులను ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలోనే ఓడించడం విశేషం. తొలి రౌండ్‌లో అమన్ 15–4తో కరావుస్ (టర్కియే)పై, క్వార్టర్ ఫైనల్లో 11–0తో రిచర్డ్స్ రోడ్స్ (అమెరికా)పై, సెమీఫైనల్లో 11–0తో రొబెర్టి డాంగాష్విలి (జార్జియా)పై విజయం సాధించాడు.

హసరంగ 7/19



కొలంబో: గాయం నుంచి కోలుకున్నాక శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగ ఘనంగా పునరాగమనం చేశాడు. జింబాబ్వేతో గురువారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో హసరంగ బంతితో మాయ చేశాడు. 5.5 ఓవర్లు వేసిన హసరంగ కేవలం 19 పరుగులిచ్చి ఏకంగా 7 వికెట్లు పడగొట్టాడు. వన్డే క్రికెట్‌లో ఇవి ఐదో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు కావడం విశేషం. వర్షం కారణంగా 27 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే జట్టు హసరంగ ధాటికి 22.5 ఓవర్లలో 96 పరుగులకే ఆలౌటైంది. వన్డే మ్యాచ్‌లో 7 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన 15వ బౌలర్‌గా... చమిందా వాస్ (8/19; జింబాబ్వేపై 2001లో), ముత్తయ్య మురళీధరన్ (7/30; భారత్‌పై 2000లో) తర్వాత ఈ ఘనత సాధించిన మూడో శ్రీలంక బౌలర్‌గా హసరంగ గుర్తింపు పొందాడు. జింబాబ్వే నిర్దేశించిన 97 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక 16.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించి గెలిచింది. ఈ గెలుపుతో శ్రీలంక సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. తొలి వన్డే వర్షంతో రద్దయింది.

కుర్రాళ్లు గెలిపించారు

విరాట్ కోహ్లి ఆడలేదు... రోహిత్ శర్మ విఫలమయ్యాడు... అయినా సరే యువ ఆటగాళ్ల ప్రదర్శనతో భారత్ విజయాన్ని అందుకుంది. అఫ్గానిస్తాన్‌తో పోరులో అక్కడక్కడా కాస్త శ్రమించినా... చివరకు గెలుపు టీమిండియాదే అయింది. ముందుగా అక్షర్ పటేల్ కట్టుదిట్టమైన బౌలింగ్, ఆపై బ్యాటింగ్‌లో శివమ్ దూబే మెరుపులు జట్టును సిరీస్‌లో ఆధిక్యంలో నిలిపాయి. అఫ్గాన్ ఆటగాళ్లు కొంత పోరాడినా... మంచు ప్రభావంతో పాటు ఒత్తిడిలో ఆ జట్టు చిత్తయింది.

- తొలి టి20లో భారత్ విజయం
- 6 వికెట్లతో ఓడిన అఫ్గానిస్తాన్
- శివమ్ దూబే అజేయ అర్ధ సెంచరీ
- ఆదివారం ఇండోర్‌లో రెండో మ్యాచ్



శివమ్ దూబే

మొహాలి: అఫ్గానిస్తాన్‌తో టి20 సిరీస్‌లో భారత్ 1–0తో ముందంజ వేసింది. గురువారం జరిగిన తొలి పోరులో భారత్ 6 వికెట్ల తేడాతో అఫ్గాన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. నబీ (27 బంతుల్లో 42; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం భారత్ 17.3 ఓవర్లలో 4 వికెట్లకు 159 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ శివమ్ దూబే (40 బంతుల్లో 60 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ సాధించగా, జితేశ్ శర్మ (20 బంతుల్లో 31; 5 ఫోర్లు) రాణించాడు.

నబీ మెరుపులు...

అఫ్గాన్‌కు ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (22 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్), గుర్బాజ్ (28 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుగైన ఆరంభం అందించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 48 బంతుల్లో 50 పరుగులు జోడించారు. 1 పరుగు వద్ద ఇబ్రహీమ్ ఇచ్చిన క్యాచ్‌ను దూబే వదిలేయడం కూడా జట్టుకు కలిసొచ్చింది. అయితే ఒకే స్కోరు వద్ద వీరిద్దరిని అవుట్ చేసి భారత్ పైచేయి సాధించింది. తొలి అంతర్జాతీయ టి20 ఆడుతున్న రహ్మత్ షా (3) కూడా విఫలమయ్యాడు. ఈ దశలో నబీ, అజ్మతుల్లా (22 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్) భాగస్వామ్యంతో అఫ్గాన్ కోలుకుంది. ముఖ్యంగా నబీ దూకుడు ప్రదర్శించడంతో స్కోరు వేగంగా దూసుకుపోయింది. రవి బిష్ణోయ్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 16 పరుగులు రాగా... ముకేశ్ వేసిన తర్వాతి ఓవర్లో నబీ 2 సిక్స్‌లు బాదాడు. నబీ, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు 43 బంతుల్లో 68 పరుగులు జత చేయగా... ముకేశ్ ఒకే ఓవర్లో వీరిని పెవిలియన్ పంపించాడు. చివరి 2 ఓవర్లలో అఫ్గాన్ 6 ఫోర్లతో 28 పరుగులు రాబట్టింది.

రోహిత్ డకౌట్...

ఛేదనలో రెండో బంతికే భారత్‌కు అనూహ్య షాక్ తగిలింది. శుబ్‌మన్ గిల్ (12 బంతుల్లో 23; 5 ఫోర్లు)తో సమన్వయ లోపంతో కెప్టెన్ రోహిత్ శర్మ (0) రనౌట్‌గా వెనుదిరిగాడు. మిడాఫ్ దిశగా ఆడిన రోహిత్ సింగిల్ కోసం దూసుకుపోగా, గిల్ ఏమాత్రం స్పందించకుండా తన క్రీజ్‌లోనే ఉండిపోయాడు. దాంతో డకౌట్ అయిన రోహిత్ తన సహచరుడిపై తీవ్ర ఆగ్రహాన్ని ప్రదర్శిస్తూ వెనుదిరిగాడు. ఆ తర్వాత కొన్ని చక్కటి బౌండరీలు కొట్టిన గిల్ అదే జోరులో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. భారీ షాట్లు ఆడటంలో తడబడిన తిలక్ వర్మ (22 బంతుల్లో 26; 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఈ దశలో దూబే, జితేశ్ భాగస్వామ్యం జట్టును గెలుపు దిశగా నడిపించింది. అఫ్గాన్ పేలవ ఫీల్డింగ్ కూడా భారత్‌కు సానుకూలంగా మారింది. జితేశ్ వెనుదిరిగినా... రింకూ సింగ్ (9 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు) సహకారంతో దూబే మరో 15 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించాడు.



స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (స్టంప్డ్) జితేశ్ (బి) అక్షర్ 23; ఇబ్రహీమ్ (సి) రోహిత్ (బి) దూబే 25; అజ్మతుల్లా (బి) ముకేశ్ 29; రహ్మత్ (బి) అక్షర్ 3; నబీ (సి) రింకూ (బి) ముకేశ్ 42; నజీబుల్లా (నాటౌట్) 19; కరీమ్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 158. వికెట్ల పతనం: 1–50, 2–50, 3–57, 4–125, 5–130. బౌలింగ్: అర్‌ష్‌దీప్ 4–1–28–0, ముకేశ్ 4–0–33–2, అక్షర్ 4–0–23–2, సుందర్ 3–0–27–0, దూబే 2–0–9–1, బిష్ణోయ్ 3–0–35–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (రనౌట్) 0; శుబ్‌మన్ గిల్ (స్టంప్డ్) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; తిలక్ (సి) గుల్బదిన్ (బి) అజ్మతుల్లా 26; శివమ్ దూబే (నాటౌట్) 60; జితేశ్ శర్మ (సి) ఇబ్రహీమ్ (బి) ముజీబ్ 31; రింకూ సింగ్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (17.3 ఓవర్లలో 4 వికెట్లకు) 159. వికెట్ల పతనం: 1–0, 2–28, 3–72, 4–117. బౌలింగ్: ఫారుఖీ 3–0–26–0, ముజీబ్ 4–1–21–2, మొహమ్మద్ నబీ 2–0–24–0, నవీన్ 3.3–0–43–0, అజ్మతుల్లా 4–0–33–1, గుల్బదిన్ 1–0–12–0.

ఒలింపిక్ బెర్త్ నంబర్ 16

‘పారిస్’కు భారత్ నుంచి అత్యధిక షూటర్లు అర్హత



టీమ్ విభాగం రజత పతకాలతో సిమ్రన్‌ప్రీత్, ఇషా సింగ్, రిథమ్

జకార్తా: ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో ఈసారి భారత్ నుంచి షూటింగ్ క్రీడాంశంలో అత్యధిక మంది పోటీపడనున్నారు. ఈ ఏడాది జూలై–ఆగస్టులలో పారిస్ వేదికగా ఒలింపిక్స్ జరగనున్నాయి. 2020 టోక్యో ఒలింపిక్స్‌కు భారత్ నుంచి అత్యధికంగా 15 మంది షూటర్లు అర్హత పొందగా... ఈసారి ఆ సంఖ్య 16కు చేరుకుంది. ఇంకా షూటింగ్‌లో మరో మూడు క్వాలిఫయింగ్ టోర్నీలు మిగిలి ఉండటం, మరో ఎనిమిది బెర్త్‌లు ఖాళీగా ఉండటంతో భారత్ నుంచి మరింత మంది షూటర్లు అర్హత సాధించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో గురువారం భారత్‌కు 16వ బెర్త్ ఖరారైంది. మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో రిథమ్ సాంగ్వాన్ కాంస్య పతకం సాధించింది. ఫైనల్లో హరియాణాకు చెందిన 20 ఏళ్ల రిథమ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి భారత్‌కు ఒలింపిక్ బెర్త్‌ను అందించింది. రిథమ్, తెలంగాణ షూటర్ ఇషా సింగ్, సిమ్రన్‌ప్రీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 1743 పాయింట్లతో రజత పతకాన్ని సొంతం చేసుకుంది.

అశ్విని–తనీషా సంచలనం

తొమ్మిదో ర్యాంక్ జోడీపై విజయం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) జోడీ సంచలనం సృష్టించింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 24వ ర్యాంక్ ద్వయం అశ్విని–తనీషా 21–19, 13–21, 21–15తో ప్రపంచ 9వ ర్యాంక్ జంట వకాన నాగహార–మాయు మత్సుమోటో (జపాన్)ను బోల్తా కొట్టించింది. ఈ గెలుపుతో సూపర్–1000 స్థాయి టోర్నీలో అశ్విని–తనీషా ద్వయం తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల డబుల్స్ విభాగంలో ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ 21–11, 21–18తో లుకాస్ కోర్వీ–రొనన్ లాబర్ (ఫ్రాన్స్)లపై గెలిచారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత్ కథ ముగిసింది. ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 13–21, 17–21తో ఓడిపోయాడు.


నేటి నుంచి ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీ


దోహా: ప్రతిష్టాత్మక ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీ శుక్రవారం ఖతర్ రాజధాని దోహాలో మొదలవుతుంది. 24 జట్లు పోటీపడుతున్న ఈ మెగా టోర్నీ ఫిబ్రవరి 10 వరకు జరుగుతుంది. మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ‘బి’లో భారత్, సిరియా, ఉజ్బెకిస్తాన్, ఆస్ట్రేలియా జట్లున్నాయి. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఖతర్‌తో లెబనాన్ తలపడుతుంది. వాస్తవానికి ఈ టోర్నీ గత ఏడాది చైనాలో జరగాల్సింది. అయితే కోవిడ్ కారణంగా చైనా ఆతిథ్యం నుంచి తప్పుకోగా ఖతర్‌కు ఈ టోర్నీని కేటాయించారు.

2 నుంచి విశాఖలో భారత్, ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్

ఈనెల 15 నుంచి టికెట్ల విక్రయాలు

విశాఖ స్పోర్ట్స్: విశాఖపట్నంలోని వైఎస్సార్ స్టేడియంలో ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన మ్యాచ్ నిర్వాహక కమిటీ గురువారం స్టేడియంలో సమావేశమైంది. ఈ వివరాలను కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎ.మల్లికార్జున మీడియాకు వెల్లడించారు. మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే దేశ, విదేశీ అభిమానులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పటిష్ట భద్రతతో పాటు తాగునీరు, మెడికల్ సదుపాయాలు, ఆహారం కోసం స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. అభిమానుల కోసం రవాణా సదుపాయాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి మాట్లాడుతూ.. టెస్ట్ మ్యాచ్ టికెట్లను ఈనెల 15 నుంచి పేటీఎం యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయిస్తామని చెప్పారు. ఈసారి పూర్తిగా డిజిటల్ టికెట్లను అందించనున్నట్లు తెలిపారు. 100, 200, 300, 500 రూపాయల టికెట్లను ప్రతి రోజుకు విడివిడిగా విక్రయిస్తామని.. అలాగే ఐదు రోజులకు కలిపి తీసుకునే వారి కోసం టికెట్ ధరలను రూ.400, 800, 1,000, 1,500గా నిర్ణయించామన్నారు. వైఎస్సార్, స్వర్ణభారతి స్టేడియాల్లో 26 కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 12-1-2024

పండగ ఫ్యాషన్





పండగ అనగానే సంప్రదాయ చీరకట్టుతో పాటు అమ్మాయిలకు ముందుగా గుర్తొచ్చేది లంగా ఓణీ పట్టుతో డిజైన్ చేసినా, జార్జెట్‌తో సింగారించినా చీరనే ఓణీలా చుట్టినా, కొంగును మాత్రమే కుచ్చిళ్లుగా మార్చినా నడుం పట్టీతో కట్టినా.. వడ్డాణంతో మెరిపించినా ఆధునికపు సొబగులు ఎన్ని అద్దుకున్నా సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలకడానికి తెలుగింటి అలంకారమైన హాఫ్ శారీ డిజైన్స్‌తో ఫుల్ జోష్‌ని నింపచ్చు.

హాఫ్ శారీ ఫుల్ జోష్

- ఫ్లెయిన్ లెహంగా పైన పట్టుచీరను ఓణీలా చుట్టడం ఓ కళ.
- నెమలి పింఛాన్ని తలపించేలా చీర ఫ్రిల్స్‌ను లెహంగాపైన బ్యాక్ సైడ్ డిజైన్ చేయడం అందమైన హంగు.



- పెద్దంచు లెహంగాలు పండగకు రెట్టింపు కళను జోడిస్తాయి.
- ఆల్ఇన్ వన్ ఒకే అంచులున్న ఒకేరంగు కాంబినేషన్ లంగా ఓణీ బ్లౌజ్ డిజైన్ మరో ఆకర్షణ.
- పట్టు లెహంగాకి కాంట్రాస్ట్ హ్యాండ్లూమ్ దుపట్టా అదనపు హంగును తీసుకు వస్తుంది.
- సిల్క్ లేదా జార్జెట్ మెటీరియల్‌పై డిజిటల్ ప్రింట్‌తో తీర్చిదిద్దిన లెహంగా డిజైన్స్ ఆధునికపు సొబగను తీసుకువస్తాయి.
- దుపట్టా అంచులను బ్లౌజ్‌కు అటాచ్ చేస్తూ. వడ్డాణంతో మెరిపిస్తే మరో కొత్త ఆకర్షణ.

మన పండుగ రుచి

వంటిల్లు

అరిశెలు చేసుకున్నాం. అవి ఎన్ని ఉన్నా సరే! పండుగ రోజు తాజాగా ఏమైనా చేయాల్సిందే. దేవుడికి బెల్లం పొంగలి... గోధుమ అప్పాలు... పూర్ణం బూరెలు... గారెలతో నైవేద్యం పెడదాం. మధ్యాహ్నం పండుగ భోజనాన్ని ఆరగిద్దాం. సాయంత్రం టీలోకి సకినాలను కరకరలాడిద్దాం.

మినప గారెలు



కావలసినవి: మినపప్పు – అర కేజీ; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; ఉప్పు – రుచికి తగినంత; నూనె– అర కేజీ.

తయారీ: మినప్పప్పు, శనగపప్పును శుభ్రంగా కడిగి మంచి నీటిలో నాలుగు గంటల సేపు నానబెట్టాలి. నానిన తర్వాత నీటిని వంపేసి గ్రైండర్‌లో కొంచెం పలుకుగా రుబ్బాలి.

బాణలిలో నూనె వేడి చేసి మినప్పప్పు మిశ్రమాన్ని బత్తాయి కాయ పరిమాణంలో తీసుకుని పాలిథిన్ పేపర్ మీద కానీ అరచేతిలో కానీ వేసి వేళ్లతో జాగ్రత్తగా వత్తి మధ్యలో చిల్లు పెట్టాలి. గారె మొత్తం ఒకటే మందంలో ఉండాలి, ఆకారం నిండు చంద్రుడిలా ఉండాలి. ఇలా చేసిన తర్వాత నూనెలో వేయాలి. రెండు వైపులా ఎర్రగా కాలిన తర్వాత నూనెలో నుంచి తీసేయాలి. నూనెలో నుంచి తీసిన పది నిమిషాలకు వేడి అమరి కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.

పూర్ణం బూరెలు



కావలసినవి: మినప్పప్పు – రెండు కప్పులు; బియ్యం– నాలుగు కప్పులు; ఉప్పు – చిటికెడు; నూనె – వేయించడానికి తగినంత.

పూర్ణం కోసం... బెల్లం – పావుకిలో; శనగపప్పు – కప్పు; ఏలకుల పొడి– టీ స్పూన్

తయారీ: ● బియ్యం, మినప్పప్పును కడిగి మూడు గంటల సేపు మంచి నీటిలో నానబెట్టాలి. ● శనగపప్పు కడిగి పది నిమిషాలు నానిన తర్వాత ప్రెషర్ కుక్కర్‌లో రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ఉడికిన పప్పును వడపోసి నీరంతా కారిపోయేవరకు ఉంచాలి. శనగపప్పు వేడి తగ్గిన తర్వాత గరిటెతో మెత్తగా చిదమాలి. అందులో బెల్లం పొడి వేసి స్టవ్ మీద పెట్టి గరిటెతో కలుపుతూ సన్న మంట మీద ఉడికించాలి. మిశ్రమం దగ్గరైన తర్వాత ఏలకుల పొడి కలిపి దించేయాలి. వేడి తగ్గిన తర్వాత పూర్ణాన్ని చిన్న గోళీలు చేసుకోవాలి. ● నానిన మినప్పప్పు, బియ్యాన్ని మెత్తగా రుబ్బాలి. గ్రైండ్ చేసేటప్పుడు ఉప్పు కలపాలి. పిండి మరీ పలుచగా ఉంటే పూర్ణానికి పట్టదు. గారెల పిండి కంటే వదులుగా... పూర్ణం ముంచి తీయడానికి తగినట్లు ఉండేలా చూసుకోవాలి. ● బాణలిలో నూనె మరిగించి పూర్ణం గోళీని మినప్పిండి మిశ్రమంలో ముంచి నూనెలో వేయాలి. ఇది చాలా నైపుణ్యంగా చేయాల్సిన పని. మినప పిండి పూర్ణం గోళీ అంతటికీ సమంగా ఒకే మందంలో పట్టాలి. నూనెలో వేసేటప్పుడు కానీ, కాల్చేటప్పుడు కానీ మినప్పిండి కవర్ నుంచి పూర్ణం బయటకు రాకూడదు. బూరెలు దోరగా కాలిన తర్వాత నూనెలో నుంచి తీసేయాలి. **గమనిక:** పూర్ణం పై పొరకు మినప్పప్పు మిశ్రమానికి బదులు మైదాపిండి కూడా వాడవచ్చు. మైదాపిండిలో తగినంత నీటిని పోస్తూ కలుపుకోవడమే. మరీ వదులుగా అనిపిస్తే మరికొంత పిండి వేసుకోవాలి. మరీ చిక్కగా ఉంటే మరికొంత నీటిని కలపాలి. కొత్తగా నేర్చుకునే వాళ్లు మైదాతో ప్రయత్నించడమే మంచిది.

సకినాలు



కావలసినవి: కొత్త బియ్యం– పావు కేజీ; వాము– టీ స్పూన్; జీలకర్ర పొడి– టీ స్పూన్; నువ్వులు– 50 గ్రాములు; ఉప్పు– రుచికి తగినంత; నూనె– వేయించడానికి తగినంత

తయారీ: బియ్యాన్ని కడిగి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం నీటిని వంపేసి మెత్తగా పిండి దంచాలి. పిండిని నూక లేకుండా జల్లించి అందులో వాము, జీలకర్ర, నువ్వులు, ఉప్పు వేసి కలపాలి. ఈ పొడిలో తగినంత నీటిని పోస్తూ ముద్దలా కలుపుకోవాలి. ● కాటన్ క్లాత్‌ను తడిపి పలుచగా పరిచి, పిండిని చేతిలోకి వేళ్లతో సకినాల ఆకారంలో క్లాత్ మీద వేసి పది నిమిషాల సేపు ఆరనివ్వాలి. ఈ లోపు బాణలిలో నూనె వేడి చేయాలి. నూనె కాగిన తర్వాత ఆరిన సకినాన్ని నూనెలో వేసి రెండువైపులా దోరగా కాలనిచ్చి తీసేయాలి.

బెల్లం పొంగలి



కావలసినవి: కొత్త బియ్యం – పావు కేజీ; శనగపప్పు – పావు కప్పు లేదా గుప్పెడు; బెల్లం పొడి – పావు కేజీ; పాలు – అర లీటరు; నెయ్యి – అర కప్పు; పచ్చ కర్పూరం– చిటికెడు; ఏలకుల పొడి– అర టీ స్పూన్; కిస్‌మిస్– గుప్పెడు; జీడిపప్పు – 20 పలుకులు.

తయారీ: బియ్యం, శనగపప్పును శుభ్రంగా కడిగి అర లీటరు నీటిని పోసి పక్కన ఉంచాలి. ● ఒక మందపాటి పాత్రలో నెయ్యి వేడి చేసి కిస్‌మిస్, జీడిపప్పు వేయించి పక్కన పెట్టాలి. ● ఒక పాత్రలో పాలను మరిగించి పక్కన ఉంచాలి ● బియ్యం పాత్రను స్టవ్ మీద పెట్టి ఉడికించాలి. బియ్యం ఒక మోస్తరుగా ఉడికిన తర్వాత అందులో పాలు పోసి కలపి మంట తగ్గించి ఉడికించాలి. అన్నం ఉడికిన తర్వాత బెల్లం పొడి వేసి కలిపి సన్న మంట మీద కలియబెడుతూ ఉడికించాలి. బెల్లం కరిగి దగ్గరపడే వరకు అడుగు పట్టకుండా కలుపుతూ ఉండాలి. బెల్లం రుచి అన్నానికి పట్టిన తర్వాత ఏలకుల పొడి, పచ్చ కర్పూరం పొడి వేసి సువాసన సమంగా కలిసే వరకు పొడవు గరిటెతో అడుగు నుంచి కలపాలి. చివరగా నెయ్యితోపాటు కిస్‌మిస్, జీడిపప్పు వేసి కలిపి దించేయాలి. పొంగలి చల్లారే కొద్దీ గట్టిపడుతుంటుంది. కాబట్టి గరిట జారుడుగా ఉన్నప్పుడే దించాలి.

గోధుమ అప్పాలు



కావలసినవి: గోధుమ పిండి – పావు కేజీ; మైదా పిండి– టేబుల్ స్పూన్; బెల్లం పొడి – పావు కేజీ; ఏలకుల పొడి – అర టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత

తయారీ: బెల్లం పొడిలో నీటిని పోసి కరిగిన తర్వాత ఏలకుల పొడి, గోధుమపిండి, మైదా వేసి కలిపి పది నిమిషాల సేపు ఉంచాలి. పిండి కలిపిన వెంటనే అప్పాలు చేస్తే సరిగ్గా పొంగవు. కాబట్టి కలిపిన తర్వాత పిండి నానాలి. ● ఇప్పుడు బాణలి స్టవ్ మీద పెట్టి నూనె వేడెక్కిన తర్వాత చిన్న నిమ్మకాయంత పిండి తీసుకుని అరచేతిలో వేసి వేళ్లతో పలుచగా వత్తి నూనెలో వేయాలి. తిరగేసి రెండు వైపులా దోరగా కాలిన తర్వాత తీసేయాలి.

గమనిక: ఎవరి రుచిని బట్టి వాళ్లు బెల్లం మోతాదు మార్చుకోవాలి. ● గోధుమ పిండిలో మైదా కలిపేది అప్పం విరిగిపోకుండా ఉండడానికి మాత్రమే. కొత్తగా నేర్చుకునే వాళ్లు మైదా కలుపుకుంటేనే మంచిది. ● ఎక్కువ నూనె వద్దనుకుంటే పెనం మీద టీ స్పూన్ నెయ్యి వేసి కాల్చుకోవచ్చు. నేతితో చేసిన అప్పం రుచికి మరేదీ సాటి రాదు.

● ముగ్గు-ముచ్చట





సంజీవని జ్యోతి
తాండూర్
వికారాబాద్

26 చుక్కలు
26 వరుసలు
సరి చుక్క





చుందూరు తన్మయి
హైదరాబాద్

18 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు
సరి చుక్క





ఎస్. లావణ్య నరేష్
హైదరాబాద్

18 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు





ఎ. మహాలక్ష్మి
టాటానగర్
బెంగళూరు

25 చుక్కలు
13 వచ్చేవరకు
మధ్య చుక్క





కె. సుభాషిణి
బ్రాడీపేట,
గుంటూరు

19 చుక్కలు
10 వరుసలు
సరి చుక్క





హర్షిత
నాగొడ్డివల్లె
అన్నమయ్య జిల్లా

10 చుక్కలు
10 వరుసలు
సరి చుక్క





వై. అమృత శ్రీవల్లి
కడప,
వైఎస్సార్ జిల్లా

21 చుక్కలు
1 వచ్చేవరకు
సరి చుక్క





ఆర్. ఇందిర
వెలమవారి వీధి,
బొబ్బిలి

21 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు

నిశ్చయంగా – ప్రజలలో మంచి పనులు చేసేవారు ఎవరో పరీక్షించటానికి – మేము భూమిపై ఉన్న వస్తువులను దానికి అలంకారంగా (ఆకర్షణీయ మైనవిగా) చేశాము.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 12 జనవరి 2024

'మహా' జనానిదే తుది తీర్పు

సుప్రీంకోర్టు తుది గడువు దగ్గరపడుతున్న వేళ మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ బుధవారం తన నిర్ణయాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గానికే పార్టీ ఎమ్మెల్యేల్లో అత్యధికుల మద్దతుందనీ, అదే 'నిజమైన శివసేన' అనీ తేల్చారు. అలాగని ఉద్ధవ్ ఠాక్రే వెంటనున్న ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయలేదు. పార్లమెంటు నుంచి అసెంబ్లీల వరకూ మన చట్టసభల్లో ఫిరాయింపులు, ఇతరేతర సమస్యలు తలెత్తినప్పుడు అధికార పక్షాల ప్రయోజనాల పరిధిని మించి స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవటానికి సభాధ్యక్షులు సిద్ధపడరని తరచు రుజువవుతూనేవుంది. మహారాష్ట్ర కూడా దానికి మినహాయింపు కాదు. అందువల్లే రెండుగా చీలిన శివసేన వర్గాల్లో ఏది నిజమైందో, ఏది కాదో తేల్చడానికి స్పీకర్ నార్వేకర్‌కు ఏడాదిన్నర కాలం పట్టిందంటే ఆశ్చర్యం లేదు. జనవరి 10 తుది గడువని సుప్రీంకోర్టు గట్టిగా చెప్పకపోయివుంటే మరెన్ని నెలలు పట్టేదో అనూహ్యం. లెక్కలు తేల్చడానికి శివసేనకు భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు లేరు. అయినా నార్వేకర్ గరిష్ఠ వ్యవధిని తీసుకుని తుది నిర్ణయం ప్రకటించారు. 2019లో ఆ పార్టీ నేతృత్వంలో ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) ప్రభుత్వం ఏర్పడిననాటికి శివసేన ఎమ్మెల్యేలు 55 మంది. 2022 జూన్ 21న 34 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సభానాయకుడిగావున్న ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో తిరగబడటంతో పార్టీ నిలువునా చీలింది. వెంటనే ఉద్ధవ్ మేల్కొని షిండే స్థానంలో సభానాయకుడిగా అజయ్ చౌధరిని నియమించటంతోపాటు, విప్‌గా వున్న షిండే వర్గం నేతను తొలగించి, తన వర్గంలోని సునీల్ ప్రభును ప్రకటించారు. ఎన్ని చేసినా ప్రయోజనం లేదని గ్రహించాక జూన్ 29న ఉద్ధవ్ ఠాక్రే రాజీనామా చేశారు.

మరికొన్ని నెలల్లో సాధారణ ఎన్నికలు రాబోతుండగా వెలువడిన నార్వేకర్ నిర్ణయం... ఈ చీలికను ప్రోత్సహించి షిండే సర్కారులో చేరిన బీజేపీకి సహజంగానే ఊరటనిచ్చే అంశం. భావోద్వేగాల ప్రభావం ఎక్కువుండే మహారాష్ట్రలో ఉద్ధవ్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడివుంటే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి సానుభూతి వెల్లువెత్తేది. ఇప్పటికే ఉద్ధవ్ శివసేన పేరును, గుర్తును కూడా కోల్పోయారు. ఆ అంశంలో ఎన్నికల సంఘం షిండే వర్గానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. సొంత మనిషిగా భావించిన షిండేయే బీజేపీ ప్రోద్బలంతో శివసేనలో చిచ్చు రగిల్చి ఉద్ధవ్‌కు అన్యాయం చేశారని జనం భావిస్తున్నట్టు పలు సర్వేలు చెబుతున్నాయి. ఇది షిండే వర్గంతోపాటు బీజేపీని కూడా దెబ్బతీసేలా వున్నదని ఆ సర్వేల సారాంశం. అందుకే అనర్హత అంశం జోలికి వెళ్లకపోవటమే మంచిదని షిండే వర్గం భావించినట్టు కనబడుతోంది. అయితే ఉద్ధవ్ వర్గం మౌనంగా ఏమీవుండదు. స్పీకర్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయటంతోపాటు ప్రజాక్షేత్రంలోకెళ్తానని ఇప్పటికే ప్రకటించింది. కనుక 'నిజమైన శివసేన' షిండేదేనన్న స్పీకర్ నిర్ణయంపై అది కావలసినంత రచ్చ చేస్తుంది. అటు కొందరు ఎమ్మెల్యేలతో నిష్క్రమించిన అజిత్ పవార్ వర్గంపైనా ఇలాంటి పిటిషనే పెండింగ్‌లో వుంది. ఈనెల 31లోగా వెలువడే ఆ నిర్ణయం కూడా ప్రకంపనలు రేపడం ఖాయం.

మన రాజ్యాంగం సభాధ్యక్షులకు ఎన్నో అధికారాలిచ్చింది. అనేక సందర్భాల్లో న్యాయస్థానాలు సైతం ప్రభుత్వాల బలాబలాలు తేలాల్సింది చట్టసభల్లోనేనని తేల్చిచెప్పాయి. కానీ తాము ఎమ్మెల్యేగా ఎన్నికైన పార్టీల ప్రయోజనాల పరిధిని మించి స్పీకర్లు వ్యవహరించలేకపోతున్నారు. మహారాష్ట్ర విషయానికే వస్తే ఉద్ధవ్ వర్గం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, స్పీకర్‌పై ఒత్తిడి తెస్తే తప్ప నిర్ణయం వెలువడలేదు. తమ నిర్ణయాలను ప్రశ్నించే అధికారం న్యాయస్థానాలకు లేదని స్పీకర్‌లు చెబుతూ వుంటారు. వాటి ఆదేశాలను బేఖాతరు చేస్తుంటారు. అయితే నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించినంతవరకూ అటువంటి స్వతంత్రతను అందరూ హర్షిస్తారు. అందుకు భిన్నంగాపోయి న్యాయస్థానాలతో అక్షింతలు వేయించుకునే పరిస్థితి తెచ్చుకుంటే అది స్పీకర్ల వ్యవస్థను బలహీనపరుస్తుంది. సాధారణంగా ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లేని సందర్భాల్లో ప్రభుత్వాలు ఏర్పడేటపుడూ... ఆ ప్రభుత్వాలు అస్థిరతలో పడినప్పుడూ ప్రత్యర్థి పక్షాలు ఖరీదైన విలాసవంతమైన హోటళ్లలో శిబిరాలు నిర్వహించటం, అవసరాన్నిబట్టి విమానాల్లో వేరే రాష్ట్రాలకు ఎమ్మెల్యేలను తరలించటం తరచు మన దేశంలో కనబడుతూనేవుంటుంది. ఈ తంతు మన ప్రజాస్వామ్యానికి తలవంపులు తెస్తున్నది కూడా. దానికితోడు సభాధ్యక్షులుగా వున్నవారు సైతం ఏదో ఒక వర్గం చేతిలో కీలుబొమ్మలై తటస్థతకు తూట్లుపొడిచి నిర్ణయాలు తీసుకోవటం లేదా నిర్ణయ ప్రకటనలో విపరీతమైన జాప్యం చేయటం తరచు కనబడుతుంది. భారీ మెజారిటీతో నెగ్గిన తెలుగుదేశం అధినేత స్వర్గీయ ఎన్‌టీఆర్ సర్కారును ఆయనకు స్వయానా అల్లుడైన చంద్రబాబు నాయుడు 1995 ఆగస్టులో కూల్చి, అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పుడు జరిగిన పరిణామాలను ఎవరూ మరిచిపోరు. అంతకుముందూ, ఆ తర్వాతా కూడా పదే పదే అలాంటి ఉదంతాలే దేశంలో పునరావృతమయ్యాయి. స్పీకర్ తాజా నిర్ణయంపై ఉద్ధవ్ వర్గం న్యాయస్థానంలోనూ, వెలుపలా పోరాడుతుంది. ఇప్పటికైతే షిండే ప్రభుత్వం నిశ్చింతగా వుండొచ్చు. కానీ ఈ చీలికలపైనా, ప్రభుత్వాలను కూల్చటంపైనా జనం స్పందన ఎలావుండబోతున్నదో రాబోయే ఎన్నికల్లో తేలుతుంది. ఆ తర్వాతైనా రాజకీయ పక్షాలు పరిణతితో వ్యవహరించటం నేర్చుకుంటాయని ఆశించాలి.

నవ భారతంలోకి ముందడుగు

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

దేశంలో మహిళలు ఇప్పటికీ అర్ధ బానిసత్వంలోనే ఉన్నారు. పితృస్వామ్యం, సంకుచిత సామాజిక, సాంస్కృతిక విలువలు, లింగ వివక్ష వంటివి మహిళల వెనుకబాటుతనానికి కారణాలు. భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందక పోవడానికి కారణం, పితృస్వామ్యం. ఈ పరిస్థితి మారాలి. మహిళతో పాటు నిరుద్యోగి, రైతు, కార్మికుడు, యువత కూడా జీవన సంక్షోభంలో ఉన్నారు. స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాద భావనలు కూడా సంక్షోభంలో పడ్డాయి. అందుకే 2024 సంవత్సరంలో ప్రజలు ఆత్మగౌరవంతో, అభ్యుదయ భావాలతో నడవాలి. గిరిజనులు, దళితులు, బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు స్వేచ్ఛగా జీవించగలిగే నూత్న భారత నిర్మాణం కోసం కలిసికట్టుగా పనిచేయాలి.

భారతదేశం లౌకిక దేశం. భారతాన్ని వర్గ భారతంగా మార్చాలన్నది పెద్ద వ్యూహం. కానీ అది సాధ్యం కాదు. ఎందుకంటే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామిక, లౌకిక రాజ్యాంగంగా రూపుదిద్దారు. దాని పునాదులను కదపటం ఎవరి వల్లా కాదు. అంబేడ్కర్ రాజ్యాంగ రూపకల్పనలో ఫ్రెంచి విప్లవంలోని వాల్టేర్, రూసో భావాలను తీసుకున్నారు. నిజానికి ఆయన రాజ్యాంగం పునాదుల పునర్నిర్మాణం నుండి ప్రారంభమైంది. రాజ్యాంగం ప్రకారం, ఆరు సంవత్సరముల వయసు పూర్తి అగు వరకు బాల బాలికల ఆరోగ్య పరిరక్షణకు, విద్యా వసతులు కల్పించటానికి ప్రభుత్వం కృషి చేయాలి. 14 సంవత్సరాల వయసు వచ్చువరకు బాల బాలికలకు ఉచిత నిర్బంధ విద్య నేర్పాలి. అయితే ఈనాటికీ బాల బాలికలకు పౌష్టిక ఆహారం పెట్టలేని స్థితిలో మనం ఉన్నాము. పసిపిల్లలకు పాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నాము. పిల్లలకు పౌష్టికాహారం కావాలి, ఆరోగ్య పరిరక్షణ కావాలి, పర్యావరణ పరిరక్షణ కావాలి. పురిటిలోనే శిశువులు చనిపోతున్న పరిస్థితులు పెరుగుతున్నాయి. ఒక శిశువుని పెంచి పోషించాలంటే పేదరాలైన తల్లి వల్ల కాదు. దానికి ప్రభుత్వపు, సమాజపు బాధ్యత కూడా కావాలి.

నిజానికి ఒక శిశువు మరణిస్తే ఆ దేశానికి భవిష్యత్తు మరణించినట్టే. రాను రాను భారతదేశంలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. దానికి కారణం విపరీతంగా రేట్లు పెరిగిపోవడమే. 2019 జనవరి నుండి 2022 మే వరకు కూరగాయలు, పాలు, బెల్లం, దుంపలు, వంటనూనె, గుడ్లు, పంచదార ఉత్పత్తి, సరఫరా తగ్గుముఖం పట్టాయి. బియ్యం, పప్పులు, ఉప్పులు కొనుక్కోలేని స్థితికి సామాన్యులు నెట్టబడుతున్నారు. కారణం కూరగాయలు రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ఎరువులు, విత్తనాల ధరలు ఎక్కువవుతున్నాయి. అకాల వర్షాలకు రైతు కుదేలవుతున్నాడు. కాళ్ళు సన్నగా, కడుపులు బోలుగా, భుజాన కండలేక 40 కోట్ల మంది ఈసురోమంటున్నారు.

ఇంక స్త్రీల విషయానికి వస్తే పురుషులు తిననంత కూడా తినలేక పోతున్నారు. వాళ్లు అర్ధ బానిసత్వంలోనే ఉన్నారు. వారితో ఆరుగాలం పనిచేయించుకుంటున్నారు. మహిళల్లో సగం మంది కూడా ఉద్యోగినులు లేరు. పితృస్వామ్యం, సంకుచిత సామాజిక, సాంస్కృతిక విలువలు, అల్ప విద్యాస్థాయి, తగు ఆస్తులు లేకపోవడం, లింగ వివక్ష, మహిళలపై నేరాలు, ఘోరాలు అత్యధికంగా ఉండడం వంటివి మహిళల వెనుకబాటుతనానికి కారణాలుగా చెప్పక తప్పదు. ఎన్‌సీఆర్‌బీ (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) నివేదిక (డిసెంబర్ 2023) ప్రకారం, మహిళల పట్ల జరుగుతున్న నేరాలు 2021లో కంటే, 2022లో 4 శాతం అధికంగా సంభవించాయి. 2022లో మహిళలకు వ్యతిరేకంగా 4,45,000 నేర ఘటనలు జరిగాయి. కుటుంబ సభ్యుల క్రూరత్వం, దౌర్జన్యాలు ఈ నేరాలలో అత్యధికం. ప్రతీ జీవన వ్యవహారంలోనూ, మరీ ముఖ్యంగా ఆదాయంలో లింగ వ్యత్యాసం, వివక్ష తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఉత్పత్తి కార్యకలాపాలలో పట్టణ మహిళల భాగస్వామ్యం 24.0 శాతం కాగా, పురుషుల శాతం 73.8 శాతంగా ఉన్నది. 2004–2005, 2011–2012 సంవత్సరాల మధ్య కార్మిక శ్రేణుల నుంచి దాదాపు రెండు కోట్ల మంది మహిళలు వైదొలిగారని ప్రపంచ బ్యాంకు నివేదికలు వెల్లడించాయి.



ఈ అంతరాలను విస్మరించడమంటే, మహిళలు ఇంకా పలు దశాబ్దాల పాటు అణచివేతకు గురికావడమే అని నిష్కర్షగా చెప్పక తప్పదు. భారతదేశం పితృస్వామ్య వ్యవస్థా నిర్మాణంతో ఉంది. అంటే ప్రతీ అంశంలోనూ పురుషుడిదే ఆధిపత్యం. అందుకే ఆడశిశువు భ్రూణ హత్యలు ఎక్కువగా జరిగాయి. ఫలితంగా చాలామంది పురుషులకు ఇప్పుడు పెళ్ళి చేసుకోవడానికి అమ్మాయిలు దొరకడం లేదు. కొందరు ఎదురు కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకుంటున్నారనే కథనాలు వినిపిస్తున్నాయి. మరోవైపు బాలికలు, యువతులను అపహరించడం, వారిని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి వ్యభిచార వృత్తిలోకి దింపడం ఎక్కువవుతోంది. స్త్రీలను అవమానించడం, అనుమానించడం, అపహాస్యం చేయడం, అత్యాచారం చేయడం, అణచి వేయడం నిత్యాచారమైంది. భారతదేశం అంతా ఆర్థికంగా అభివృద్ధి చెందక పోవడానికి కారణం, పితృస్వామ్యం. ముందుగా స్త్రీకి మనం పౌష్టికాహారం పెట్టగలగాలి. స్త్రీల పేరు మీద భూములకు పట్టాలివ్వాలి. బస్సుల్లోనే కాక రైళ్ళల్లోనూ, విమానాల్లోనూ ఉచిత సేవలు అందించాలి. అప్పుడు అన్ని చోట్లకీ ఆమె ప్రయాణించగలుగుతుంది. ప్రస్తుతం బంగారు నిల్వలు ఎక్కువగా ఉంటున్నాయి కాబట్టి, మూడు శవర్లు బంగారం ప్రతీ స్త్రీకి ఇవ్వాలి.

ఇకపోతే నిరుద్యోగుల సంఖ్య భారతదేశంలో పెరిగిపోతోంది. 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా' నివేదిక 2023 ప్రకారం, 25 సంవత్సరాల లోపు వయసు పట్టభద్రులలో నిరుద్యోగితా రేటు 42.3 శాతం. 30 నుంచి 34 సంవత్సరాల వయసు పట్టభద్రులలో ఇది 9.8 శాతం. ఈ నిరుద్యోగిత పరిస్థితులు సమాజంపై విషమ ప్రభావాన్ని చూపుతున్నాయి. అంతర్గత వలసలు, అంతకంతకూ పెచ్చరిల్లుతోన్న నేరాలు, హింసాకాండ, మాదకద్రవ్యాల వినియోగం నిరుద్యోగిత పర్యవసానాలే అనడంలో సందేహం లేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామన్న పాలకపక్షం హామీ కేవలం ఒక ఎన్నికల జుమ్లా (వంచన) అని తేలిపోయింది. నిరుద్యోగులు ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎంఏ, ఎంఎడ్, బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, బీఎడ్‌లు చేసి కూడా ఉపాధి పనులకు వెళ్తున్నారు. సింగపూర్‌లోని హ్యూమన్ క్యాపిటల్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్, మరికొన్ని సంస్థలు కలిసి ఏటా విశ్వ ప్రతిభా పోటీతత్వ సూచీ(జీటీసీఐ)ని వెలువరిస్తుంటాయి. విద్య, నైపుణ్య శిక్షణ, అవకాశాల లభ్యత, ప్రభుత్వాల చేయూత వంటి ప్రమాణాల ఆధారంగా 'జీటీసీఐ'ని రూపొందిస్తాయి. 2023 సూచీలో 134 దేశాలకు గాను ఇండియాకు 103వ స్థానం దక్కింది. అయినా, ప్రపంచంలో అతిపెద్ద ప్రతిభా కర్మాగారం ఇండియాయేనని ప్రభుత్వ వర్గాలు ఊదరగొడుతున్నాయి.

ఆర్థిక సాంఘిక సాంస్కృతిక విద్యా సాంకేతిక రంగాలు సంక్షోభంలో ఉన్నాయి. శిశువు, స్త్రీ, నిరుద్యోగి, రైతు, కార్మికుడు, యువత జీవన సంక్షోభంలో ఉన్నారు. భారత రాజ్యాంగం సమర్పించిన స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమత, మమత, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం కూడా సంక్షోభంలో పడ్డాయి. అందుకే 2024 సంవత్సరంలో ప్రజలు సామర్థ్యాన్ని పెంచుకొని, చైతన్యవంతంగా ఉత్పత్తిని పెంచుకోవాలి. సామరస్యతను పెంచుకొని ఆత్మగౌరవంతో, అభ్యుదయ భావాలతో నడవాలి. అంబేడ్కర్, పూలే, బుద్ధుని ఆశయాలతో సంపద అందరికి పంపిణీ అయ్యే విధానంతో సాగాలి. మొత్తం భారతదేశం 2025 జనవరి 1 కల్లా సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలి. పారిశ్రామిక విప్లవంలో ముందడుగు వేయాలి. గిరిజనులు, దళితులు, బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు స్వేచ్ఛగా జీవించగలిగే నూత్న భారత నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. నదులను అనుసంధానం చేసుకొని ఎక్కువ ఎగుమతులు చేయగలిగిన స్థాయిలో ఉత్పత్తిని పెంచుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంచుకోవాలి. చంద్రుడినే కాదు, అనేక గ్రహాలను అధీనం చేసుకునే స్థాయికి ఎదగాలి. భౌతిక, రసాయన శాస్త్ర అధ్యయన విస్తృతి పెరగాలి. నోబెల్ బహుమతి పొందగలిగే స్థాయిలో విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యను పెంచాలి. అన్ని దిశలా అన్ని రంగాల్లో భారతీయులందరం భాగస్వాములై భారత భాగ్యోదయానికి కృషి చేద్దాం. చరిత్రను పాలకులు కాదు, ప్రజలే మారుస్తారు. చరిత్ర నిర్మాణానికి ముందుకు నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గాల్లో ప్రాణాలు



మా చిన్న చెల్లె కొడుకు, 25 ఏళ్లవాడు కారు ప్రమాదంలో మరణించాడు. వాడు వాళ్లకు ఒకే అబ్బాయి. మెడిసిన్ చదువుతున్నాడు. ఇంటర్న్‌షిప్ పూర్తయ్యే దశలో ఉన్నాడు. రోడ్లు, హైవేల అక్రమ కోతలు, ఇంజినీరింగ్ లోపాలను సవరించేంతవరకూ విలువైన ప్రాణాల్ని మనం నష్టపోతూనే ఉంటాం.

– గురిందర్ సింగ్ ఢిల్లో
పంజాబ్ అదనపు డీజీపీ

వాళ్లదే చేస్తారు



ఒక విషయంలో నన్ను ఇక మార్చలేనంతగా స్విస్/జర్మన్ అయిపోయాను. జలుబును తగ్గించడానికి ఎడతెరిపి లేకుండా లైమ్ బ్లాసమ్ (వేప వంటి ఒక చెట్టు), కామొమిల్ (సీమ చేమంతులు) హెర్బల్ టీలు తాగుతూనే ఉన్నాను.

– సుచిత్ర, తమిళ రచయిత్రి

ఎందుకలా?



ప్రజాస్వామ్యాన్ని (ఓటు ద్వారా నిర్ణయం తీసుకునే విధానం) సమర్థించిన మొదటి తత్వవేత్త బుద్ధుడు. అదే సోక్రటీస్, ప్లేటో ఈ భావనను వ్యతిరేకించారు. అయితే, 2000 ఏళ్ల అనంతరం జ్ఞానోదయం అయిన ఆలోచనాపరులు రోమన్ రిపబ్లిక్‌ను పునరుజ్జీవింపజేశారు. కానీ వైశాలి నిర్మాణం మాత్రం భారతీయుల జ్ఞాపకాల్లో లేకుండా పోయింది.

– జోసెఫ్ టి నూనీ, థింకర్

అలా వ్యాపించాలి!



కవిత అనేది లావుపాటి కవితల పుస్తకానికి చెందదు. అది లంచ్‌బ్యాగు వెంట నడవాలి. అద్దం దగ్గర వేలాడాలి. పార్టీ ఆహ్వానాలతో అందుతుండాలి. క్యాండీని చుట్టే నోట్ కావాలి.

– డి.ఎ. పావెల్, అమెరికన్ కవి

తప్పేం లేదు!



గోప్యతకూ, ప్రైవసీకి చాలా తేడా ఉంది. ఎంత దగ్గరివాళ్లు అయినప్పటికీ, కొన్ని విషయాలను వ్యక్తిగతంగా ఉంచుకోవాలని అనుకోవడం పట్ల పశ్చాత్తాపం ఏమీ అక్కర్లేదు.

– పూజా గర్గ్, సైకాలజిస్ట్

చావు ముంగిట్లోనూ...

సమాజాన్ని తట్టి లేపే అరుదైన కవుల్లో ఒకరు అలిశెట్టి ప్రభాకర్. బతికింది కొద్ది కాలమే అయినా సమాజం అనే విశాలమైన 'కాన్వాస్' పై బలమైన సాహిత్య ముద్రను వేసి 'తాను మరణించి జనులకి కవిత నందించి' అన్నట్లుగా జీవిత కాలంలో తను చూసిన పరిస్థితులనూ, అనుభవించిన పేదరికాన్నీ, సమాజంలోని వైరుధ్యాలనూ ఓ వైపు వ్యాధి (క్షయ) ముదిరి చావుకి దగ్గరౌతున్నా అదరక చెదరక బెదరక కలాన్ని ముందుకు నడిపి కవితా సేద్యం చేసిన కవి కర్షకుడు అలిశెట్టి ప్రభాకర్. 'ఎర్ర పావురాలు' (1978), 'మంటల జెండాలు', 'చురకలు' (1979), 'రక్తరేఖ' (1985), 'ఎన్నికల ఎండమావి' (1989), 'సంక్షోభ గీతం' (1990), 'సిటీలైఫ్' (1992) వంటి కవిత్వ సంపుటాలు అచ్చువేసి తెలుగు సాహిత్యంపై తనదైన ముద్రను వేశాడు.



అలిశెట్టి ప్రభాకర్

'ఒక నక్క /ప్రమాణస్వీకారం చేసిందట/ఇంకెవర్నీ మోసగించనని /ఒక పులి/పశ్చాత్తాపం ప్రకటించిందట/ తోటి జంతువుల్ని సంహరించినందుకు/ ఈ కట్టుకథ విని/గొర్రెలింకా/ పుర్రెలూపుతూనే ఉన్నాయ్.' అక్షర సత్యాలు పై వాక్యాలు.

'ఓ ఆడదాని కళ్ళు తవ్వేశా /కన్నీటి శిథిలాలు బయల్పడ్డాయి
ఓ దౌర్భాగ్యుడి పొట్టలో ప్రవేశించా/పేగులు నాగుబాముల్లా బుసలు కొట్టాయి/ఓ చిన్నారి హృదయాన్ని స్పృశించా /వాని తల్లి శిలావిగ్రహమే బ్రద్దలైంది'

దశాబ్దాల క్రితం రాసిన ఈ మాటలు ఇప్పటి పరిస్థితులకూ వర్తిసాయనడం అతిశయోక్తి కాదు. ఏ వాదాలకూ, ఏ వివాదాలకూ లొంగక తనదైన శైలిలో సాహిత్యాన్ని సుసంపన్నం చేసి నేటికీ విమర్శకులకూ, పరిశోధకులకూ కొత్త ప్రశ్నలు వేస్తున్నాడు అలిశెట్టి ప్రభాకర్. జాషువా **'సుకవి జీవించు ప్రజల నాలుకల యందు'** అన్నట్లుగా నేటికీ కవిత్వ రూపంలో జీవించే ఉన్నాడు అలిశెట్టి. తెలుగు సాహిత్య చరిత్రలో జయంతి, వర్ధంతి ఒకే తేదీన ఉన్న వ్యక్తి బహుశా అలిశెట్టి ప్రభాకర్ (12.1.1954 – 12.1.1993) ఒక్కడే కావచ్చు. **'మరణం నా చివరి చరణం కాదు. మనోహరాకాశంలో విలపించే చంద్రబింబం నా అశ్రుకణం కాదు. పీడితుడే నా అస్త్రం – అణ్వస్త్రం శత్రువు నా పాద ధూళి'** లాంటి పదునైన వాక్యాలు ప్రభాకర్ శైలికి నిదర్శనాలు. శ్రీ శ్రీ, దాశరథి తరువాత సమాజాన్ని తట్టిలేపే సాహిత్యాన్ని అందించిన గొప్ప వ్యక్తి అలిశెట్టి ప్రభాకర్.

– డాక్టర్ మహ్మద్ హసన్, సాహిత్య విమర్శకులు
(నేడు అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)

వికసిత భారత్ లక్ష్య సాధనకు యువతే కీలకం

సందర్భం



బండారు దత్తాత్రేయ

స్వామి వివేకానంద, 19వ శతాబ్దపు భారతీయ తత్వవేత్త, ఆధ్యాత్మిక నాయకుడు, గొప్ప ఆలోచనాపరుడు, వక్త, కవి, యువతకు మార్గనిర్దేశకుడు. ప్రపంచ పునరుత్పాదకతకు యువతను చోదక శక్తిగా ఆయన భావించారు. యువతలో నిక్షిప్తమై ఉన్న నిగూఢమైన శక్తిని ఉదాత్తమైన ఆదర్శాల వైపు మళ్లించడం ద్వారా సమాజంలో గొప్ప పరివర్తన తీసుకురావచ్చని ఆయన నమ్మారు. వ్యక్తిత్వ నిర్మాణం, నైతిక సమగ్రత, బలమైన ఆత్మవిశ్వాసం వంటివి యువత అభివృద్ధికి అవసరం అని నొక్కి వక్కాణించారు. ఆధునిక విద్య, ఆధ్యాత్మిక జ్ఞానాల చక్కటి సమ్మేళనాన్ని పెంపొందించుకోవాలని ఆయన యువతను ప్రోత్సహించారు. విద్యావ్యవస్థ జ్ఞానాన్ని అందించడంతోపాటూ సామాజిక బాధ్యతనూ, స్వావలంబననూ పెంపొందించాలని వాదించారు.

స్వామి వివేకానందుని జయంతిని ప్రతి ఏడాదీ జనవరి 12న 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుకొంటున్నాం. నిర్భయులూ, నిస్వార్థపరులూ, మానవ సేవకు కట్టుబడి ఉండేవారుగా యువతరాన్ని స్వామి అభివర్ణించారు. నిర్భాగ్యులకు సేవ చేయడం అంటే దేవునికి నిజమైన సేవ చేసినట్లని ఆయన బలంగా నమ్మారు. మాతృభూమికి, ప్రజానీకానికి సేవ చేసేందుకు దేశంలోని యువత దృఢ సంకల్ప శక్తిని కలిగి ఉండాలన్నారు. 'మీరందరూ, ఎక్కడ ప్లేగు లేదా కరువు వ్యాప్తి చెందినా, లేదా ప్రజలు ఎక్కడ కష్టాల్లో ఉన్నారో అక్కడికి వెళ్లి, వారి బాధలను తగ్గించండి' అని యువతకు పిలుపునిచ్చారు.

స్వామి 1893 సెప్టెంబర్ 11న చికాగోలో 'వరల్డ్ పార్లమెంట్ ఆఫ్ రిలిజియన్స్'(ప్రపంచ మతాల సమ్మేళనం)లో చేసిన ఉపన్యాసం వివిధ మతాలకు చెందిన వారిపై చెరగని ముద్ర వేసింది. తన హృదయాంతరాళం నుంచి పెల్లుబికిన భాతృభావంతో 'అమెరికా సోదరీ, సోదరులారా' అని సంబోధిస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. అంతే... ఒక్కసారిగా ఉరుము ఉరిమినట్లు ప్రేక్షకుల నుంచి చప్పట్ల మోత! 'మీరు మాకు అందించిన సాదరమైన అపురూప స్వాగతానికి మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. ప్రపంచంలోని అత్యంత పురాతనమైన సన్యాసుల తరఫునా, మతాలకే మాత అయిన మతం తరఫునా, హిందూ మతానికి చెందిన అన్ని వర్గాలూ, తెగలకు చెందిన లక్షలాదిమంది ప్రజల తరఫునా పేరు పేరునా ధన్యవాదాలు' అన్నారు. అలాగే 'ప్రపంచానికి సహనం, సార్వత్రిక అంగీకారం రెండింటినీ బోధించిన మతానికి చెందినవాడిగా నేను గర్వపడుతున్నాను. మేము సార్వత్రిక సహనాన్ని విశ్వసించడంతోపాటూ అన్ని మతాలనూ నిజమైనవిగా అంగీకరిస్తాం... భూమిపై ఉన్న అన్ని మతాలకూ, దేశాలకూ చెందిన బాధితులకూ, శరణార్థులకూ ఆశ్రయం కల్పించిన దేశానికి చెందినవాడిగా నేను గర్విస్తున్నాను' అని ఎలుగెత్తి చాటారు.



నేడు స్వామి వివేకానంద జయంతి : జాతీయ యువజన దినోత్సవం

'ఎరైజ్, ఎవేక్, అండ్ స్టాప్ నాట్ అంటిల్ ది గోల్ ఈజ్ రీచ్డ్' (లేవండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి) అని స్వామి ఇచ్చిన పిలుపు ఎంతో ప్రసిద్ధి చెందింది. అలాగే 'మీరు లోపల నుండి ఎదగాలి. ఎవరూ మీకు బోధించరు, మిమ్మల్ని ఆధ్యాత్మికంగా మార్చరు. మీ సొంత ఆత్మ తప్ప మరొక గురువు లేదు' అని బోధించారు. ఒక దేశ బలం, శక్తి దాని యువత చేతుల్లోనే ఉందని నొక్కి చెప్పారు. ఆయన దృష్టిలో యువత సానుకూల మార్పుకు దీపధారులు. మంచి భవిష్యత్తును రూపొందించడానికి అవసరమైన శక్తి, ఉత్సాహం, సృజనాత్మకతను కలిగి ఉండే వారు. 'మీరు బలహీనులని భావించడం మహాపాపం... విశ్వంలోని అన్ని శక్తులూ ఇప్పటికే మనవి. కళ్లకు అడ్డుగా చేతులు పెట్టుకొని అంతా చీకటి అని ఏడ్చేదీ మనమే. మీ జీవితంలో రిస్క్ తీసుకోండి. మీరు గెలిస్తే, మీరే నాయకత్వం వహించవచ్చు; మీరు ఓడిపోతే, మీరు మార్గనిర్దేశం చేయవచ్చు' అంటూ స్వామి ఇచ్చిన అద్భుతమైన సందేశాలు యువతకు అనుసరణీయాలు.

యువత శారీరకంగానూ, మానసికంగానూ దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు స్వామి. వారు క్రీడా మైదానాలకు వెళ్లాలన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, విశాల హృదయాలు కలిగిన యువతను ఆయన కోరుకున్నారు. అందుకే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఫిట్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభించారు. 21వ శతాబ్దం భారత్ శతాబ్దం కావడానికి మోదీ కృషి చేస్తున్నారు. ఐఎమ్ఎఫ్ అంచనా ప్రకారం భారత్ జీడీపీ 5 ట్రిలియన్ డాలర్లు దాటినందున, మనది నేడు ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అలాగే 2027 నాటికి ప్రపంచంలోని 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుంది. 2047 నాటికి, భారతదేశం అభివృద్ధి చెందిన దేశానికి సంబంధించిన అన్ని లక్షణాలతో 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి సిద్ధంగా ఉంది. ఇలా 'వికసిత్ భారత్' సాకారం కావాలంటే యువత కీలక పాత్ర పోషించవలసి ఉంది.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం అనేక మైలురాళ్లను చేరుకుంది. 'చంద్రయాన్' అంతరిక్ష రంగంలో సాధించిన ప్రగతికి ఒక ఉదాహరణ. డిజిటల్ ఆవిష్కరణ పట్ల దేశం నిబద్ధతను చాటిచెప్పే ఆధార్, యూపీఐ, ఏపీ స్టాక్, కొవిన్ ప్లాట్ ఫారమ్ వంటి వాటి వల్ల భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందింది. భారత్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారే దిశగా అడుగులు వేస్తోంది. మన సేవల రంగం, ముఖ్యంగా ఐటీ, ఐటీయేతర డొమైన్‌లలో ప్రపంచ ప్రాముఖ్యం కలిగి ఉంది. 300 బిలియన్ డాలర్ల కన్నా ఎక్కువ విలువ కలిగిన 100 యునికార్న్‌లను భారత్ కలిగి ఉండి, ప్రపంచంలోని మూడవ–అతిపెద్ద స్టార్ట్–అప్ పర్యావరణ వ్యవస్థగా నిలిచింది. ఈ 'అమృత్ కాల్' సందర్భంలో 'ఆత్మనిర్భర్ భారత్'ను రూపొందించడానికి స్వామి వివేకానంద బోధనలను ఉపయోగించుకుందాం!

వ్యాసకర్త హరియాణా గవర్నర్

గొప్ప చెప్పుకోరాదు!

పూర్వం అయోధ్య నగరాన్ని సుదర్శనుడనే రాజు పాలిస్తుండేవాడు. సరయూనది తీరంలో ఆగమ నియమానుసారంగా క్రతువులు చేస్తూ ప్రతిరోజు లక్షా పాతికవేల మందికి భోజనం సంతృప్తికరంగా పెట్టేవాడు. దీనితో అతని ఖ్యాతి దిశ దిశలా వ్యాపించి, దేవలోకానికి కూడా చేరింది. ఆశ్చర్య పోయిన నారద మహాముని సుదర్శనుడి వద్దకు వచ్చాడు. దేవర్షికి నమస్కారం చేసి, 'మీ రాకతో నా జన్మ ధన్యమైంది. నేను ముక్తుడనయ్యాను స్వామీ!' అంటాడు. 'నీ యశస్సు బ్రహ్మ భువనాంతములను తాకింది. ఎంతో పుణ్యం చేసుకున్న వారికి మాత్రమే ఇటువంటి ఖ్యాతి దక్కుతుంది సుమా!' అంటాడు నారదుడు. ఆశ్చర్యపోతాడు సుదర్శనుడు. ఆ ఆశ్చర్యాన్ని గమనించిన నారదుడు 'నీవెంత పుణ్యాత్ముడవో నీవే పరీక్షించుకోవచ్చును' అంటూ అప్పటికప్పుడు సరయూతీరంలోని ఇసుకతో ఒక కుండను తయారుచేసి, 'ఈ పచ్చికుండలో నీవు నీళ్ళు నింపు, నిలుస్తాయి' అంటాడు. సుదర్శనుడు అలాగే చేయగా, ఆ కుండలో నీళ్ళునిలుస్తాయి. ఇలా చేసిన కుండలలోనే వండి భోజనం పెట్టమని సుదర్శనుడికి చెప్పి దేవలోకానికి వెళ్ళిపోతాడు నారదుడు.



జ్యోతిర్మయం

ఒక రోజు ఇసుక కుండలలో వంటలు ఉడుకుతూ ఉండగా, 'ఇటువంటి ఘనతను సాధించినది నేను ఒక్కడినే కదా!' అంటాడు సుదర్శనుడు. నోటిలోంచి ఆ మాటలు వస్తుండగానే ఉడికే కుండలు ఒక్కసారిగా ఇసుక కుప్పలై పోతాయి. అది చూసి బాధలో మునిగిపోయిన సుదర్శనుడి వద్దకు మళ్ళీ నారదముని వచ్చి...

'ఇంత మహిమ వడసితి నని
సంతసమున నీవు రాజసము గైకొన్నన్
సంతతము జేయు సుకృతం
బింతయు నిట్టింకె నింక నే మనవచ్చున్' అంటాడు.

'ఇంత గొప్ప మహిమను సాధించాననే అహంకారం మనసు నిండా కమ్ముకోగా మర్యాద తప్పావు. గర్వం వలన సజావుగా జరిగే పని కాకుండాపోయింది' అన్నది నారదుడి మాటల సారాంశం. 'తన గొప్పను తాను గర్వంగా చెప్పుకోవడం కార్యహానికే' అని కొఱవి గోపరాజు రచించిన 'సింహాసన ద్వాత్రింశిక' ద్వితీయాశ్వాసంలోని ఈ కథ చెబుతుంది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.పాడ్యమి సా.4.31 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.45 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.9.33 నుండి 11.01 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.35 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.19 వరకు, **అమృతఘడియలు:** ప.11.37 నుండి 1.09 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.39.

సాక్షి బిజినెస్

శుక్రవారం
12-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
63	28
71,721	21,647

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.00 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	14,829	▽ 141
డోజోన్స్	37,447	▽ 248
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,582	▽ 70
డాక్స్	16,550	▽ 139
షాంఘై	2,886	▲ 9
నికాయ్	35,050	▲ 608

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,262	▽ 86
బంగారం (99.5 స్వచ్ఛత)	62,013	▽ 85
వెండి (కేజీ)	71,532	▲ 85

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.66	83.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.85	107.42
€	యూరో	ఒకటి	90.13	92.57
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.59	57.90
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.04	56.96
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	పాయింట్	21.18	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	పాయింట్	21.71	23.50
¥	చైనా యువాన్	పాయింట్	10.48	12.55

ఇన్ఫోసిస్.. ప్చ్!

- క్యూ3లో లాభం రూ.6,106 కోట్లు; 7.3 శాతం డౌన్
- 1.3 శాతం పెరిగిన ఆదాయం; రూ. 38,821 కోట్లు
- షేరుకు రూ.18 మధ్యంతర డివిడెండ్



మూడో త్రైమాసికంలో మా పనితీరు నిలకడగానే ఉంది. బడా డీల్స్ దన్నుతో 3.2 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను దక్కించుకున్నాం. జెనరేటివ్ ఏఐ, డిజిటల్, క్లౌడ్ తదితర విభాగాల్లో మా పోర్ట్‌ఫోలియో పటిష్టతకు ఇది నిదర్శనం. స్థూల ఆర్థిక పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. ఫైనాన్షియల్ సర్వీసులు, టెల్కోలు, హైటెక్ రంగాల్లో ప్రభావం కొనసాగవచ్చని భావిస్తున్నాం.

– సలీల్ పరేఖ్, ఇన్ఫీ సీఈఓ

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ.. ఇన్ఫోసిస్ నిరుత్సాహకరమైన ఫలితాలతో బోణీ కొట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (2023–24, క్యూ3)లో కంపెనీ రూ. 6,106 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో లాభం రూ.6,586 కోట్లతో పోలిస్తే 7.3% తగ్గింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 1.3% పెరుగుదలతో రూ. 38,821 కోట్లకు చేరింది. గతేడాది క్యూ3లో ఆదాయం రూ. 38,318 కోట్లుగా నమోదైంది. క్లయింట్ల నుండి డిమాండ్ మందగించడం ఫలితాలపై ప్రభావం చూపింది.

గైడెన్స్ కట్...

2023–24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఇన్ఫోసిస్ ఆదాయ వృద్ధి అంచనాలను (గైడెన్స్) కుదించింది. 1.5–2 శాతానికి తగ్గించింది. గత ఫలితాల సందర్భంగా ఆదాయ వృద్ధిని 1–2.5 శాతంగా అంచనా వేసింది.

'ఇన్‌సెమీ' కొనుగోలు...

బెంగళూరుకు చెందిన సెమీకండక్టర్ డిజైన్ సర్వీస్ ప్రొవైడర్ ఇన్‌సెమీ కొనుగోలు ప్రతిపాదనకు ఇన్ఫోసిస్ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. దాదాపు రూ.280 కోట్లకు దీన్ని దక్కించుకోనుంది. 2024 మార్చిలోపు ఈ కొనుగోలు పూర్తయ్యే అవకాశం ఉందని కంపెనీ వెల్లడించింది.

ఇతర ముఖ్యాంశాలు...

- క్యూ3లో ఇన్ఫీ 3.2 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను దక్కించుకుంది. ఇందులో నికరంగా 71% కొత్త డీల్స్ ఉన్నాయి.
- డిసెంబర్ 31 నాటికి కంపెనీలో 3,22,663 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. క్యూ2తో పోలిస్తే (3,28,764) నికరంగా 6,101 మంది (1.8 శాతం) సిబ్బంది తగ్గారు. క్రితం ఏడాది డిసెంబర్ క్వార్టర్ నాటికి ఉన్న 3,46,845 మందితో పోలిస్తే ఉద్యోగుల సంఖ్య 7% తగ్గింది. క్యూ3లో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.9%గా ఉంది. కాగా, ఉద్యోగుల వినియోగాన్ని నిశితంగా పరిశీలిస్తామని సీఎఫ్ఓ నీలాంజన్ రాయ్ చెప్పారు. క్యాంపస్ హైరింగ్ అనేది క్లయింట్ల డిమాండ్‌పై ఆధారపడి ఉంటుందని, ప్రస్తుతానికి దీని అవసరం ఉండకపోవచ్చని పేర్కొన్నారు.
- రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ. 18 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో షేరు ధర 1.62% నష్టంతో రూ.1,495 వద్ద ముగిసింది.

టీసీఎస్.. గుడ్!

- నికర లాభం రూ. 11,735 కోట్లు
- మొత్తం ఆదాయం రూ. 60,853 కోట్లు
- షేరుకి మొత్తం రూ. 27 డివిడెండ్



సాఫ్ట్‌వేర్ సేవలకు సీజనల్‌గా బలహీన త్రైమాసికంగా పేర్కొనే అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లోనూ కంపెనీ ప్రోత్సాహకర పనితీరును ప్రదర్శించింది. డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో, కస్టమర్ కేంద్రంగా అమలు చేసే వ్యూహాలతోపాటు.. పటిష్ట బిజినెస్ మోడల్‌ను ఇది ప్రతిబింబిస్తోంది. వివిధ మార్కెట్ల నుంచి కాంట్రాక్టులు కుదుర్చుకునేందుకు పలు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది భారీ ఆర్డర్ బుక్‌కు కారణమవుతోంది.

– కె. కృతివాసన్, టీసీఎస్ సీఈఓ

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం 8.2 శాతం పుంజుకుని రూ. 11,735 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 4 శాతం వృద్ధితో రూ. 60,583 కోట్లకు చేరింది. భారత్(23.4 శాతం)సహా వర్ధమాన మార్కెట్లలో అమ్మకాలు రెండంకెల స్థాయిలో పుంజుకోవడం ఇందుకు సహకరించింది. ఈ బాటలో ప్రధాన మార్కెట్లలో యూకే 8.1 శాతం, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా 16 శాతం, లాటిన్ అమెరికా 13.2 శాతం చొప్పున వృద్ధి సాధించగా.. ఉత్తర అమెరికా నుంచి 3 శాతం క్షీణత నమోదైంది. ఇక విభాగాలవారీగా చూస్తే ఎనర్జీ, రిసోర్సెస్– యుటిలిటీస్(11.8 శాతం), తయారీ(7 శాతం), లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్(3.1 శాతం) ఆదాయానికి దన్నుగా నిలిచినట్లు కంపెనీ పేర్కొంది. అయితే కీలకమైన బీఎఫ్ఎస్ఐ విభాగంలో 3 శాతం, మీడియా, టెక్నాలజీలలో 5 శాతం చొప్పున ప్రతికూల వృద్ధి నమోదైంది. వాటాదారులకు షేరుకి రూ. 27 చొప్పున డివిడెండును ప్రకటించింది. దీనిలో రూ. 18 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది. ఇందుకు రికార్డ్ డేట్ ఈ నెల19కాగా.. ఫిబ్రవరి 5నుంచి చెల్లించనుంది.

పలు ఒప్పందాలు

క్యూ3లో దిగ్గజ యూకే బ్యాంక్ మోటార్ ఫైనాన్స్, లీజింగ్ బిజినెస్‌లకు ఎండ్‌టు ఎండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ భాగస్వామిగా టీసీఎస్‌ను ఎంపిక చేసుకుంది. ఈ బాటలో ఆస్ట్రేలియా ప్రధాన ఎక్స్ఛేంజీ ఏఎస్ఎక్స్ అధునాతన క్లియరింగ్, సెటిల్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. యూఎస్ హెల్త్‌కేర్ కంపెనీ ప్రస్తుత నిర్వహణ వ్యవస్థను ఆధునీకరించేందుకు క్లౌడ్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ కోసం టీసీఎస్‌తో చేతులు కలిపింది.

ఇతర విశేషాలు...

- నిర్వహణ మార్జిన్లు 0.5 శాతం మెరుగుపడి 25 శాతానికి చేరాయి. నికర మార్జిన్లు 19.4 శాతంగా నమోదయ్యాయి.
- ఆర్డర్ బుక్ 8.1 బిలియన్ డాలర్లను తాకింది.
- డిసెంబర్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 10,669 మంది తగ్గి 6,03,305కు చేరింది. వీరిలో మహిళల సంఖ్య 35.7%.
- కార్యకలాపాల ద్వారా రూ. 11,276 కోట్ల నగదును జమ చేసుకుంది.
- గత 12 నెలల్లో ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 13.3 శాతంగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు బీఎస్ఈలో 0.6 శాతం బలపడి రూ. 3,736 వద్ద ముగిసింది.

సింగపూర్ నుంచి క్షణాల్లో నగదు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) యాప్స్ ద్వారా సింగపూర్ నుంచి భారత్‌లో ఉన్న బ్యాంక్ ఖాతాలకు క్షణాల్లో నగదును పంపుకోవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. భీమ్, ఫోన్‌పే, పేటీఎం యాప్స్‌తోపాటు ఎస్‌బీఐ, యాక్సిస్, ఐసీఐసీఐ, డీబీఎస్ బ్యాంక్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ యాప్స్ ద్వారా ఈ సేవలను పొందొచ్చని ఎన్‌పీసీఐ గురువారం ప్రకటించింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), సింగపూర్‌కు చెందిన పేనౌ మధ్య సీమాంతర అనుసంధానంతో ప్రవాస భారతీయుల నుండి నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి తక్షణ, సురక్షిత, తక్కువ ఖర్చుతో కూడిన చెల్లింపులను స్వీకరించడానికి భారతీయులకు అనుమతిస్తుందని ఎన్‌పీసీఐ తెలిపింది.



గూగుల్‌లో ఉద్యోగాల కోత

హార్డ్‌వేర్, ఇంజినీరింగ్ విభాగాలకు షాక్ • వాయిస్ అసిస్టెంట్ సర్వీసుల్లోనూ లేఆఫ్

శాన్‌ఫ్రాన్సిస్కో: టెక్నాలజీ, డైవర్సిఫైడ్ దిగ్గజం గూగుల్ వ్యయ నియంత్రణల్లో భాగంగా లేఆఫ్ (ఉద్యోగాలలో కోత) అమలు చేస్తోంది. ప్రధానంగా హార్డ్‌వేర్, వాయిస్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ విభాగాలలో వందలకొద్దీ ఉద్యోగులను తొలగిస్తోంది. అధిక ప్రాధాన్యమున్న విభాగాలలో పెట్టుబడులు చేపట్టనున్నట్లు గూగుల్ పేర్కొంది. భారీ అవకాశాలు ముందున్నట్లు పేర్కొంది. కొన్ని టీములలో వ్యవస్థాగత మార్పులు చేపడుతున్నట్లు తెలియజేసింది. వెరసి కొన్ని వందల ఉద్యోగాలకు కోత పడుతున్నట్లు ప్రధానంగా ఆగ్మెంటెడ్ రియాల్టీ(ఏఆర్) హార్డ్‌వేర్ టీముల్లో ఈ ప్రభావం ఉండనున్నట్లు వివరించింది. ఏడాది క్రితం మొత్తం సిబ్బందిలో 6 శాతంవరకూ(సుమారు 12,000 మంది ఉద్యోగులు) తొలగించనున్నట్లు గూగుల్ పేర్కొన్న విషయం విదితమే. గూగుల్‌తోపాటు.. మాతృ సంస్థ అల్ఫాబెట్ వ్యయాలను తగ్గించుకునే బాటలో ఉపాధి కల్పనకు షాకిస్తోంది.



ఇతర కంపెనీలు సైతం

మ్యూజిక్ స్ట్రీమింగ్ కంపెనీ స్పాటిఫై ప్రపంచవ్యాప్త సిబ్బందిలో 17 శాతం మందిని తొలగించనున్నట్లు 2023 డిసెంబర్‌లో వెల్లడించింది. ఇక ఈ వారం మొదట్లో ప్రైమ్ వీడియో, స్టుడియో విభాగాల నుంచి అమెజాన్ వందలకొద్దీ ఉద్యోగులను తొలగించింది. లైవ్‌స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ ట్విచ్ నుంచి సైతం 500 మంది ఉద్యోగులను తీసేసింది. 2023 జనవరిలో 18,000 మందిని విధుల నుంచి తప్పించే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలిపిన అమెజాన్ మార్చిలో 9,000 మందిని తొలగించనున్నట్లు వెల్లడించింది.

ప్రతిఘటిస్తాం..

అవసరం లేకపోయినా అల్ఫాబెట్ మరోసారి సిబ్బంది తొలగింపు చేపడుతున్నట్లు వర్కర్స్ యూనియన్ ఎక్స్(ట్విట్టర్)లో పేర్కొంది. ప్రతీ త్రైమాసికంలోనూ వందల కోట్ల డాలర్లను ఆర్జిస్తున్న కంపెనీ సహచర ఉద్యోగులను తొలగించడాన్ని కొనసాగించేందుకు వీలులేదని హెచ్చరించారు. ఉద్యోగులకు రక్షణ లభించేవరకూ పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. కాగా.. ఇన్వెస్టర్లకు భరోసానిస్తూ గతేడాది మరో టెక్నాలజీ దిగ్గజం మెటా(ఫేస్‌బుక్ మాతృ సంస్థ) సైతం 20,000 ఉద్యోగాలలో కోత పెట్టిన విషయం విదితమే. అయితే మెటా షేరు 2023లో ఏకంగా 178 శాతం దూసుకెళ్లడం గమనార్హం!

స్వల్ప లాభాల ముగింపు

క్యూ3 ఫలితాలు, ద్రవ్యోల్బణం డేటా వెల్లడికి ముందు అప్రమత్తత

ముంబై: దేశీయ ఐటీ దిగ్గజ సంస్థలు టీసీఎస్, ఇన్ఫోసిస్ క్యూ3 ఆర్థిక ఫలితాలు, అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడి(గురువారం రాత్రి), వీక్లీ ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా ఇంట్రాడే ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్‌లో 456 పాయింట్లు పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 63 పాయింట్లు పెరిగి 71,721 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో నిఫ్టీ 21,594 – 21,726 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి 28 పాయింట్లు బలపడి 21,647 వద్ద నిలిచింది. ఇంధన, ఆయిల్అండ్‌గ్యాస్, కన్జూమర్, వినిమయ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్లకు మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.79%, 0.66% చొప్పున లాభపడ్డాయి.



- రిలయన్స్ షేరు జోరు రెండోరోజూ కొనసాగింది. బీఎస్ఈలో 2.58% లాభపడి రూ.2718 వద్ద ముగిసింది. ట్రేడింగ్లో 3% పెరిగి రూ.2725 వద్ద తాజా రికార్డు గరిష్టాన్ని నమోదు చేసింది.
- ఇటీవల ఐటీ సోదాల్లో రూ.1,000 కోట్ల 'నల్లధన లావాదేవీలు' బయటపడటంతో పాలీక్యాబ్ ఇండియా షేరు 21% క్షీణించి రూ.3877 వద్ద స్థిరపడింది.
- మాల్దీవుల వివాదంతో ఈజీమైట్రిప్ షేరు రూ.17% లాభపడి రూ.52 వద్ద ముగిసింది.
- చివరి రోజు నాటికి జ్యోతీ సీఎన్‌సీ ఆటోమేషన్ ఐపీఓకు 38.53 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ 1.75 కోట్ల షేర్లు జారీ చేయగా, 67.58 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

సినిమా



• 'అన్నపూర్ణి'లో నయనతార

అన్నపూర్ణి ఆగింది

బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అన్నపూరణికి దేశంలోనే నంబర్ వన్ చెఫ్ కావాలన్నది ఆశయం. తన ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి మాంసాహార వంటలు చేసేందుకు సిద్ధం అవుతుంది. అది మాత్రమే కాదు.. ముస్లిమ్ యువకుడితో ప్రేమలో పడుతుంది. నయనతార టైటిల్ రోల్‌లో నటించిన 'అన్నపూరణి' చిత్రం ప్రధానాంశం ఇది. 'ది గాడెస్ ఆఫ్ ఫుడ్' అనేది ఉపశీర్షిక. నీలేష్ కృష్ణ దర్శకత్వంలో జతిన్ సేథీ, ఆర్. రవీంద్రన్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 1న థియేటర్లలో విడుదలై, అంతగా ఆకట్టుకోలేకపోయింది. అయితే ఓటీటీ ప్రేక్షకులను కొంత ఆకట్టుకోగలిగింది. ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. కానీ ఓ బ్రాహ్మణ యువతి మాంసాహారం వండటం, ముస్లిమ్ యువకుడితో ప్రేమలో పడటం అనే కథాంశం వివాదమైంది. పైగా రాముడు కూడా మాంసాహారం తిన్నాడన్నట్లు, వాల్మీకి అయోధ్య కాండలో ఉందన్నట్లు ఓ డైలాగ్ కూడా ఉంది. ఓ దేవత (అన్నపూర్ణ) మీద టైటిల్ పెట్టి ఇలాంటి సినిమా తీయడం తగదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దాంతో ఈ చిత్రాన్ని బ్యాన్ చేయాలని కొందరు బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ మొదలుపెట్టారు. అలాగే మహారాష్ట్రకు చెందిన శివసేన మాజీ నేత రమేశ్ సోలంకి ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ పై తగిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నయనతారపై కూడా కేసు నమోదైంది. వివాదం పెద్దదవుతుండటంతో ఈ సినిమా స్ట్రీమింగ్‌ను నిలిపివేస్తున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. ఆ విధంగా ఓటీటీలో 'అన్నపూర్ణి' ఆట ఆగింది.

వివేకానందగారి బయోపిక్‌కి స్క్రిప్ట్ కుదరడం లేదు. నేను, నాని ఓ సినిమా చేయబోతున్నామా అంటే.. నానీతోనే కాదు.. నేను అందరితో కలిసి సినిమాలు చేయాలనుకుంటున్నాను. నా తర్వాతి సినిమా కోసం మూడు కథలు విన్నాను. తర్వలో చెబుతాను.



కొన్ని వాటంతటఅవే కుదురుతాయి

– వెంకటేశ్

"నా 75వ సినిమా కాబట్టి 'సైంధవ్' నాకు స్పెషల్ ఫిల్మ్ అనేం కాదు. నా ప్రతి సినిమా నాకు స్పెషలే. నిర్మాతలు సినిమాకు డబ్బులు ఖర్చు పెడుతున్నారు. ఓ నటుడిగా నేను పారితోషికం తీసుకుంటున్నాను. సో.. నటుడిగా నేను వంద శాతం నిజాయితీగా కష్టపడాలి. ప్రతి సినిమాకు ఇదే చేస్తున్నాను" అని వెంకటేశ్ అన్నారు. వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సైంధవ్'. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 75వ చిత్రం. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించారు. ఈ చిత్రంలో ఆర్య, నవాజుద్దీన్ సిద్ధిఖీ, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, చైల్డ్ ఆర్టిస్టు సారా కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం రేపు (శనివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెంకటేశ్ చెప్పిన విశేషాలు.

- నా కెరీర్‌లో నేను చేసిన చాలా సినిమాలు సంక్రాంతికి విడుదలయ్యాయి. కొన్ని సినిమాలు ఆడాయి.. కొన్ని నిరాశ పరచాయి. ఈ సంక్రాంతికి 'సైంధవ్' వస్తోంది. ఓ మంచి సినిమా చేశాం. ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాం. అలాగే ఈ పండగకి 'సైంధవ్'తో పాటు వస్తున్న మిగతా సినిమాలు 'నా సామిరంగ', 'గుంటూరు కారం', 'హను–మాన్' కూడా విజయం సాధించాలి. సినిమా బాగుంటే ప్రేక్షకులు చూస్తారు. అయినా ఓ వారం పోతే సంక్రాంతి సినిమాల గురించి ఎవరూ మాట్లాడుకోరు.
- 'సైంధవ్' కథను శైలేష్ చెప్పినప్పుడు బాగుందనిపించింది. ఓ యాక్టర్‌గా నా పని నేను చేశాను. దర్శకుడిగా తన పని తాను చేశాడు. చైల్డ్ ఆర్టిస్టులతో కలిసి నటించడం నాకు సరదాగా ఉంటుంది. 'కలిసుందాం..రా', 'తులసి' వంటి సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్టులతో కలిసి చేశాను. 'సైంధవ్'లో సారాతో చేశాను. సారా బాగా నటించింది. నవాజుద్దీన్‌తో కలిసి నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్. 'సైంధవ్'లో కథ ముందుకు కదులుతూనే ఎమోషన్స్, యాక్షన్ సీన్స్ ఉంటాయి. ముఖ్యంగా క్లైమాక్స్ బాగుంటుంది.
- ప్రత్యేకంగా యాక్షన్ సినిమాలు చేయాలని చేయడం లేదు. 'బొబ్బిలిరాజా' సినిమా సమయంలో కొన్ని గాయాలయ్యాయి. ఆ సమయంలో కొన్ని ఫ్యామిలీ సినిమాలు చేశాను. ప్రేక్షకులు ఆదరించారు. అప్పుడప్పుడు యాక్షన్ సినిమాలూ చేశాను. ఇప్పుడు 'సైంధవ్' చేశాను. ఇదంతా జర్నీలో ఓ భాగం. స్పిరిట్యువల్‌గా చెప్పాలంటే.. మనకి జీవితంలో కొంత అదృష్టం కూడా ఉంటుంది. కొన్ని కాంబినేషన్స్, సినిమాలు వాటంతట అవే కుదురుతాయి. కొన్నిసార్లు ఓ సినిమా ప్రయాణంలో అది అంతగా ఆడదేమో అనిపిస్తుంది. మంచి సబ్జెక్ట్ లేకపోతే యాక్టర్స్‌గా మేం ఏమీ చేయలేం. కథ కుదరకపోతే పెద్ద కాంబినేషన్స్‌తో కూడిన సినిమాలు కూడా నష్టపోయిన రోజులు ఉన్నాయి.
- 75వ సినిమా, 100వ సినిమా అనేవి నా దృష్టిలో నంబర్స్ మాత్రమే. అలాగే రికార్డ్స్, కలెక్షన్స్ వంటి అంశాల జోలికి వెళ్లను. నా కెరీర్ ఆరంభంలో 98 రోజులు ఆడిన సినిమాలను సడన్‌గా ఆపేసిన ఘటనలు ఉన్నాయి. నేను అంతగా ఏం ఫీల్ కాలేదు. అది నిర్మాతలు, పంపిణీదారుల నిర్ణయం కదా అని అనుకునేవాడిని. ఈ విషయంలో నా అభిమానులు మొదట్లో కాస్త అసహనంగా ఉండేవారు. కానీ నా స్టైల్‌ను వారు అర్థం చేసుకున్నారు. అందుకు వారికి థ్యాంక్స్
- నేను డిఫరెంట్‌గా చేసిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్ ఇంపాక్ట్ నా సినిమాలపై ఉండదనే అనుకుంటున్నాను. అభిప్రాయాలు మారుతూ ఉంటాయి. యాక్టర్‌గా మనం నిజాయితీగా చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. నెగటివ్ ఫీడ్‌బ్యాక్ ఉండొచ్చు. కానీ నేను తీసుకోను. పాజిటివ్‌గానే ఉంటాను. అప్పుడే మన జీవితంలో మనం సంతోషంగా ఉండగలం. అలాగే నటుడిగా నా సుదీర్ఘమైన కెరీర్‌లో ఎందుకు వివాదాలు లేవో నాకే తెలియదు. నాకు తెలిస్తే అందరికీ చెబుతాను (నవ్వుతూ). అయితే నా స్కూల్, కాలేజీ, ఇప్పుడు ఇండస్ట్రీ... ఇలా ఎప్పుడైనా నా తోటి వారు నావల్ల అసౌకర్యంగా ఫీల్ కాకూడదని భావిస్తుంటాను.



రాజమౌళిగారు చేస్తానన్నారని నేను డ్రాప్ అయ్యాను

– ప్రశాంత్ వర్మ

"ఒక ఫిల్మ్ మేకర్‌గా క్వాలిటీ ప్రొడక్ట్ ఇవ్వడంపైనే నా ఏకాగ్రత ఉంటుంది. సినిమా విడుదల, థియేటర్ల కేటాయింపులు వంటివి నిర్మాతలకు చెందినవి. ఈ సినిమా సక్సెస్ అయితే రాబోయే పదేళ్లల్లో తెలుగు ప్రేక్షకులు గర్వపడే సినిమాలు చేసేలా మేం కొన్ని ప్లాన్ చేసి ఉన్నాం. కానీ ఇప్పుడు ఇదంతా (థియేటర్స్ గురించిన వివాదం గురించి పరోక్షంగా స్పందిస్తూ..) జరుగుతోంది. తప్పు జరుగుతున్నప్పుడు మాట్లాడకపోవడం అనేది ఇంకా పెద్ద తప్పు అన్నట్లుగా ఓ సామెత ఉంది. అందుకే కొన్ని విషయాలపై స్పందిస్తున్నాను" అన్నారు ప్రశాంత్ వర్మ. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హను-మాన్'. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ప్రశాంత్ వర్మ చెప్పిన విశేషాలు.

- 'హను–మాన్' సినిమా కోసం తేజ సజ్జా కొత్తగా మేకోవర్ అయ్యాడు. ఇక యాక్టింగ్ గురించి నేను అతనికి నేర్పించాల్సింది ఏమీ లేదు. పైగా సెట్స్‌లో ఫలానా సన్నివేశంలో ఇలా యాక్ట్ చెయ్ అని నటించి, చూపించడం నాకు రాదు. 'హను–మాన్'పై నా కన్నా ఎక్కువగా తేజ ఆశలు పెట్టుకున్నట్లు ఉన్నాడు. ఈ సినిమా కోసం చాలా సమయం కేటాయించాడు. కొత్త సినిమాలేవీ చేయలేదు. రీసెంట్‌గా ఓ సినిమా ఒప్పుకున్నాడు. సినిమా మొదలైన ఇరవై నిమిషాలు హీరో క్యారెక్టర్ సింపుల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే హీరో పాత్రకు సూపర్ పవర్స్ వస్తాయో అప్పట్నుంచి కథ మరింత ఆసక్తిగా ముందుకు వెళ్తుంది.
- పురాణాలు, ఇతిహాసాల కథలు, హనుమంతునిపై వచ్చిన కొన్ని ఆర్టికల్స్, ప్రచారంలో ఉన్న కొన్ని అంశాల ఆధారంగా ఈ సినిమా కథ రెడీ చేసుకున్నాను. తెలుగు సినిమా స్టైల్‌ని పోలి ఉండే సూపర్ హీరో సినిమా 'హను–మాన్'. 'బ్యాట్‌మేన్' సినిమాను రాజమౌళిగారు తీస్తే ఎలా ఉంటుందో అలా 'హను–మాన్' ఉంటుంది. 'కేజీఎఫ్'లో యశ్‌ను ఎలివేట్ చేసినట్లుగా 'హను–మాన్' సినిమా ఉంటుంది. నిర్మాత నిరంజన్ రెడ్డిగారు నాకన్నా పాజిటివ్ పర్సన్. మేం సినిమా కోసం ఓ ఆలోచన చెబితే, దానికి ఎక్స్‌టెన్షన్ లెవల్లో ఆయన ఆలోచించేవారు. దాశరథి శివేంద్రగారు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు.
- మేం అనుకున్నదాని కన్నా 'హను–మాన్' బడ్జెట్ మూడింతలు పెరిగింది. కానీ పదింతల క్వాలిటీ సినిమాను ఆడియన్స్ చూస్తారు. ఇక ఈ సినిమాను త్రీడీలో రిలీజ్ చేయాలంటే మరికొంత బడ్జెట్ కావాలి. అందుకే త్రీడీలో విడుదల చేయడం లేదు. అయితే రిలీజ్ తర్వాత మంచి స్పందన వస్తే, భవిష్యత్‌లో రీ–రిలీజ్‌లో త్రీడీలో కూడా రిలీజ్ చేస్తాం. ఓ నెల గ్యాప్ తర్వాత విదేశీ భాషల్లో 'హను–మాన్'ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నాం.
- పురాణాలు, ఇతిహాసాల ఆధారంగా సినిమాలు చేయాలనే ఆసక్తి ఉంది. మహాభారతంపై ఓ సినిమా చేయాలనుకున్నాను. కానీ రాజమౌళిగారు చేయాలనుకుంటున్నారని తెలిసి డ్రాప్ అయ్యాను.

మణిరత్నం థగ్ లైఫ్‌లో...

హీరో కమల్‌హాసన్–దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో 'నాయగన్'–1987 ('నాయకుడు') తర్వాత 37 ఏళ్లకు రూపొందనున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'పై అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో త్రిష, 'జయం' రవి, దుల్కర్ సల్మాన్ వంటి స్టార్స్ ఖరారయ్యారు. తాజాగా ఐశ్వర్యా లక్ష్మి ఈ జాబితాలో చేరారు. ఈ చిత్రంలో ఆమె నటించనున్నట్లు గురువారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ఇక మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్'లో ఐశ్వర్యా లక్ష్మి కీలక పాత్ర చేసిన విషయం తెలిసిందే. మరో విషయం ఏంటంటే... 'థగ్ లైఫ్'లోకి ఐశ్వర్యా రాయ్ ఎంట్రీ ఇవ్వనున్నారనే టాక్ వినిపిస్తోంది. మణిరత్నం దర్శకత్వంలో 'ఇద్దరు, గురు, రావణ్, పొన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాల్లో ఐశ్వర్యా రాయ్ నటించారు. మరి... 'థగ్ లైఫ్'లో ఆమె నటించనున్నది నిజమేనా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే. మణిరత్నం, కమల్‌హాసన్, మహేంద్రన్, శివ అనంత్ నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కావచ్చాయని, ఈ నెలాఖరులో షూటింగ్ ఆరంభమయ్యే చాన్స్ ఉందని సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.



• ఐశ్వర్యా లక్ష్మి

జీవితం అనేది యుద్ధం

సూర్య అయ్యల సోమయాజుల హీరోగా, మిహిరామ్ వైనతేయ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ర్యాపిడ్ యాక్షన్ మిషన్'. ఇందులో ధన్యా బాలకృష్ణ హీరోయిన్. దీపికాంజలి వడ్లమాని నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను డైరెక్టర్ శైలేష్ కొలను విడుదల చేశారు. 'జీవితం అనేది ఒక యుద్ధం.. చుట్టూ మనుషులు ఉన్నా లేకపోయినా.. నీ పోరాటం నువ్వే చేయాలి.. ఆ పోరాటంలో నా రామ్ గెలుస్తాడని నాకు నమ్మకం ఉంది' అనే డైలాగ్స్‌తో ట్రైలర్ సాగుతుంది. 'ఈ 60 ఏళ్ల స్వాతంత్ర్యం ప్రజలది కాదు... అధికారులది కాదు... రాజకీయ నాయకులది మాత్రమే... మీరు అప్పుడూ బానిసలే... ఇప్పుడూ బానిసలే... ఎప్పుడూ బానిసలే' అంటూ 'శుభలేఖ' సుధాకర్ చెప్పిన డైలాగ్ కూడా ఉంది. ''దేశభక్తి నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.




• సూర్య, ధన్యా బాలకృష్ణ



సుందర గుంటూరు

వందల కోట్లతో స్వచ్ఛ సర్వేక్షణ్ పనులు



- నగర సుందరీకరణపై దృష్టి
- రంగు రంగుల చిత్రాలతో ఆకర్షణీయంగా కుడ్యాలు, డివైడర్లు
- యూజీడీ పేరుతో కోట్లు దోచుకున్న నాటి ప్రభుత్వం
- అన్నీ సరిదిద్ది రోడ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్తకళ
- నగర ప్రజల ఆరోగ్యకర వాతావరణానికి
- పార్కులు, కూడళ్లు అభివృద్ధి

దాళా రమేష్ బాబు, సాక్షి ప్రతినిధి, గుంటూరు

ఒకప్పుడు.. ఎవరైనా గుం'టూరు'కు వెళ్లాలంటే భయపడేవారు. కారణం అక్కడి రోడ్లు. నడవడానికే భయంకరంగా ఉండేవి. చీకటిపడితే ఏ గోతిలో పడతామో తెలియదు. ముక్కు మూసుకోకుండా నగరంలో తిరగడమూ కష్టమే. గత ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రెయినేజి పేరుతో సుమారు 120 కిలోమీటర్లు అస్తవ్యస్తంగా తవ్వేసి కొత్త ప్రభుత్వానికి అప్పగించింది. ఛాలెంజగా తీసుకున్న వైసీపీ ప్రభుత్వం దాని ప్రాథమిక రిపేరుకే రూ50 కోట్లు ఖర్చు చేసి ప్రజలకు ఊరట కల్పించింది. ఆ తరువాత గుంటూరు అభివృద్ధిపై దృష్టి పెట్టింది. నూతన సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు వంటి మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో వందల కోట్ల రూపాయలతో 537 పనులు ప్రారంభించింది. ఐఏఎస్‌లను మున్సిపల్ కమిషనర్లుగా తీసుకు వచ్చి అభివృద్ధి పట్టాలు ఎక్కించింది.

రూ. 163 కోట్లతో పీవీకే నాయుడు మార్కెట్

నగరం నడిబొడ్డున 1.92 ఎకరాల విస్తీర్ణంలో అధునాతన హంగులతో నగరానికే ఐకానిక్ బిల్డింగ్‌గా గ్రౌండ్, 8 అంతస్తులతో పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణానికి తుది దశలో టెండర్లు. దీని కోసం రూ.163 కోట్లు ఖర్చు.

ఆహ్లాదానికి పెద్దపీట

- గాంధీపార్కు పునరుద్ధరణకు రూ.4.50 కోట్లు.
- నగరంలో 22 పార్కుల అభివృద్ధికి రూ.9 కోట్లు.
- నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు, రిజర్వ్ సైట్‌ల గుర్తింపు.
- వాటిలో ప్లే సెంటర్లు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధి.
- నగరంలోని 15 ఐలాండ్ల అభివృద్ధికి రూ.2.56 కోట్లతో అంచనాలు. ఇందులో 8 సెంటర్‌లు ఇప్పటికే అందుబాటులోకి.



- జగనన్న హరిత వనాలలో భాగంగా 42 కిలోమీటర్ల పచ్చదనానికి రూ.6.24 కోట్ల వెచ్చింపు.
- స్వచ్ఛ సర్వేక్షణ్ పథకంలో నగరాన్ని సుందరీకరణకు రూ.48 లక్షలు ఖర్చు. అద్భుత పనితీరుతో జాతీయ స్థాయి ర్యాంకు కైవశం.


జగనన్న కాలనీలతో కొత్త రూపు

అర్బన్ పరిధిలోని పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో ఏటుకూరు, కొర్నెపాడు, పేరేచర్ల, పొత్తూరు, బుడంపాడు, దామరపల్లి, లాం ప్రాంతాల్లో 1277 ఎకరాల్లో 60 వేల ప్లాట్స్‌తో జగనన్న కాలనీలు.

గుంటూరు నగరంలో పేరేచర్ల, ఏటుకూరు వద్ద భారీ లేఅవుట్లు. 29.887 మందికి ఇళ్లు మంజూరు.

తొలి విడతగా 28 వేల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు. అందులో ఇప్పటికే 7 వేలు పూర్తి.

ఈ ఏడు లే-అవుట్స్‌లో జంగిల్ క్లియరెన్స్ రూ.16.70 లక్షలు. అంతర్గత రోడ్లకు రూ.7.94 కోట్లు. అప్రోచ్ రోడ్లకు రూ.16.95 లక్షలు. సీసీ కల్వర్టులకు రూ.1.48 కోట్లు. మేజర్ డ్రెయిన్లకు రూ.21 లక్షలు. ఎల్ఈడీ లైట్లకు రూ.4.80 లక్షల ఖర్చు.



సమగ్రాభివృద్ధి దిశగా...



గుంటూరు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాం. రోడ్లు, డ్రెయిన్లు, డివైడర్లు, పార్కులు అభివృద్ధి చేస్తున్నాం. నగరంలోకి రాగానే ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కూడా జాతీయస్థాయిలో ర్యాంకు తీసుకురాగలిగాం. నగరాన్ని హరిత నగరంగా, శుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం.

– కీర్తి చేకూరి, కమిషనర్, నగరపాలక సంస్థ, గుంటూరు

పార్కుల అభివృద్ధి చాలా బాగుంది



గుంటూరు నగరంలో పార్కులను అభివృద్ధి చేయడం ఎంతో బాగుంది. గాంధీ పార్కును కూడా ఆధునికీకరించి పునః ప్రారంభించడంతో పిల్లలను పార్కుకు తీసుకు వెళ్తున్నాను. పార్కులో చాలా రకాల ఆట వస్తువులు పిల్లలు ఆడుకునేందుకు అనువుగా ఉన్నాయి.

– పూర్ణిమ (గృహిణి), కొరిటిపాడు

అభివృద్ధిని చూస్తున్నాం



ప్రస్తుతం గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు బాగా జరుగుతున్నాయి. రోడ్లు లేని చోట రోడ్లు వేస్తున్నారు. డివైడర్లలో మొక్కలు ఏర్పాటుచేసి పచ్చదనం సమకూర్చడం బాగుంది. గతంలో ఎప్పుడూ ఇటువంటి అభివృద్ధి చూడలేదు.

– సిహెచ్. విజయ్‌కుమార్(పాత గుంటూరు)

యూజీడీ పేరుతో తవ్వేశారు..



నల్లపాడు రైల్వేస్టేషన్‌కి వెళ్లే రోడ్డు ఏళ్ల తరబడి గోతులతో ఉండేది. యూజీడీ పేరుతో రోడ్డు అంతా తవ్వి కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా చేస్తే ప్రస్తుతం తారు రోడ్డు వేయడంతో ఇబ్బంది లేకుండా ఉంది. ఎప్పటి నుండో ఉన్న సమస్య పరిష్కారం చేసిన అధికారులకు, నాయకులకు ధన్యవాదాలు.

–గేరా మణెమ్మ, శ్యామలానగర్ ఎక్స్‌టెన్షన్

అభివృద్ధి పథంలో జీజీహెచ్



- రూ. 5కోట్లతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో నిర్మాణ పనులు.
- రూ. 35 లక్షలతో ఎస్ఎన్‌సీయూ క్లినిక్ నిర్మాణం.
- రూ.25 కోట్లతో పెట్‌సిటీ స్కాన్, రూ.4 కోట్లతో సీటీ స్కాన్ ఏర్పాటు.
- సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం రూ. 7.5 కోట్లు మంజూరు.
- రూ.3.5 కోట్లతో ప్రహరీ నిర్మాణం.
- రూ.40 లక్షలతో సీఆర్మ్ వైద్య పరికరం, రూ. 30 లక్షలతో ఏబీజీ వైద్య పరికరాలు, రూ.25 లక్షలతో ఈఎన్‌టీ మైక్రోస్కోప్, రూ. 40 లక్షలతో ఆపరేషన్ థియేటర్ లైట్లు, రూ.12 కోట్లతో లీనియర్ యాక్సిలేటర్ క్యాన్సర్ వైద్య పరికరాల కొనుగోలు.
- రూ. 40 కోట్లతో గుంటూరు వైద్య కళాశాల వసతి గృహాల్లో భవన నిర్మాణాలు.
- రూ.19.70 కోట్లతో నగరంలో 16 వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం.



రోడ్లకు చికిత్స

నగరంలోని ప్రధాన రోడ్లతో పాటు దెబ్బతిన్న అంతర్గత రోడ్లను పునరుద్ధరించుకుంటూ వస్తున్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో రూ.491.79 కోట్లతో తూర్పులో 792, పశ్చిమలో 918, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 150 అభివృద్ధి పనులు చేశారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు తొలివిడతగా నందివెలుగు రోడ్డు, కుగ్లర్ హాస్పిటల్ రోడ్, పెదపలకలూరు రోడ్, ఏటీ అగ్రహారం, డొంక రోడ్లను విస్తరించారు.





దాహం తీరింది

- తాగునీటి ఎద్దడి సమస్య శాశ్వత పరిష్కారానికి సంజీవయ్యనగర్ వద్ద ట్రాక్ క్రాసింగ్ పూర్తి చేసి ఇంటర్ కనెక్షన్ ఏర్పాటు.
- నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి పశ్చిమ నియోజకవర్గానికి 800 డయాపైప్‌లైన్ అందుబాటులోకి.
- గోరంట్ల కొండ మీద రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి రూ.33 కోట్ల ఖర్చు. విలీన గ్రామాలకు ఇది ఊరట.



ఉద్యోగులకు బాబు మార్క్ దగా

- డిపార్ట్‌మెంటల్ టెస్టుల్లో మైనస్ మార్కుల విధానం తెచ్చిన నాటి సర్కార్
- ప్రొబేషన్, ప్రమోషన్, ఇంక్రిమెంట్లకు నోచుకోకుండా చేసిన చంద్రబాబు
- టెస్ట్ పాసయ్యేవారి సంఖ్య 4 శాతానికి తగ్గిపోయిన వైనం
- జీవో నం.101తో మైనస్ మార్కులను రద్దు చేసిన జగన్ ప్రభుత్వం
- ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ టెస్టుల్లో ఇప్పుడు 85 శాతంపైగా ఉత్తీర్ణత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు పదోన్నతులు, ఇంక్రిమెంట్ల కోసం రాసే డిపార్ట్‌మెంటల్ టెస్టుల్లో వారు పాసవకుండా గత చంద్రబాబు సర్కారు అడ్డుకుంది. అందుకోసం ప్రత్యేకంగా జీవోను సైతం జారీ చేసింది. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చే దాకా ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించిన అన్ని డిపార్ట్‌మెంటల్ టెస్టుల్లోనూ గరిష్టంగా 4 నుంచి 6 శాతం మాత్రమే పాసయ్యారంటే ప్రభుత్వ ఉద్యోగులపై చంద్రబాబుకున్న ప్రేమ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఏపీపీఎస్సీ ఏటా రెండుసార్లు డిపార్ట్‌మెంటల్ టెస్టులు నిర్వహిస్తుంది. సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసిన పోస్టుల్లో చేరిన అభ్యర్థులు ప్రొబేషన్‌లో ఉంటారు. వారి ప్రొబేషన్ పూర్తవ్వాలంటే సర్వీస్ టెస్ట్ పాసవ్వాలి. ఫెయిలైతే వారు ప్రొబేషన్‌లోనే కొనసాగుతారు. టెస్ట్ పాసైనవారు మాత్రం సీనియారిటీలోకి వెళ్లిపోతారు. అలాగే ఇతర డిపార్ట్‌మెంట్లలో పదోన్నతులు, ఇంక్రిమెంట్లు పొందేందుకు కూడా డిపార్ట్‌మెంటల్ టెస్టు పాసవ్వాల్సి ఉంటుంది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు సర్వీసులో సీనియారిటీలోనూ ముందుంటారు.

జీవో నం.101తో ఉద్యోగులకు మేలు

ప్రభుత్వ ఉద్యోగుల వయసు రీత్యా గతంలో డిపార్ట్‌మెంటల్ టెస్టులను ఆఫ్‌లైన్‌లో డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహించేవారు. ఉద్యోగులు నిబంధనల ప్రకారం పుస్తకాలను చదివి, సరైన జవాబులను రాసేవారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ టెస్టును మల్టిపుల్ చాయిస్ విధానంలో మార్చి ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టింది. మైనస్ మార్కు విధానాన్ని తీసుకొచ్చి ప్రతి తప్పు సమాధానానికి 1/3 (0.33 శాతం) మార్కులు కోత విధించారు. దీంతో పెద్ద వయసులో ఉన్న ఉద్యోగులు ఆన్‌లైన్, మల్టిపుల్ చాయిస్ విధానంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని ఈ విధానంతో 2017–19 సంవత్సరాల మధ్య తాము ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు కోల్పోతున్నామని, నెగిటివ్ మార్కుల విధానం రద్దు చేయాలని ఉద్యోగ సంఘాలు కోరాయి. అయినా నాటి ప్రభుత్వం పట్టించుకున్నది లేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో మైనస్ మార్కులను తొలగించాలని అభ్యర్థిస్తూ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు సర్వీస్ కమిషన్‌కు అనేక విజ్ఞప్తులు అందజేశాయి. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసిన అనంతరం ఉద్యోగులకు మేలు చేసేందుకు మైనస్ మార్కుల విధానం రద్దు చేస్తూ జీవో నం.101 జారీ చేసింది. దీంతో ఇప్పుడు డిపార్ట్‌మెంటల్ టెస్టుల్లో 85 శాతం పైగా ఉత్తీర్ణత సాధించి, పదోన్నతులు, ఇంక్రిమెంట్లు పొందుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యంగా..

ప్రభుత్వ విభాగాల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రోత్సహించేందుకు చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారు. వారికి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు రాకుండా అడ్డుకునేందుకు 2017లో జీవో నం.55ను విడుదల చేసి డిపార్ట్‌మెంటల్ టెస్టుల్లో 'మైనస్ మార్కు'లను అమల్లోకి తెచ్చారు. దాంతో గతంలో ఏటా సర్వీస్ కమిషన్ నిర్వహించే ఈ పరీక్షల్లో 60 శాతం మంది ఉత్తీర్ణులైతే.. జీవో నం.55 వచ్చాక ఆ సంఖ్య 4–6 శాతం మించలేదు. కొన్ని విభాగాల డిపార్ట్‌మెంటల్ టెస్టుల్లో ఒక్క శాతం కూడా పాసవలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ జీవోతో దాదాపు ఉద్యోగులు మూడేళ్లపాటు తమ పదోన్నతులు, ఇంక్రిమెంట్ అవకాశాలను కోల్పోయారంటే ఆశ్చర్యం కలుగుతుంది.

'మాచ్‌ఖండ్'లో రికార్డుస్థాయి విద్యుత్ ఉత్పత్తి

- గాడిలో పడిన జలవిద్యుత్ కేంద్రం
- 25 ఏళ్ల తర్వాత 88.627 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- ఉద్యోగుల శ్రమకు దక్కిన ఫలితం



ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో రికార్డు స్థాయిలో 88.627 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. తరచూ జనరేటర్ల మరమ్మతులతో సతమతమయ్యే ఉద్యోగులు, ఏడాది కాలంగా తీవ్రంగా శ్రమించి ఈ ప్రాజెక్టును గాడిలో పెట్టారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యేలా ఈ ప్రాజెక్టులో ఆరు జనరేటర్లు ఉన్నాయి. మూడు జనరేటర్ల నుంచి 51 మెగావాట్లు, మరో మూడు జనరేటర్ల నుంచి 118 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. 66 ఏళ్లుగా ఈ విద్యుత్ కేంద్రం నుంచి ఉత్పత్తి జరుగుతున్నా, పురాతన యంత్రాలు కావడంతో పూర్తి స్థాయి ఉత్పత్తి జరగలేదు. ఏడాది పొడవునా విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే నీరు డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో ఉన్నప్పటికీ, తరచూ జనరేటర్ల మరమ్మతులతో పూర్తిస్థాయి ఉత్పత్తి జరగలేదు. ఈ సమస్యలతో స్టేషన్ ఐదుసార్లు షట్‌డౌన్ అయ్యేసరికి దీనిపై ప్రాజెక్టు ఎస్ఈ, డీఈఈలు, ఏఈఈలు దృష్టి పెట్టారు. ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో తీవ్రంగా శ్రమించి ప్రాజెక్టును గాడిలో పెట్టారు. దీని ఫలితమే గతేడాది డిసెంబరులో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగింది. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగింది. గత ఏడాది డిసెంబర్‌లో 88.627 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి జరిగింది. గడచిన 25 ఏళ్లలో ఇదే అత్యధికం. గత ఏడాది జూన్ నెలలో 79.42 మిలియన్ యూనిట్లు, జూలైలో 84.75, ఆగస్టులో 86.275, సెప్టెంబర్‌లో 69.54, అక్టోబర్‌లో 86.58, నవంబర్‌లో 82.62, డిసెంబర్‌లో 88.627 మిలియన్ యూనిట్లు చొప్పున విద్యుత్ ఉత్పత్తి జరిగింది.

శతశాతం ఉత్పాదన

విద్యుత్ ఉత్పత్తిలో మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం పని తీరు ఎంతో ప్రత్యేకం. చాలా రోజుల తర్వాత పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పాదన శత శాతం జరుగుతోంది. నాగార్జునసాగర్, సీలేరు విద్యుత్ కేంద్రాలకు దీటుగా ఉత్పాదకత ఉంటుంది. డిసెంబర్‌లో రికార్డు స్థాయి ఉత్పత్తి జరగడం సిబ్బంది పనితీరుకు నిదర్శనం. రానున్న రోజుల్లో మరింత మెరుగైన విద్యుత్ ఉత్పత్తికి కృషి చేస్తాం.

– ఏవీ సుబ్రహ్మణ్యేశ్వరావు, సీనియర్ ఇంజనీర్, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం

అజయ్‌జైన్‌కు అదనపు బాధ్యతలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అజయ్ జైన్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులిచ్చారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం అజయ్‌జైన్ గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా షర్మిల రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మేడపాటి షర్మిల రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులిచ్చారు. రెండేళ్ల పాటు ఆమె చైర్మన్ హోదాలో కొనసాగనున్నారు.